సాక్షి 24|7

విశాఖ సిటీ

సోమవారం 21-8-2017

మోడల్ సిటీ

- సత్తాచాటుతున్న విశాఖ మోడల్స్
- ర్యాంప్‌పై హొయలుపోతున్న వైజాగ్ బ్యూటీస్

సెంటర్‌స్ప్రెడ్‌లో..






మ్యూజియానికి నవ్య నావికాశోభ

- 9లో

అక్కడ ఫిట్టరే ఫిట్.. అంతా నా ఇష్టం

సింహాచలం ఈవో వితండ వాదన

- ఏదైనా అతను మేనేజ్ చేయగలడు
- అందుకే అప్పజెప్పామని వ్యాఖ్య
- అప్పన్న గోశాల, నృసింహవనం నిర్వహణపై సాక్షి కథనానికి స్పందించిన ఈవో



గోశాల ఆదాయ వ్యయాలను వివరిస్తున్న ఈవో రామచంద్రమోహన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం నిర్వహణలోని అప్పన్న గోశాల, నృసింహవనాల పర్యవేక్షణకు ఫిట్టరే ఫిట్ అని సింహాచలం ఈవో రామచంద్రమోహన్ తేల్చేశారు. వాటి పర్యవేక్షణకు ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈవో) ఎం.కృష్ణమాచార్యులు, సూపరింటెండెంట్ డి.బంగారునాయుడు ఉన్నప్పటికీ ఫిట్టర్ కమ్ మెకానిక్‌గా పనిచేస్తున్న డి.వి.ఎస్.రామరాజు అలియాస్ హరియే

మిగతా 2వ పేజీలో ▶

నెత్తుటి మరకలు

- నగరంలో 6 నెలల్లో 10 హత్యలు
- వరస సంఘటనలతో జనం బెంబేలు
- ప్రశ్నార్థకంగా శాంతిభద్రతలు



ప్రియుడి చేతిలో ప్రియురాలు హతం.. భర్త చేతిలో భార్య హత్య.. యువకుడిని హతమార్చిన గుర్తు తెలియని వ్యక్తులు.. అంటూ తరచుగా వస్తున్న వార్తలతో విశాఖ ప్రజలు హడలిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ సంఘటనలు పోలీస్ యంత్రాంగానికి సవాలు విసురుతున్నాయి. ప్రశాంతతకు మారు పేరుగా భావించే విశాఖలో ఇటీవల పెరుగుతున్న నేర ప్రవృత్తి ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని, నేరాలు, ఘోరాలు నామమాత్రమని ఇన్నాళ్లూ అంతా భావించేవారు. ఇటీవల హత్యలు, హత్యాయత్నాలు, ప్రేమోన్మాదుల ఘాతుకాలు ఎక్కువయ్యాయి. ఎక్కడో చోట అఘాయిత్యాలు చోటు చేసుకుంటూ నగరంలో అశాంతి, అలజడి రేపుతున్నాయి.

సాక్షి, విశాఖపట్నం/అల్లిపురం:

నగరంలో రోజురోజుకు ఉన్మాదుల ఘాతుకాలు పెరిగిపోతున్నాయి. ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి.. ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రశాంత నగరంగా పేరొందిన విశాఖలో వరుస ఘటనలతో వీరు భీతిల్లుతున్నారు. హత్యలు, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని చెబుతున్న పోలీసు ఉన్నతాధికారుల మాటలు వట్టివేనని ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయి. శివారు ప్రాంతాలు, నగర నడిబొడ్డు అన్న భేదం లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ

మిగతా 2వ పేజీలో ▶

మూడేళ్లలో హత్య కేసుల వివరాలు

సంవత్సరం	హత్యలు	పరిష్కారమైనవి	దర్యాప్తులో..
2014	27	21	5
2015	16	14	2
2016	32	06	26

2017లో రిపోర్ట్ అయిన హత్యలు 10

హాత విధీ.. ఇదేమి వారధి

- చెక్క వంతెనతో చిక్కులు
- అదుపు తప్పితే నదిలో పడాల్సిందే
- వారం రోజుల క్రితం నదిలో పడిన మహిళలు
- సమీపంలోని రైతులు రక్షించడంతో తప్పిన ప్రమాదం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



రాంబిల్లి(యలమంచిలి):మండలంలోని మూలజంప గ్రామంలో సుమారు 2 వేల మంది ఉంటున్నా రు. వీరిలో అధికశాతం మంది వ్యవసాయదారులే. పశువుల పాకల వద్దకు, పంటపొలాలకు వెళ్లాలంటే నదిని దాటాల్సిందే. దీంతో ఏటా గ్రామస్తులు చందాలు వేసుకొని తాటి చెక్కలతో వంతెన నిర్మించుకుంటారు. ప్రమాదమని తెలిసినా మరో మార్గం లేక ఈ చెక్క వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్యతో సతమతమవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకొచ్చినా పట్టించుకోలేదంటున్నారు. చెరకు క్రషర్లు శారద నది ఆవల ఉండడంతో రాత్రిళ్లూ ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగి స్తుంటారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఈ చెక్కలపై రాకపోకలు సాగించేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం చెక్క విరిగి పోయి 10 మంది మహిళలు నది లో పడి పోయారు. అప్పట్లో తక్కువగా నీరు ఉండటంతో పాటు అక్కడే ఉన్న రైతు వి.రాముతోపాటు మరికొందరు స్పందించి వెంటనే నదిలోకి దిగి మహిళలను రక్షించి ఒడ్డుకు చేర్చారు. మహిళలు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఇటీవల ఒక తెప్పను ఇక్కడ ఏర్పాటు చేశారు. దీనిని నిర్వహించే వారు లేకపోవడంతో ఒడ్డున వృథాగా పడి ఉంది.

అక్కడ ఫిట్టరే ఫిట్.. అంతా నా ఇష్టం

▶ 1వ పేజీ తరువాయి

ఎక్కువ కష్టపడి పని చేస్తుంటాడని సర్టిఫికెట్ ఇచ్చేశారు. 'అప్పన్న గోశాల, నృసింహవనం.. ఫిట్టర్‌దే పెత్తనం.. అక్కడంతా చిరుద్యోగిదే ఇష్టారాజ్యం' శీర్షికన శనివారం సాక్షిలో వచ్చిన కథనంపై ఈవో స్పందించారు. ఆదివారం ఆయన సాక్షి ప్రతినిధితో మాట్లాడారు. గోశాల నిర్వహణపై ఎంతో ఆసక్తి ఉందని హరి చెప్పడంతోనే ఆయనకు అప్పజెప్పామని ఈవో చెప్పుకొచ్చారు. అదేంటి అర్హత, ప్రామాణికాలు ఉండాలి కదా... ఆసక్తి ఉందని ఎవరైనా మీ ఉద్యోగం అడిగితే అలానే అప్పజెప్పేస్తారా.. అని ఈవోని సాక్షి సూటిగా ప్రశ్నిస్తే అది వేరు.. ఇది వేరు.. అని వ్యాఖ్యానించారు. పర్యవేక్షణ చేయాల్సిన ఇద్దరు అధికారులను కాదని ఓ ఫిట్టర్‌కు పెత్తనం అప్పజెప్పడంపై వస్తున్న ఆరోపణలు ఒకింత బాధించినా.. లెక్కచేయనన్నారు. నిబంధనల మాట ఎలా ఉన్నా.. ఆలయ ఈవోగా ఎవరికి ఏ బాధ్యత అప్పజెప్పాలనేది తన స్వేచ్ఛకు సంబంధించిన వ్యవహారమన్నారు. అయినా వాళ్లు వీళ్లు ఎందుకు.. నేను కూడా వారంలో నాలుగైదు రోజులు గోశాల వెళ్లి పర్యవేక్షిస్తాను.. రాష్ట్రంలోనే అప్పన్న గోశాల అతి పెద్ద గోశాలగా మారుతుంది.. అని వ్యాఖ్యానించారు. గోశాల, నందనవనం నిర్వహణపై ఎవరికీ ఎటువంటి అనుమానాలు అక్కరలేదని ఈవో రామచంద్రమోహన్ స్పష్టం చేశారు.

కచ్చితంగా రికార్డుల నిర్వహణ:ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన గోశాల, నృసింహవనం రికార్డులు కచ్చితంగా నిర్వహిస్తున్నట్టు ఈవో కె.రామచంద్రమోహన్ చెప్పారు. సాక్షి కథనానికి ఆయన ఆదివారం వివరణ ఇచ్చారు. దేవస్థానంలో ఒక్కొక్కరికీ ఒక్కో పోస్టు ఉండొచ్చని, కొన్ని పరిస్థితిల్లో కొందరికి అదనపు బాధ్యతలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఉత్సవాల రోజుల్లో పై పరిస్థితులు ఎక్కువగా ఉంటాయన్నారు. ఒక్కొక్కరికీ ఒక్కో పనిపై ఆసక్తి ఉంటుందని, వారికి ఆయా పనులను కల్పించేందుకు వీలు కల్పిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే ఫిట్టర్‌కి గోశాల ఇన్‌చార్జి అప్పగించామన్నారు.

రోల్‌మోడల్‌గా గోశాల, నృసింహవనం

సుమారు వంద ఎకరాల స్థలంలో రోల్‌మోడల్‌గా గోశాల, నృసింహవనాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు ఈవో తెలిపారు. దేవస్థానం సిబ్బందితోపాటు అవగాహన ఉన్న కొంతమంది విద్యార్థులు, ప్రొఫెసర్లు, భక్తుల భాగస్వామ్యం కూడా నృసింహవనం అభివృద్ధిలో ఉందన్నారు. జీవ కారుణ్యాన్ని పెంపొందించే చర్యలు అక్కడ చేస్తున్నామన్నారు. రూపాయి ఖర్చు అవ్వవలసిన చోట తాము 60 నుంచి 70 పైసలు మాత్రమే ఖర్చు చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికత, ఆరోగ్యం, ఆహ్లాదం కోసం నృసింహవనాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ తరుణంలోనే ఆయన గోశాల ఆదాయ వ్యయాలు ప్రకటించారు. ఇక్కడి కూరగాయలు అన్నదానానికి వెళ్తాయన్నారు.

గోశాల ఆదాయ వ్యయాలు

2014–15లో గోశాల ఆదాయం 4,36,720, వ్యయం 32,57,921, 2015–16లో ఆదాయం 7,7,680, వ్యయం 25,30,258, 2016–17లో ఆదాయం 6,27,620గా ఉందన్నారు. అలాగే 2014–15లో 10 లక్షల 50 వేలు, 2015–16లో 25 లక్షల 70 వేలు, 2016–17లో 28 లక్షలు, 2017–18 జూలై వరకు 7 లక్షల 75 వేల 901 విరాళాల రూపంలో వచ్చాయన్నారు. ఇంకా నృసింహవనంలోని పువ్వులు, కూరగాయల వివరాలను ఆయన వెల్లడించారు.

నెత్తుటి మరకలు

▶ 1వ పేజీ తరువాయి

అఘాయిత్యాలు జరిగిపోతూనే ఉన్నాయి. గడచిన ఆరు నెలల కాలంలోనే పదిమంది హత్యకు గురవడం శాంతి భద్రతల పరిస్థితికి దర్పణం పడుతోంది. నగరంలో తమ ప్రత్యర్థులను హతమార్చడం ఎంతో సునాయాసమైపోయింది. ఒకప్పుడు ఎక్కడైనా ఒక హత్య జరిగితే విశేషంగా చెప్పుకునే వారు. కానీ ఇప్పుడు అదే పనిగా హత్యలు జరగడం సర్వసాధారణంగా మారిపోయింది. నగరం అభివృద్ధి మాటెలా ఉన్నా ఇప్పుడు నేరాలు, ఘోరాల్లో మాత్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందనడానికి ఇటీవల జరుగుతున్న సంఘటనలను తార్కాణంగా నిలుస్తున్నాయి. నగరంలో పోలీసు వ్యవస్థపై భయం సన్నగిల్లడం వల్లే హత్యలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే నగరంలో శాంతి భద్రతలను పర్యవేక్షణకు సరిపడినంత సిబ్బంది లేరని పోలీసు అధికారులు చెబుతున్నారు. విశాఖ కమిషనరేట్ పరిధిలో 3 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది అవసరం కాగా సుమారు 2400 మంది మాత్రమే ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో గతంలో 13 పోలీస్ స్టేషన్లుండేవి. కొత్తగా మహారాణిపేట, ద్వారకానగర్, ఎంవీపీ పోలీస్ స్టేషన్ల రాకతో అవి 16కు చేరాయి. కొత్త స్టేషన్లు ఏర్పడ్డా వాటికి అవసరమైన సిబ్బంది నియామకం జరగలేదు. ప్రస్తుత సిబ్బందినే వీటిలో సర్దుబాటు చేశారు. కమిషనరేట్‌లో చేరడానికి ప్రస్తుతం 310 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పొందుతున్నారు. వీరిలో 226 మంది సివిల్, 84 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు ఉన్నారు. శిక్షణ పూర్తయ్యాక వీరిలో ఎంతమంది విధుల్లో చేరతారో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో రౌడీషీటర్లను, నేరస్తులను కట్టడి చేయడం, వారిపై నిఘా పెట్టడం కష్టతరమవుతుందని, ఫలితంగా నేరాల నియంత్రణ కష్టసాధ్యమవుతోందని పోలీసు అధికారులు పరోక్షంగా అంగీకరిస్తున్నారు. గతం కంటే పెట్రోలింగ్ వ్యవస్థ కూడా అంతగా చురుగ్గా లేదని అంటున్నారు.

ఇటీవల జరిగిన అఘాయిత్యాల్లో కొన్ని..

- 2017 ఫిబ్రవరి 11 నక్కవానిపాలెం, పీఅండ్‌టీ కాలనీ, గాంధీనగర్‌లో ఆస్తి తగాదాల్లో వంకల సురేష్ (37) అనే యువకుడిని సొంత భావ సురేష్ హత్య చేశాడు.
- ఏప్రిల్ 7వ తేదీ రాత్రి మద్దిలపాలెం, సింగర్ బార్ వద్ద రౌడీ షీటర్ మళ్ల వెంకట రమణను తోటి రౌడీ షీటరును హతమార్చాడు.
- జూలై 8న పూర్ణామార్కెట్, పండావీధిలో ప్రియుడు బొండలపూడి సతీష్ తన ప్రియురాలు బురళి భవానీని ఇంటికి రమ్మని చెప్పి ఆమెపై చాకుతో పీక కోసి, డంబుల్స్‌తో తలపై మోది మరి కిరాతకంగా చంపేశాడు.
- అదే రోజు జిల్లాలోని బుచ్చయ్యపేట మండలం కండిపూడికి చెందిన పెయింటర్ కొప్పాక గణేష్ తన భార్య మారుతి కాపురానికి రావటం లేదని కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్‌లో అత్తవారింట్లో ఉన్న ఆమెను, అత్త మొద్దు జమునను బలమైన ఆయుధంతో మోదడంతో ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు.
- జూలై 10వ తేదీ రాత్రి గాజువాక మార్కెట్ రోడ్డులో ఏడుమెట్ల మర్రిపాలేనికి చెందిన గండేపల్లి ముత్యాలు అలియాస్ శ్రీను మాంసం కొట్టు నిర్వాహకుడు హత్య చేశాడు.
- జూలై 13న పెదగంట్యాడ మండలం చిన నడుపూరులో భర్త దాకారపు అప్పలరాజు, తన భార్య రామలక్ష్మిని పీటతో ముఖంపై మోది హతమార్చాడు.
- గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో లారీ కేబిన్‌లోనే క్లీనర్ హత్యకు గురయ్యాడు.
- జూలై 18న బీచ్‌రోడ్డు షీ సర్ఫ్ అపార్టుమెంట్‌లో క్రేన్ వ్యాపారి విక్రమ్ ప్రకాష్ ధమేజా, అతని భార్య, కారు డ్రైవర్‌పై బీహార్, జార్ఖండ్‌కు చెందిన దుండగులు కత్తులతో దాడి చేసి హత్య చేశారు.
- ఈ నెల 19న భీమిలి మండలం టి.నగరపాలెంలో తన ప్రేమను అంగీకరించలేదని పతివాడ హరిసంతోష్, విద్యార్థిని పొట్నూరి రూప, అడ్డొచ్చిన ఆమె సోదరుడు ఉపేంద్రలపై కిరోసిన్ పోసి తగులబెట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ హతమయ్యారు.
- 19 రాత్రి ఆరిలోవ పాండురంగాపురం వద్ద రౌడీషీటర్ సాదె వినయ్ సంపత్‌ను అతని ప్రత్యర్థులు పాత కక్షలతో దాడిచేసి దారుణంగా హతమార్చారు.

సిబ్బంది కొరత ఉంది..



విశాఖలో గతంలో 13 పోలీస్‌స్టేషన్లు ఉండేవి. వాటికి ఎంవీపీ, ద్వారకానగర్, మహారాణిపేట పోలీస్ స్టేషన్లతోపాటు సైబర్ క్రైం సెల్, సీటీఎఫ్ పోలీస్ స్టేషన్లు అదనంగా ఏర్పడ్డాయి. అందుకనుగుణంగా స్టాఫ్ పెరగలేదు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా సిబ్బంది పెరగక ఉన్నవారినే సర్దుబాటు చేయాల్సి వస్తుంది. కొంతమందిని ప్రోటోకాల్ విధులకు పంపాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సిబ్బంది కొరత వాస్తవం. ఉన్నవారితోనే నగర శాంతిభద్రతలు అదుపులో ఉంచుతున్నాం. త్వరలో కొత్త 400 మంది కానిస్టేబుళ్లు వస్తున్నారు. దీంతో కొంత కొరత తీరనుంది. ఇప్పటికే నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి ఆదివారం స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పిస్తున్నాం. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచుతున్నాం. పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్ల ఫోటోలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశాం. **–దాడి నాగేంద్రకుమార్**, నగర జాయింట్ పోలీస్ కమిషనర్

సుప్రీం కోర్టులో న్యాయం జరగొచ్చు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది వసుధ నాగరాజ్, చిత్రంలో రామారావు దొర, జీవన్‌కుమార్, కె.పద్మ తదితరులు

- వాకపల్లి సంఘటనపై మేధావుల ఆశాభావం
- గిరిజన మహిళల పోరాటానికి పదేళ్లు
- మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): వాకపల్లి బాధిత గిరిజన మహిళలకు సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని మేధావులు వ్యక్తంచేశారు.

విశాఖ ఏజెన్సీ జి.మాడుగుల మండలం వాకపల్లిలో 2007 ఆగస్టు 20న గ్రేహౌండ్స్ దళాలు 11 మంది కోంధు మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదులు రావడం అప్పట్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన చోటుచేసుకుని పదేళ్లు పూర్తయిన సందర్భంగా విశాఖలోని ఒక హోటల్లో ఆదివారం మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది వసుధ నాగరాజ్ మాట్లాడుతూ, అప్పట్లో కొండకోనల్లో 15 కిలోమీటర్లు నడుచుకుంటూ పాడేరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చి బాధిత మహిళలు ఫిర్యాదు చేశారంటే గ్రేహౌండ్స్ పోలీసులు ఎన్ని చిత్ర హింసలకు గురిచేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ సంఘటనపై నిందితులైన 21 మంది పోలీసులపై కేసు నమోదు చేసి విచారించాలని 2008 ఆగస్టులో పాడేరు మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పిందని గుర్తుచేశారు. అయితే నిందితులు హైకోర్టుకు వెళ్లడంతో విచారణపై స్టే ఇచ్చారన్నారు. ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించగా వారు పోలీసులు అత్యాచారానికి పాల్పడలేదని నివేదిక ఇవ్వడం దారుణమన్నారు. అప్పట్లో ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను కూడా ప్రభావితం చేశారని ఆరోపించారు. న్యాయం కోసం గిరిజన మహిళలు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టులో ఉందని, ఒక వేళ అక్కడా కొట్టివేస్తే అది కోర్టు ఓటమి అవుతుంది తప్ప ఆదివాసీ మహిళల ఓటమి కాదని అభిప్రాయపడ్డారు. ఆదివాసీ రచయితల సంఘం రామారావు దొర మాట్లాడుతూ కోంధు జాతి ప్రజలను పోలీసులు మావోయిస్టుల్లా చూస్తున్నారని, వారిని అన్యాయంగా అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.దీంతో గత పదేళ్లుగా వాకపల్లి గ్రామస్తులు బయటకు రావటం మానేశారన్నారు. మానవ హక్కుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనులు మావోయిస్టులకు సహాయం చేస్తున్నారనే నేపంతో పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేసి చిత్ర హింసలకు గురుచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాకపల్లి మహిళలు అన్నిరకాల ఒత్తిళ్లనూ తట్టుకుని ధైర్యంగా నిలబడటం గొప్పవిషయమన్నారు. ఈ పదేళ్ల కాలంలో ఇద్దరు బాధిత మహిళు మరణించారని తెలిపారు.మహిళా చేతన నాయకురాలు కె.పద్మ మాట్లాడుతూ, మావోయిస్టులపై ప్రతీకారం కోసమే గ్రేహౌండ్స్ దళాలు వాకపల్లి మహిళలపై అత్యాచారానికి పాలప్డారని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా వాటిని బయటకు రానీయకుండా ఉన్నాతాధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

జీవీఎంసీ ఉద్యోగుల సామూహిక సెలవు రేపు



సమావేశంలో మాట్లాడుతున్న గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆనందరావు


- **జీవో 279 రద్దయ్యే వరకూ పోరాటం**
- **జీవీఎంసీ గుర్తింపు యూనియన్ కార్యవర్గ సమావేశంలో తీర్మానం**

విశాఖ సిటీ: మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లోని ప్రజారోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పెద్ద ఎత్తున పోరాటం సాగించాలని జీవీఎంసీ గుర్తింపు యూనియన్ తీర్మానించింది. పబ్లిక్ హెల్త్‌లో డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, ఇన్‌స్పెక్టర్లు సహా.. అందరూ మంగళవారం సామూహిక సెలవు పెట్టాలని నిర్ణయించింది. జీవీఎంసీ కార్యాలయంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆనందరావు మాట్లాడుతూ జీవో 279ను రద్దు చేసే వరకూ చేసే పోరాటంలో ఉద్యోగులు, కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో సాధించిన విజయం అందరి కృషి అని ఆయన కొనియాడారు. వచ్చే నెల 6న విజయోత్సవ సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సభలో యూనియన్ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆత్మీయ సత్కారం చేస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇళ్ల మంజూరుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జీవీఎంసీ ఉద్యోగ, కార్మికులకు సంబంధించి 41 డిమాండ్ల పరిష్కారానికి కమిషనర్ హరినారాయణన్ అంగీకరించారని వెల్లడించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రాయితీలు త్వరలో అందుతాయన్నారు. ప్రధాన కార్యదర్శి కె.బి.తిలక్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ లంకా భాస్కర్ మాట్లాడుతూ జీవో నంబర్ 151 అమలు, సబ్సిడీ క్యాంటీన్లు, ఎడ్యుకేషనల్ టూర్లు త్వరలోనే అమలవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలనాయుడు, 8 మంది వర్కింగ్ ప్రెసిడెంట్లు, 32 మంది వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, అసిస్టెంట్ పబ్లిక్ సెక్రటరీలు, జోనల్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవ పోటీలకు ఆహ్వానం

ఏయూక్యాంపస్(విశాఖ తూర్పు): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు ఏయూ సమన్వయకర్త ఆచార్య ఎన్.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టర్ పెయింటింగ్, పేపర్ ప్రెజెంటేషన్, క్విజ్, టూరిజం ఫొటోగ్రఫీ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

➡ సుస్థిర పర్యాటకం–అభివృద్ధికి ఒక సాధనం అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీ ఉంటుంది. ఈ అంశం ఆధారంగా స్పాట్ పెయింటంగ్ చేయాల్సి ఉంటుంది.



➡ పేపర్ ప్రెజెంటేషన్‌లో టూరిజం–ఏన్ ఎకనామిక్ అండ్ సోషల్ ఫినామినా, అర్బన్ టూరిజం అండ్ కల్చరల్ హెరిటేజ్, హాస్పిటాలిటీ, టూరిజం మేనేజ్‌మెంట్ మార్కెటింగ్, టూరిజం అండ్ ఎన్విరాన్‌మెంట్, ఎంటర్‌ప్యూనర్‌షిప్ ఇన్ టూరిజం అండ్ హాస్పిటాలిటి, సస్టైనబుల్ టూరిజం–ఏ టూల్ ఫర్ డెవలప్‌మెంట్, జీఐఎస్ అప్లికేషన్ ఇన్ టూరిజం, డెస్టినేషన్ మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్, టూరిజం ప్లానింగ్ రీజినల్ డెవలప్‌మెంట్, న్యూ టైప్స్ ఆఫ్ టూరిజం అంశాలపై వ్యాసాలు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధికి ఉపకరించే అంశాలను దీనిలో ప్రస్తావించి, వివరించాలి. నాలుగు వేల పదాలకు మించకుండా వ్యాసం ఉండాలి.

➡ క్విజ్ పోటీల్లో 60 శాతం ప్రశ్నలు ఏపీ పర్యాటకంపైన మిగిలిన 40 శాతం ప్రశ్నలు వర్తమాన అంశాలపై ఉంటాయి. ఒక్కో బృందంలో ఇద్దరు విద్యార్థులు ఉండాలి.

➡ ఏపీ పర్యాటక ముఖచిత్రాన్ని ప్రతిబింబించే విధంగా ఫొటోలు ఉండాలి. ఒక్కో విద్యార్థి గరిష్ఠంగా మూడు ఫొటోలను పోటీకి పంపవచ్చును. 2.5 మెగా పిక్సెల్స్‌కు తగ్గకుండా నాలు గు వేల మెగా పిక్సెల్స్‌కు మించని క్వాలిటీ కలిగి ఉండాలి. ఒక ఒరిజినల్ ప్రింట్, సాఫ్ట్ కాపీలను విద్యార్థి తమ స్వీయ లేఖను జరపరచి అందించాలి. డిజిటల్ సాంకేతిక సహకారంతో తీర్చిదిద్దిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోం. జేపీఈజీ ఫార్మాట్‌లో 4 ఎంబీల కంటే తక్కువ నిడివితో ఫొటోలను పంపాల్సి ఉంటుంది.

➡ పోస్టర్ పెయింటింగ్, క్విజ్ పోటీలను జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తారు. విశాఖపట్నంలో వచ్చేనెల 6న ఉదయం 10 గంటలకు ఎంబీఏ అనెక్స్ భవనం(ఏయూ అవుట్‌గేట్ వద్ద), శ్రీకాకుళంలో వచ్చేనెల 7న, విజయనగరం ఎంఆర్ పీజీ కళాశాలలో వచ్చే నెల 8న పోటీలు జరుగుతాయి. ఇతర సమాచారం కోసం ఏయూ వెబ్‌సైట్ www.andhrauniversity.edu.in, ఏయూ సమన్వయకర్త ఆచార్య ఎన్. సాంబశివరావు (9848170274)ను సంప్రదించవచ్చును. విజేతలకు వచ్చేనెల 27న పర్యాటక శాఖ నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తారు.

స్పందించకుంటే.. ఉద్యమం ఉధృతం

- అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణం న్యాయం చేయాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్
- విశాఖ చేరుకున్న బస్సు యాత్ర



మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

ద్వారకానగర్(విశాఖ దక్షిణ): ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణం న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. అగ్రిగోల్డ్ బాధితులు చేపట్టిన బస్సు చైతన్య యాత్ర ఆదివారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ యాత్రకు సీపీఐ నాయకులు జె.వి.ప్రభాకర్, విమల, వామనమూర్తి, ఆప్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముపాళ్ల మాట్లాడుతూ మృతి చెందిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేసియో ప్రకటించి నాలుగు నెలలు గడిచినా.. నేటికి ఒక్క కుటుంబా నికి కూడా పరిహారం చెల్లించలేదని ధ్వజమెత్తారు. 120 రోజుల్లో డిపాజిట్లు తిరిగి చెల్లించడాన్ని ప్రారంభిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ కీలక డైరెక్టర్ అవ్వా సీతారామారావుతో పాటు నిందితులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం వ్యక్తిగత, బినామీల పేరు మీద ఉన్న ఆస్తులను అటాచ్ చేయాలన్నారు. పలు స్కీముల్లో ప్లాట్లు కొన్న వారందరికీ పూర్తి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో 19.52 లక్షల మంది డిపాజిట్‌దార్లలో రూ.20 వేలలోపు దాచుకున్న ఖాతాదారులు 13 లక్ష మందికి పైగా ఉన్నారని గుర్తు చేశారు. ఇటీవల 142 మంది అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలకు, గుండెపోటులకు, మానసిక వేదనకు గురై ప్రాణాలు పోగుట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవించుకున్నా ఫలితం లేదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే ఈ యాత్ర చేపట్టినట్టు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని, అప్పటికీ స్పందించపోతే ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. రాబోయే 2019లో ఎన్నికల్లో చంద్రబాబును ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి మోదీకి అగ్రిగోల్డ్‌పై సీబీఐ విచారణ చేయించాలని వినతిపత్రం ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు స్టాలిన్, అగ్రిగోల్డ్ రాష్ట్ర కమిటీ ప్రతినిధి తిరుపతిరావు, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా కార్యదర్శి టి.డి.ప్రసాద్‌రావు, ఆప్ నాయకుడు పోతిన వెంకటరమణరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హిందుస్తానీ గాత్ర కచేరి

విశాఖ–కల్చరల్ : ఆర్కేబీచ్ రాజీవ్ స్మృతిభవన్ సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి స్మారక ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన హిందుస్తానీ సంగీత గాత్ర కచేరి అలరించింది. మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ 73వ జయంతిని పురస్కరించుకొని తారకేశ్వర ఫౌండేషన్ వ్యవస్థాపకులు సహదేవ్ సింగ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన గాత్ర కచేరిలో కోల్‌కతాకు చెందిన మహుయా నంది ఆలపించిన మధురమైన గానామృతాలు సంగీతప్రియుల్ని ఆకట్టుకున్నాయి. ప్రముఖ వాగ్గేయకారులు కృతుల నుంచి ఆలపించి ఐదు మధురమైన గేయాలు ఆలపించారు. కచేరికి వయోలిన్ డాక్టర్ తిన్నిర్ బరణ్ గౌస్, తబల డాక్టర్ ధనాంజనయ్‌లు వాయిద్య సహకారాన్ని అందించారు.



గాత్ర కచేరీ చేస్తున్న మహుయా నంది

భవిష్యం

మేషం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. బంధువర్గంతో తగాదాలు. అనారోగ్యం. వ్యాపారాలు, ఉద్యోగాలలో గందరగోళంగా ఉంటుంది. దేవాలయదర్శనాలు.

వృషభం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. నూతన పరిచయాలు. అందరిలోనూ గుర్తింపు. యత్నకార్యసిద్ధి. పరపతి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి.

మిథునం: ఆదాయానికి మించి ఖర్చులు. కొత్త బాధ్యతలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్య సూచనలు. ఆస్తి వివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు.



కర్కాటకం: నూతన ఉద్యోగ ప్రాప్తి. చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. మీ సేవలకు గుర్తింపు లభిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

సింహం: ప్రయాణాలలో ఆటంకాలు. కార్యక్రమాలు వాయిదా వేస్తారు. సోదరులతో భూవివాదాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఇబ్బందులు. అప్పులు చేయాల్సివస్తుంది.

కన్య: నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆలోచనలు అమలు చేస్తారు. గత సంఘటనలు గుర్తుకొస్తాయి. వ్యాపార, ఉద్యోగాల్లో ఉత్సాహవంతంగా ఉంటుంది. దేవాలయ దర్శనాలు.

తుల: ఇంటిలో శుభకార్యాలు. ఆకస్మిక ధనలాభం. యత్నకార్యసిద్ధి. హోదాలలో ఉన్న వారితో పరిచయాలు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ముందుకు సాగుతారు.

వృశ్చికం: దూరప్రయాణాలు. కార్యక్రమాలలో అవాంతరాలు. విలువైన వస్తువులు జాగ్రత్త. కష్టానికి తగ్గ ఫలితం ఉండదు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మార్పులు ఉండవచ్చు.

ధనుస్సు: కొన్ని కార్యక్రమాలు వాయిదా వేస్తారు. బంధువులతో అకారణ వైరం. ఆరోగ్య, కుటుంబసమస్యలు. భూవివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు.

మకరం: కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయుల నుంచి శుభవర్తమానాలు. అదనపు రాబడి ఉంటుంది. సన్నిహితులు, స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

కుంభం: కార్యజయం. శుభకార్యాలలో పాల్గొంటారు. పాత స్నేహితులను కలుసుకుంటారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం.

మీనం: కార్యక్రమాలలో ఆటంకాలు. వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. బంధువులు, స్నేహితులతో తగాదాలు. కాంట్రాక్టులు చేజారతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిక్కులు తప్పవు.

– సింహంభట్ల సుబ్బారావు

పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు ఏర్పాట్లు

మురళీనగర్(విశాఖ ఉత్తరం): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు సంబంధించి సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డి.ఫణీంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఏర్పాటైన అలూమిని సభ్యుల ఆత్మీయ కలయికకు వేదికను సిద్ధం చేశామన్నారు. పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో నిర్మించిన అధునాతన సెంట్రల్ ఏసీ కలిగిన ఆడిటోరియంలో ఈ సమావేశాన్ని ఈనెల 27వ తేదీన నిర్వహిస్తామన్నారు. ఇదే వేదికపై కళాశాల స్వరోత్సవాల నిర్వహణ, కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సలహాలు, ఆర్థిక సహకారం, ఆర్థిక వనరుల సేకరణపై చర్చిస్తామన్నారు. పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వివరాల కోసం 991234 2009 నంబరులో సంప్రదించాలని కోరారు.

25 నుంచి యెహోవా సాక్షుల సమావేశం

మర్రిపాలెం: యెహోవా సాక్షుల సమావేశం ఈ నెల 25 నుంచి 27 వరకూ జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు. మద్దిలపాలెం ప్రాంతం కళాభారతి ఆడిటోరియంలో ప్రతి రోజు ఉదయం 9.20 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశాలలో ప్రసంగాలు, ఇంటర్వ్యూలు, ఆడియో–వీడియో కార్యక్రమాలు, వీడియా డ్రామాలు ఉంటాయన్నారు. బైబిలు ఇస్తోన్న జవాబు ఏమిటో ఆఖరి రోజు ఆదివారం ఉదయం జరగబోయే 'ఆశ వదులుకోకండి' అనే బహిరంగ ప్రసంగంలో తెలుసుకోవచ్చని వివరించారు. ప్రవేశం ఉచితమని చందాలు సేకరించరని సూచించారు.

భూసేకరణ, పునరావాసాల ప్రత్యేక అధికారిగా జయసూర్య

అల్లిపురం (విశాఖ దక్షిణం): భూసేకరణ, పునరావాస వివాదాలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విశాఖపట్నం రీజియన్ ప్రత్యేక అథారిటీ ప్రిసైడింగ్ అధికారిగా రిటైర్డ్ జిల్లా జడ్జి వి.జయసూర్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ రీజియన్ పరిధిలో గల విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల్లో జరిగే భూసేకరణలో ఉత్పన్నమయ్యే నష్టపరిహారం చెల్లింపు, పునరావాస వివాదాలను పరిష్కరించే అధికారం ఈ ప్రత్యేక అథారిటీ పరిధిలోకి వస్తుంది.

మధురానగర్‌లో శంకరమఠం దగ్గర్లో ఎల్బీ క్లాసిక్స్ భవనం మొదటి అంతస్తులో ఈ ప్రత్యేక అథారిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

పోలీసు యాప్‌పై యువకులకు అవగాహన

చోడవరం టౌన్: పోలీస్ యాప్‌పై యువకులకు అవగాహన అవసరమని సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక సీఐ కార్యాలయంలో యువకులకు పోలీస్ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించేలా సీపీవోలను (కమ్యూనిటీ పోలీస్ వాలంటీర్లు) ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టణంలో అయితే వార్డుకి 20 నుంచి 30 మందిని గ్రామాల్లోఅయితే 30 నుంచి 40 మందిని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఆదివారం వారికి ధ్రువపత్రాలు అందించారు. యాప్ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చునని అన్నారు. ఎల్.హెచ్.ఎం.ఎస్ పరికరాలు ఏర్పాటును ప్రారంభించారు. దూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగించేవారు ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇంటికి ఈ పరికరాలు ఏర్పాటు చేస్తామని ఎవరైనా చోరీకి పాల్పడితే వెంటనే ఇంటి యజమానితో పాటు పోలీసులకు సమాచారం అందుతుందని సీఐ అన్నారు.

విశాఖ బులియన్

గోల్డ్ 24 క్యారట్స్ 10గ్రా.	29,990
గోల్డ్ 22 క్యారట్స్ 10గ్రా.	27,590
వెండి కిలో ధర	40,500

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	362.00
విజయనగరం	366.00
శ్రీకాకుళం	366.00

వెండితెర తెలుగు / హిందీ / ఇంగ్లీష్





ఆనందో బ్రహ్మ : శారద : విశాఖపట్నం, ఫోన్: 2564796, 11.00, 2.30, 6.15 10.00, వీమ్యాక్స్ స్క్రీన్–2, 11.15, 2.30, 6.15, 10.00, శ్రీకన్య విశాఖపట్నం : 11.00, 2.30, 6.30, 9.30,సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

నేనేరాజు నేనే మంత్రి : జ్యోతి : విశాఖపట్నం. ఫోన్: 2788788, 11.00,2.30, 6.15,9.30, శ్రీరామా : విశాఖపట్నం ఫోన్: 2552445, 11.00, 2.45, 6.15, 9.45, ఊర్వశి : కంచరపాలెం, 10.45, 2.00, 5.35, 9.00 సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

జయ జానకి నాయక : వీ మ్యాక్స్ స్క్రీన్–3, 11.30, 2.30, 6.30,10.00, శరత్ విశాఖపట్నం: ఫోన్: 2747151,11.00, 2.30, 6.15, 9.45, శ్రీవెంకటేశ్వర : విశాఖ పట్నం, ఫోన్: 2565566, 11.00, 2.30, 6.30, 9.30, రమాదేవి : విశాఖపట్నం, ఫోన్: 2564796, 11.30,2.30, 6.30, 10.00, కామేశ్వరి : మద్దిలపాలెం : ఫోన్: 6525600, 11.00, 2.30, 6.15, 9.45, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్–1(104 ఏరియా) ఫోన్: 2558658, 10.45 2.00, 5.35, 8.40. సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్, ముక్తాస్,

లై : లీలామహల్, విశాఖపట్నం, ఫోన్: 2562480, 11.00, 2.30, 6.30, 9.15, వెంకటేశ్వర : ఫోన్: 2565 566, 11.00, 2.30, 6.15, 9.30, మెలోడి: ఫోన్: 10.45, 2.30, 6.15, 10.00,కిన్నెర : మద్దిలపాలెం: 6525600, 11.00, 2.30,6.15, 9.45, గోకుల్, విశాఖపట్నం: 11.00, 2.30, 6.15, 9.30,శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్–2 : (104 ఏరియా) ఫోన్: 2558658, 11.00, 2.15, 6.00, 9.00,సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ

నక్షత్రం : వీ మ్యాక్స్ స్క్రీన్–1 ఫోన్: 6060999, 10.30, 1.45, 5.40, 8.45, సంగం : విశాఖపట్నం: ఫోన్: 2747150, 11.00, 2.30, 6.15, 9.15,

ఫిదా : జగదాంబ : ఫోన్: 2564796, 11.00, 2.30, 6.15, 10.00,సీఎంఆర్, వరుణ్, చిత్రాలయ ఐనాక్స్,

గౌతమ్‌నంద : పరమేశ్వరి : కంచర పాలెం 10.30, 1.45, 5.40, 8.45,

తిరుమల సమాచారం



- తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం : గదుల వివరాలు:

- ఉచిత గదులు –ఖాళీ లేవు
- రూ.50 గదులు –ఖాళీ లేవు
- రూ.100 గదులు– ఖాళీ లేవు
- రూ.500 గదులు– ఖాళీ లేవు

సేవలు

- సహస్రదీపాలంకరణ సేవ– ఖాళీ లేవు
- వసంతోత్సవం–ఖాళీ లేవు
- ఆర్జిత బ్రహ్మోత్సవం –ఖాళీ లేవు
- సోమవారం ప్రత్యేక సేవ : విశేష పూజ

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ నికోబార్ దీవులు, పశ్చిమ తీరం, మధ్య మహారాష్ట్ర, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు గుజరాత్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయువ్య మైదానాలు, తూర్పు రాజస్తాన్, తూర్పు, మధ్య భారతంలోని మిగిలిన ప్రాంతాల్లో చిరుజల్లులు కురవచ్చు.

విశాఖపట్నం వాతావరణం

గరిష్టం కనిష్టం

[illegible]

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	29.6	26.0
కోల్‌కతా	32.7	27.2
బెంగళూరు	28.6	20.3
ముంబై	27.8	25.6
చెన్నై	34.3	24.6

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
నెల్లూరు	34.6/28.0	కర్నూలు	29.1/23.2
చిత్తూరు	34.4/26.2	నల్లగొండ	28.6/23.4
తిరుపతి	34.4/26.2	గుంటూరు	28.2/24.0
అనంతపురం	33.8/24.7	కాకినాడ	27.5/24.7
శ్రీకాకుళం	32.5/25.5	ఖమ్మం	27.0/19.4
విజయనగరం	32.5/25.5	కరీంనగర్	26.2/23.3
కడప	31.2/24.5	వరంగల్	26.1/24.0
ఒంగోలు	29.8/24.9	నిజామాబాద్	26.0/23.5
ఏలూరు	29.8/24.6	మహబూబ్‌నగర్	26.0/22.5
రాజమండ్రి	29.8/24.6	ఆదిలాబాద్	26.0/21.3
తాడేపల్లిగూడెం	29.8/24.6	హైదరాబాద్	25.7/21.9
విశాఖపట్నం	29.3/26.0	రంగారెడ్డి	25.7/21.1
విజయవాడ	29.1/24.1	మెదక్	25.4/21.5

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 బతుకు చిత్రం
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 జనపథం
మ.12.00 ఫస్ట్ హాఫ్ ప్రైమ్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 క్రైమ్ స్టోరీ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ


టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సాగరసంగమం
ఉ.09.30 నాగ ప్రతిష్ఠ
మ.12.00 చిరునవ్వుతో
సా.06.00 వాసు
రా.09.00 మృగరాజు



మూవీస్ నౌ
ఉ.09.00 డెమాలిషన్ మ్యాన్
ఉ.11.15 సిటీ లైట్స్
మ.01.00 యాంట్-మ్యాన్
సా.06.20 మ్యాన్ ఆఫ్ స్టీల్
రా.11.50 సూపర్‌మ్యాన్ 2




హెచ్‌బీవో
ఉ.07.21 10.000 బి.సి.
ఉ.09.20 ద గాడ్‌ఫాదర్
మ.12.29 ద హ్యాంగోవర్-2
సా.04.15 ద డార్క్ నైట్ రైజెస్
రా.07.16 ఫైనల్ డెస్టినేషన్ 5



స్టార్ మూవీస్
ఉ.06.45 గాడ్జిల్లా
మ.01.17 లైఫ్ ఆఫ్ పై
సా.06.18 స్పైడర్ మ్యాన్ 2
రా.09.00 టామ్ యమ్ గూంగ్
రా.11.18 ఇండిపెండెన్స్‌డే



మా మూవీస్
ఉ.07.00 తీన్‌మార్
ఉ.09.00 మొదటి సినిమా
మ.12.00 అసాధ్యుడు
మ.03.00 కాయ్ రాజా కాయ్
సా.05.00 ఒక లైలాకోసం



జీ సినిమా
ఉ.04.45 బిన్ బులాయే బరాతి
ఉ.09.57 మైనే ప్యార్ కియా
మ.02.13 లింగా
సా.05.29 వీర్
రా.09.00 బిజినెస్‌మ్యాన్ 2

ముడసర్లోవ పార్కులో కొట్లాట

- మద్యం మత్తులో గొడవకు దిగిన ఇరువర్గాలు
- ఇద్దరికి తీవ్రంగా, నలుగురికి స్వల్పంగా గాయాలు





గాయాలపాలైన శ్రీను, ప్రసన్న (ఇన్‌సెట్) చేతికి గాయంతో రాజయ్య

ఆరిలోవ (విశాఖ తూర్పు) : ఆరిలోవ ప్రాంతం ముడసర్లోవ పార్కులో ఆదివారం జరిగిన కొట్లాటలో ఆరుగురికి గాయాలయ్యాయి. సెలవు రోజు కావడంతో పూటుగా మద్యం సేవించిన ఇరు వర్గాల మధ్య గొడవ రేగింది. ఒకరిపై ఒకరు దాడి చేసి గాయపరుచుకున్నారు. దీంతో ఆరిలోవ వాసులు ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి జరిగిన ఓ రౌడీ షీటర్ హత్య మరవకముందే మరుసటి రోజే ఇరు వర్గాల మధ్య కొట్లాట జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరిలోవ కాలనీ శివాజీనగర్ – 2కి చెందిన సుమారు 15 మంది యువకులు ఆదివారం ముడసర్లోవ పార్కులో పిక్నిక్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారిలో కొందరు మద్యం సేవించారు. ఇదే పార్కులో చినవాల్తేరు ప్రాంతానికి చెందిన సుమారు 20 మంది యువకులు పిక్నిక్ జరుపుకున్నారు. వారు కూడా పూటుగా మద్యం మత్తులో తేలిపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఈ గ్రూపుల మధ్య తాగిన మైకంలో గొడవ రేగింది. శివాజీనగర్‌కు చెందిన ఓ యువకుడు ఖాళీ బీరు బాటిల్‌ను చినవాల్తేరు గ్రూపు వైపు విసిరాడు. ఈ బాటిలే వారి మధ్య తగాదాకు కారణమైంది. బాటిల్ ఎందుకు విసిరావని చినవాల్తేరు గ్రూపు యువకులు అడగడంతో శివాజీనగర్‌కు చెందిన యువకులు సమాధానం చెప్పడం... మాటామాటా పెరిగి గొడవ తీవ్రస్థాయికి చేరుకొంది. ఒకరిపై ఒకరు ఖాళీ మద్యం బాటిళ్లు విసురుకున్నారు. ఈ సంఘటనలో శివాజీనగర్‌కు చెందిన రాజేష్ చెయ్యి చీలిపోయింది. తేజ అనే యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరినీ చికిత్స కోసం స్థానికులు కేజీహెచ్‌కు తరలించారు. కె.శ్రీను, బి.ప్రసన్న, ఎస్.రాజయ్యలకు చేతులపై స్వల్ప గాయాలయ్యాయి. వీరికి విమ్స్‌లో చికిత్స అందించారు. చినవాల్తేరుకు చెందిన ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఆ యువకుడు కేజీహెచ్‌లో వైద్యం చేయించుకున్నాడు. గొడవ జరుగుతుండగా విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ముడసర్లోవ పార్కుకు చేరుకున్నారు. పోలీసులు రావడంతో ఇరు వర్గాల వారు పరుగులు తీశారు. చినవాల్తేరుకు చెందిన ఎ.కుమార్, సీహెచ్ కార్తీక్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

ఆరిలోవ (విశాఖ తూర్పు) : రౌడీ షీటర్ వినయ్ సంపత్ హత్య కేసులో నిందితులను ఆరిలోవ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ ప్రాంతం ఒకటో వార్డు పరిధి ఐదో సెక్టార్ పాండురంగాపురంలో శనివారం రాత్రి గాజువాకకు చెందిన వినయ్ సంపత్(30) అనే రౌడీ షీటర్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యకు పాల్పడిన ఆరిలోవకు చెందిన ఆదినారాయణ, శ్రీను, మోహన్ అనే ముగ్గురు యువకులను ఆరిలోవ పోలీసులు శనివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. హత్యకు దారితీసిన కారణాలతో పాటు వారి మధ్య పాత తగాదాలు ఏమైనా ఉన్నాయా, హత్యకు గురైన రౌడీ షీటర్ నుంచి గతంలో ఎలాంటి పరిణామాలు ఎదుర్కొన్నారు, తదితర వివరాలను వీరి నుంచి సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే వారిని రహస్య స్థలానికి తరలించి అక్కడ విచారిస్తున్నట్లు తెలిసింది.

లభించని బాలుడి ఆచూకీ



బాలుడు శౌర్య(ఫైల్)

మల్కాపురం (విశాఖ పశ్చిమం) : యారాడ సముద్ర తీరంలో గల్లంతైన మూడేళ్ల బాలుడు శౌర్య ఆచూకీ ఇంకా లభించలేదు. బాలుడి ఆచూకీ కోసం జాలార్లు, గజ ఈతగాళ్లు ముమ్మరంగా గాలిస్తున్నా ఫలితం మాత్రం కనిపించలేదు. యారాడ తీరంలో శనివారం మధ్యాహ్నం మూడేళ్ల శౌర్య గల్లంతయిన విషయం తెలిసిందే. కుమారుడిని రక్షించే క్రమంలో తీవ్ర గాయాలపాలై తండ్రి అదేరోజు మృతిచెందాడు. బాలుడి ఆచూకీ కోసం న్యూ పోర్టు సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు ఆదివారం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. తీరం వద్ద బాలుని బంధువులు ఆశతో ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో విలపించారు. గాలింపు చర్యలు కొనసాగుతుండడంతో సోమవారమైనా ఆచూకీ లభిస్తుందని బంధువులు ఆశిస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

అల్లిపురం (విశాఖ దక్షిణం) : యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ జీవీ రమణ తెలిపిన వివరాల ప్రకారం... అరకుకు చెందిన పెదకావు డానియల్ గ్రీన్ పార్కులో ఉద్యోగం చేస్తున్నాడు. అతను మరో ఇద్దరు సహోద్యోగులతో కలిసి స్థానిక సింగ్ హోటల్ జంక్షన్‌లో అద్దె గదిలో ఉంటున్నాడు. ఆదివారం అతని సహోద్యోగులు విధులకు వెళ్లినా డానియల్ మాత్రం అనారోగ్యంగా ఉందని చెప్పి గదిలోనే ఉండిపోయాడు. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఇంటి కింది వాటాలో ఉన్న మహిళ మెట్లు వైపు చూడగా డానియల్ చేయి వేలాడుతూ కనిపించింది. దీంతో ఆమె కంగారు పడి పైకి వెళ్లి చూడగా అతను కింద పడి ఉన్నాడు. దీంతో ఆమె అతని సహోద్యోగులకు సమాచారం అందజేయడంతో వారు వచ్చి టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించంగా అప్పటికే డానియల్ చనిపోయాడు. శరీరం మొత్తం పచ్చగా మారిపోవడంతో పచ్చకామెర్లతో చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



పుష్ప మృతదేహం

సీతమ్మధార (విశాఖ ఉత్తరం) : కైలాసపురం ప్రాంతానికి చెందిన ఓ వివాహిత ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కైలాసపురం ప్రాంతానికి చెందిన సియాది పుష్ప(28) లక్ష్మీనారాయణపురం – 2 ప్రాంతంలో భర్త దుర్గారావు, ఇద్దరు పిల్లలు ప్రదీప్, పూర్ణకుమార్‌తో కలిసి నివసిస్తోంది. భర్త ఒక ప్రైవేటు సంస్థలో మెటీరియల్ సప్లయిర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి 2012లో వివాహమైంది. వీరి పెద్ద అబ్బాయి బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. ఆ కుమారుడి చదువు విషయంలో భర్త శ్రద్ధ తీసుకోవడం లేదని పుష్ప మనస్తాపానికి గురయింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంట్లో ఉన్న స్లాబ్ హుక్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తమ కుమార్తె మరణంపై అనుమానం ఉందని తండ్రి నర్సింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

45 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్ట్, రూ.46వేలు స్వాధీనం



టాస్క్‌ఫోర్సు పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

సీతమ్మధార (విశాఖ ఉత్తరం) : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డుంబ్రిగుడ మండలానికి చెందిన జి.భగవాన్, అశోక్‌కుమార్, అజయ్‌సింగ్, సుభాష్ కొద్దికాలం నుంచి విశాఖ జిల్లాలోని గిరిజన ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలోని గోకుల్ థియేటర్ సమీపంలో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్సు ఏసీపీ చిట్టిబాబు నేతృత్వంలో ఎస్‌ఐలు సతీష్‌కుమార్, నారాయణ మూర్తి సిబ్బంది ఆదివారం దాడి చేశారు. నలుగురినీ అరెస్ట్ చేసి 45 కిలోల గంజాయి, నాలుగు ఫోన్లు, రూ.46వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యువకులతోపాటు గంజాయి, నగదు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

వృద్ధుడిపై దాడిచేసి రూ.80వేలు దోపిడీ

సీతమ్మధార (విశాఖ ఉత్తరం) : నగరంలోని శ్రీకన్య థియేటర్ సమీపంలోని ఇంటిలోకి ప్రవేశించి వృద్ధుడిపై దాడి చేసి, అతని వద్ద ఉన్న నగదు దోచుకున్న సంఘటన ఆదివారం సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీ కన్య థియేటర్ ఎదురుగా ఉన్న భవనంలో కొలగట్ల బ్రహ్మాజీరావు (83) నివసిస్తున్నాడు. ఇంటిలో పని చేసేందుకు పని మనిషిని పెట్టుకునే ఆలోచనలో ఆయన ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు యువతులు ఆదివారం మధ్యాహ్నం ఇంటికి రావడంతో వారితో తన ఇంట్లో ఉన్న కార్యాలయం గదిలో మాట్లాడుతున్నాడు. అనంతరం కొద్ది సేపటికే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతనిపై దాడి చేసి ఇంట్లో ఉన్న రూ.80 వేలు అపహరించుకుపోయారు. దీంతో బాధితుడు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీసీఎస్ ఏసీపీ గోవిందరావు, సీఐ రామారావు, ఎస్‌ఐలు సురేశ్, శివ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం



యాలకూరి కీర్తి

సీతమ్మధార (విశాఖ ఉత్తరం) : దొండపర్తి దరి నెహ్రూ బజార్‌కు చెందిన బాలిక (17) యాలకూరి కీర్తి అదృశ్యమైందని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలిక కీర్తి నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తల్లి మంగ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్టేషన్ హెచ్‌సీ శంకర రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

- ప్రయాణికుడి బ్యాగ్ నుంచి రూ.10 లక్షలు అపహరణ
- నిందితులిద్దరూ విశాఖపట్నం వాసులు



బస్సులో ఏ విధంగా చోరీకి పాల్పడింది ఎస్పీ ముందు చేసి చూపుతున్న నిందితులు, ప్రయాణికుడిగా బ్యాగ్ పట్టుకున్న కానిస్టేబుల్

గుంటూరు : ప్రయాణికుల బ్యాగుల్లో నుంచి చాకచాక్యంగా విలువైన వస్తువులు అపహరిస్తూ ఎప్పటికప్పుడు తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు ఘరానా దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ ఎస్పీ వెంకటప్పలనాయుడు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న నరసరావుపేటకు చెందిన మద్దాల ఆంజనేయులు అనే చేపల కమీషన్ వ్యాపారి నెల్లూరు నుంచి చిలకలూరుపేటకు ఆర్టీసీ బస్సులో బ్యాగుతో ప్రయాణం చేశాడు. తీరా బస్సు దిగి చూశాక బ్యాగ్ కోసి ఉండటం గమనించాడు. బ్యాగ్‌లో రూ. 15 లక్షలు ఉండగా రూ. 10 లక్షలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పాత నేరస్థులను విచారించగా విశాఖపట్నానికి చెందిన బుర్రి సురేష్, కరణం సత్యబాబు చోరీకి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9.96లక్షలు రికవరీ చేశారు. చిలకలూరుపేటలో ఆంజనేయులు బస్సు దిగే సమయంలో... ఒక దొంగ బస్సు డ్రైవర్‌తో వాదనకు దిగగా... మరో దొంగ చాకచక్యంగా చోరీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులపై గతంలో దువ్వాడ, శ్రీకాకుళం, విశాఖపట్నం హార్బర్, రావూరిపాలెం పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయి. సీసీ కెమెరాలు లేకపోయినా చిలకలూరుపేట సీఐ సురేష్‌బాబు, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నారని రూరల్ ఎస్పీ ప్రశంసించారు.

ప్రేమించమని వేధిస్తున్న యువకుడి అరెస్ట్

పీఎం పాలెం (భీమిలి) : ప్రేమ పేరుతో విద్యార్థినిని వేధిస్తున్న ఓ యువకుడిని పీఎం పాలెం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానిక ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... పీఎం పాలెం ఆఖరి బస్టాపు ప్రాంతానికి చెందిన యు.ప్రసాద్ (19)అనే ఆకతాయి యువకుడు అదే ప్రాంతానికి చెందిన విద్యార్థినిని కొద్ది రోజులుగా ప్రేమించమని వేధిస్తున్నాడు. యువతి నిరాకరించినా ఆమె కళాశాలకు వెళ్తున్నప్పుడు మార్గమధ్యలో వెంటపడుతూ ఇబ్బంది పెడుతున్నాడు. వేధింపులు తాళలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పీఎం పాలెం పోలీసులు నిందితుడు ప్రసాద్‌ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఓపీక నశిస్తోంది..


శనివారం ఓపీ వార్డు వద్ద బయటకు వచ్చిన క్యూ


వార్డులో పేర్చిన బల్లలు

- కేజీహెచ్‌లో గంటలకొద్దీ క్యూలైన్‌లోనే రోగులు
- కానరాని మౌలిక సదుపాయాలు
- సిబ్బంది కొరతతో తప్పని అవస్థలు

పాతపోస్టాఫీసు(విశాఖ దక్షిణ) :

పేద ప్రజల వరప్రదాయిని కేజీహెచ్‌లోని పలు ఓపీ వార్డుల్లో మౌలిక సదుపాయాలు లేక రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడాల్సి రావడంతో అవస్థలు పడుతున్నారు.

గుండె జబ్బులు, నరాల బలహీనత, కిడ్నీ వ్యాధి గ్రస్తులను ముందస్తుగా గుర్తించే అత్యంత కీలకమైన ఓపీ నం.14, 8లను ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ దూర ప్రాంతాలకు చెందిన కొత్త, పాత రోగులు సుమారు 400 మంది ఇక్కడకు వస్తుంటారు. అయితే వీరందరికి తగిన వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు ఇచ్చేందుకు అవసరమైనంత మంది వైద్యులు లేరు. ఈ ఓపీలో ఇద్దరు నర్సులు, ముగ్గురు వార్డ్‌బాయ్‌లు, ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది అవసరం కాగా ప్రస్తుతం ఇద్దరు వార్డ్‌బాయ్‌లు, ఒక సెక్యూరిటీ గార్డు మాత్రమే సేవలు అందిస్తున్నారు. ఇటీవలి కాలం వరకూ విధులు నిర్వర్తించిన నర్సును వేరే చోటకు బదిలీ అవడంతో నర్సు చేయాల్సిన పనిని ఆరోగ్య మిత్ర చేస్తున్నారు.

కూర్చునేందుకు స్థలం లేదు.. తాగడానికి నీరు కనపడదు

ఈ ఓపీలకి వయసుమీద పడిన రోగులు అధికంగా వస్తుంటారు. ఇక్కడ కూర్చునేందుకు బల్లల సదుపాయం ఉన్నా, పనికిరాని కర్రబల్లలు ఇక్కడ వేయడంతో కూర్చునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో అన్ని వయసులవారు తప్పని సరిగా క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమ, శనివారాల్లో అత్యధికంగా వచ్చే రోగుల క్యూ లైను ఓపీని దాటి బయట వరకూ వెళ్లిపోవడంతో ఆ దారిలో ప్రయాణించే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ కంచు కాగడా పెట్టి వెదికినా మంచినీటి జాడ కనిపించదు. దూరంగా వెళ్లి నీరు తెచ్చుకునేలోపు తమ వంతు అయిపోతుందేమోన్న భయంతో ఎవ్వరూ లైను వదిలి వెళ్లడం లేదు. వార్డులోనే మంచినీటి సదుపాయం కల్పించాలని వృద్ధులు విజ్ఞప్తి చేస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు.


నర్సుకు బదులు ఓపీ నంబర్లు వేస్తున్న ఆరోగ్య మిత్ర

రోగులపై చిన్నచూపు



కేజీహెచ్‌కు వచ్చి చూపించుకునే రోగులపై ఎప్పుడు వైద్యులు, సిబ్బంది చిన్నచూపే చూస్తున్నారు. సమయానికి వైద్యులు రారు, వచ్చినా అతి నెమ్మదిగా కేసులు చూస్తూ కాలయాపన చేస్తున్నారు. దీంతో క్యూలో నిల్చోలేక బయట వైద్యం చేయించుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నాం.

– ఎం.రాజేశ్వరరావు, పెదవాల్తేరు

కూర్చునే అవకాశం లేదు



ఇక్కడ పెద్ద వయసు వారు కూర్చునేందుకు అవకాశం లేదు. హాలులో పనికిరాని చెక్కబల్లలు వేయడంతో కూర్చోలేని పరిస్థితి ఏర్పడింది. దాదాపు రెండు గంటల నుంచి లైనులో నిల్చునే ఉన్నాను. అధికారులు స్పందించి రోగులకు సౌకర్యాలు కల్పించాలి.

– వై.చిన్నమ్మలు, గాజువాక

మంచినీటి సౌకర్యం లేదు



ఈ ఓపీలో మంచినీటి సౌకర్యం లేదు. గంటల కొద్దీ క్యూలైన్‌లో నిల్చుంటేనే కాని వైద్య పరీక్షలు జరగవు. దాహం వేసినా దూరంగా వెళ్లి నీరు తెచ్చుకోలేని పరిస్థితి. కూర్చునే అవకాశం లేకుండా లోపలి హాలులో బల్లలు వేసి ఉంచారు. వీటిని తొలగిస్తే కూర్చునే అవకాశం ఉంటుంది

– వెంకటలక్ష్మి, కంచరపాలెం

అంతర్జాతీయ సదస్సు సంచిక ఆవిష్కరణ


సదస్సు సంచికను విడుదల చేస్తున్న వీసీ నాగేశ్వరరావు

ఏయూక్యాంపస్(విశాఖతూర్పు): ఏయూ మెరైన్‌లివింగ్ రిసోర్సెస్ విభాగంలో గతేడాది నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఆక్వాకల్చర్' ప్రత్యేక సంచికను వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు ఆదివారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమలో జరుగుతున్న మార్పులు, ఆవిష్కరణలు తెలియజేసే విధంగా ప్రత్యేక సంచిక నిలుస్తుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎంఎల్ఆర్ విభాగం క్రమం తప్పకుండా వర్తమాన అంశాలపై అంతర్జాతీయ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆచార్య దేవర వేణు, ఏపీ ఫిషరీస్ కమిషనర్ రామశంకర్ నాయ క్, సదస్సు సమన్వయకర్త ఆచార్య కె.రమేష్ బాబు, విభాగాధిపతి ఆచార్య ఏడుకొండలు పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్తు

- డిప్యూటీ కలెక్టర్ సిరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ సిరి

ఆరిలోవ(విశాఖ తూర్పు): యువత చదువుతో పాటు తాము చేస్తున్న పనిలో నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని విశాఖ డిప్యూటీ కలెక్టర్ ఎ.సిరి తెలిపారు. నగరు శివారు శ్రీకృష్ణాపురంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా నేషనల్ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ సద్భావన దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత దేశానికి పట్టుకొమ్మలాంటివారన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణతో మెలిగినవారు తమ పనిలో నైపుణ్యం సాధిస్తారని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆర్మీ ఉద్యోగాల ఎంపిక కోసం యువజన సర్వీసెస్ శాఖ, సెట్విజ్ సంస్థలు ఉచిత శిక్షణ ఇస్తున్నాయన్నారు. ఆసక్తి గలవారు ఆయా సంస్థల ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. గురుకులం వైస్ ప్రిన్సిపల్ కామయ్య, పీడీ సత్య సుధాకర్ పాల్గొన్నారు.

'రైతును బతికించుకుందాం'


సమావేశంలో మాట్లాడుతున్న దినేష్ దత్తాత్రేయ కులకర్ణి

పెదవాల్తేరు(విశాఖ తూర్పు):

స్వాభిమానాన్ని కోల్పోతున్న రైతులు వ్యవసాయాన్ని వీడి పల్లేల నుంచి వలస బాట పడుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత సంఘటన కార్యదర్శి దినేష్ దత్తాత్రేయ కులకర్ణి అన్నారు. గోపాలరావు ఠాగూర్ స్మారక సమితి ఆధ్వర్యంలో ఏయూ వై.వి.ఎస్ మూర్తి ఆడిటోరియంలో వ్యవసాయం, గ్రామీణ భారతం సవాళ్లు–పరిష్కారం అనే అంశంపై ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం వరకు స్వాభిమానంతో గౌరవంగా జీవించిన రైతు నేడు దుర్భర జీవనం సాగిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది ఆత్మాహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆంగ్లేయుల కాలం నుంచే వాణిజ్య రంగంలో భారతదేశం గణనీయమైన వాటాను దక్కించుకుందన్నారు. పత్తి, సుంగధ ద్రవ్యాల ఎగుమతితో దేశం ఆర్థికంగా ఎదిగిందన్నారు. ఆనాడు బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉండడానికి వ్యవసాయరంగమే ప్రధాన కారణమన్నారు. అలాంటి రైతులు నేడు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి సమస్యలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు పి.వి.చలపతిరావు, ఎంపీ హరిబాబు, ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గోరక్‌పూర్ ఘటన ఒక గుణపాఠం

- ప్రభుత్వాలు ఇకనైనా మేల్కోవాలి
- ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ):

ఉత్తరప్రదేశ్ గోరక్‌పూర్‌లోని బీఆర్‌డీ ఆస్పత్రిలో 105 మంది పిల్లల మరణం దారుణమని, ఈ ఘటన నుంచి ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకోవాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.రామారావు అన్నారు. నగరంలోని యల్లమ్మతోటలోని నండూరి ప్రసాదరావు భవన్‌లో ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ విషాదంపై సరైన నివేదిక ఇవ్వకుండా, విషయాన్ని దారి మళ్లిస్తోందన్నారు. అసలు పిల్లల వ్యాధి నిర్ధరణ సరిగా జరగలేదన్నారు. ప్రజారోగ్యవ్యవస్థను ప్రైవేట్ పరం చేయాలని చూసే ప్రభుత్వాలకి ఈ పరిణామం ఒక హెచ్చరిక వంటిదని పేర్కొన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే తప్పా, వైద్యులు, సిబ్బంది ఈ ఘటనకు బాధ్యుల్ని చేయడం సరికాదన్నారు. మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ నాయకుడు టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ అనేది ప్రభుత్వ బాధ్యతని, ప్రభుత్వ ఆస్పత్రులు ప్రభుత్వం ఆధీనంలోనే బలోపేతం చేయకపోతే ఇలాంటి పరిస్థితులు ఇతర ప్రభుత్వాసుపత్రుల్లో పునరావృతం అయ్యే పరిస్థితి ఉందన్నారు. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ సంఘటన నుంచి గుణపాఠం నేర్చుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో ఐద్వా నాయకురాలు దాక్షాయణి, యూనివర్శిటీ ఉద్యోగాల సంఘం నాయకుడు, మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోటేశ్వరరావు, బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రతినిధి రమణ, జన విజ్ఞాన వేదిక నాయకుడు చిలకమూర్తి, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధి రమణమూర్తి, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.వి.పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చీడికాడ(మాడుగుల): మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తంతి హీరాలాల్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరో తరగతిలో 22 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా పూర్తి వివరాలతో దరఖాస్తులను పాఠశాలలో ఇవ్వాలన్నారు. 26వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధనకు హవర్లీ బేస్డ్ టీచింగ్ సిబ్బంది కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంఎస్సీ బీఈడీ చేసిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. .

ఉయ్యాలే ఉరితాడు


మృతి చెందిన విద్యార్థి

అనకాపల్లి టౌన్: ఉయ్యాల 16 ఏళ్ల యువకుడి ఉసురు తీసింది. సరదాగా ఉయ్యాల్లో కూర్చొని ఊగుతుండగా మెడకు చుట్టుకుని ప్రాణాలు కోల్పోయాడు. అనకాపల్లి మండలం అల్లిఖానుడుపాలెంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన సిరిగిరిశెట్టి సత్తిబాబు కుమారుడు దావిదు ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరి చదువు మానేశాడు. ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంటున్నాడు. తండ్రి సత్తిబాబు క్వారీ కార్మికుడు. ఉదయం కూలికి వెళ్లిపోయాడు. తల్లి రమా రెండేళ్ల తమ్ముడు ఉదయం చర్చికి వెళ్లారు. ఇంట్లో దావిదు ఒక్కడే ఉన్నాడు. చర్చికి వెళ్లినవారు మధ్యాహ్నాం 2.15 గంటలకు ఇంటికి వచ్చి చూడగా దావిదు మెడకు ఉయ్యాల చుట్టుకుని ఉచ్చులా మారి విలవిల్లాడుతున్నాడు. తల్లి ఎకాయెకిన ఉయ్యాలను తొలగించి దావిదును అనకాపల్లి 100 పడకల ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ఆదినారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కొమ్మాది వద్ద పందిరి నిర్మిస్తున్న యువకులు

చలవ పందిళ్లు .. చక్కని ప్రతిమలు..

అంతటా చవితి సందడి

- ఉండ్రాలయ్యకు ఊరూరా మంటపాలు
- తుది మెరుగులద్దు కుంటున్న గణనాథులు
- యువకులు, చిన్నారుల కోలాహలం



ఆకర్షిస్తున్న వినాయకుడి విగ్రహాలు

కొమ్మాది:

గణనాథుని పూజ అంటే చిన్నపిల్లలు, యువకులదే సందడంతా. వినాయకచవితి మరి నాలుగు రోజులే ఉండడంతో వారి హడావుడి అంతాఇంతా కాదు. ఎన్ని పనులు మరి.. విగ్రహాల తయారీకి ఆర్డరివ్వడం, పందిళ్ల ఏర్పాటు, లైట్లు, మైక్ సెట్, వాటికి పర్మిషన్లు తెచ్చుకోవడం .. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఆ తొమ్మిది రోజులు నిర్వహణ మరీ ప్రత్యేకం. లంబోదరుడు కదా.. ఆయనకు దండిగా నైవేద్యాలు సమర్పించేందుకు కాలనీవాసులకు ముందే కేటాయింపులు.. లడ్డూకు ఏర్పాట్లు.. ఆఖరున భారీ అన్నసమారాధనన.. లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు.. చిన్న పిల్లలకు పోటీలు నిర్వహణ .. ఇలా ఒకటా, రెండా అన్ని పనులు భుజాన వేసుకుని అలుపెరుగకుండా చక్కబెట్టేస్తున్నారు. జీవీఎంసీ నాలుగు, ఐదు వార్డులు, భీమిలి రూరల్, చేపలుప్పాడ, కాపులుప్పాడ, కె.నగరపాలెం, జేవీ అగ్రహారం, నిడిగట్టు అన్ని వీధుల్లోను వినాయక చవితి ఉత్సవాలు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నా పట్టించుకోక తడుస్తూనే మండపాల నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. పలు సంస్థలు కూడా చేతులు కలుపుతున్నాయి. వేవేల రూపాల్లో గణనాథుడు కొలువుదీరడమే ఇక తరువాయి..



తుది మెరుగులు దిద్దుకుంటున్న వినాయకుడు



చేపలుప్పాడ వద్ద పందిరి నిర్మాణంలో యువకుల హడావుడి

200మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షించి మందులు అందిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమిలిలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో డాక్టర్ టి.జగన్నాథరావు శిబిరానికి వచ్చిన 200 మంది రోగులను పరీక్షించి, అవసరమైన మందులను అందించారు. శ్రీరామచంద్రమూర్తి మట్లాడుతూ ప్రతి నెల ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ఫౌండేషన్ సభ్యులు కె.ఎస్.మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూడు మాసాలైనా పాఠ్యపుస్తకాలేవీ?

తగరపువలస: నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు మాసాలు పూర్తవుతున్నా భీమిలి అర్బన్, రూరల్ ప్రాథమిక పాఠశాలలకు ఇంకా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాల సరఫరా జరగలేదు. ఈ ఏడాది ప్రారంభించిన ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సరఫరా కాకపోవడంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. ఉపాధ్యాయులకూ అవస్థలు తప్పడం లేదు. స్టేషనరీ, నోట్ పుస్తకాలను దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్నా, పాఠ్యపుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు ఉపాధ్యాయులు. అటు ప్రభుత్వమూ సరఫరా చేయక, బయట మార్కెట్‌లోనూ అందుబాటులో లేక కష్టమవుతోందన్నారు. అధికారులు స్పందించి పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బీసీ సెల్ నగర అధ్యక్షునిగా పోతిన

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మధురవాడకు చెందిన పోతిన వెంకటరావు వరుసగా రెండోసారి టీడీపీ నగర బీసీ సెల్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఈయనకు మంత్రి గంటా శ్రీనివాసరావు సిఫార్సు మేరకు నగర అధ్యక్షుడు గణేష్‌కుమార్ ఆదివారం నియామకపత్రం అందించారు. ఈయన ప్రస్తుతం మధురవాడ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. గతంలో అధ్యక్షునిగా కూడా పనిచేశారు. దీంతో ఈయన అందరికీ బ్యాంకు వెంకటరావుగానే సుపరిచితుడు. పలువురు వెంకటరావును అభినందించారు. తనకు పదవి రావటానికి సహకరించిన మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేరుకున్న మురుగు



కాల్వలో పురుగులు



సాయిరాం కాలనీలో కాల్వల్లో నిండిన మురుగు

కొమ్మాది: జీవీఎంసీ నాల్గో వార్డు సాయిరాం కాలనీలో పారిశుద్ధ్య లోపంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఉన్న తొమ్మిది సెక్టార్లలోను డ్రైనేజీ వ్యవస్థ కుంటుపడటంతో కాల్వల్లో మురుగు నీరు నిండిపోయి ఇళ్లలోకి వచ్చేస్తోంది. 15 రోజులుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు, కీటకాలతో ఇబ్బంది పడుతున్నామని, విషజ్వ రాలు వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్ఐఓఎస్ పరీక్షలకు 565 మంది హాజరు



తునివలసలో పరీక్షలను పరిశీలిస్తున్న లోక్ శిక్షా సమితి ఏడీ సుగుణాకరరావు

పద్మనాభం: మండలంలోని 20 పంచాయతీల్లోని వయోజన విద్యా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్ఐఓఎస్ పరీక్షలకు 630 మందికి గాను 565 మంది హాజరయ్యారు. వీరిలో పురుషులు 90 మంది, స్త్రీలు 475 మంది ఉన్నారు. రేవిడి, వెంకటాపురం, కోరాడ, మద్ది వయోజన విద్యా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలను రాష్ట్ర అబ్జర్వర్ కె.సత్యనారాయణ, చిన్నాపురం, నేరేళ్లవలస, రెడ్డిపల్లి వయోజన విద్యా కేంద్రాల్లోని పరీక్షలను లోక్ శిక్షా సమితి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుగణాకరరావు పరిశీలించారు. ఆయన వెంట సాక్షర భారత్ మండల కో–ఆర్డినేటర్ కె.పైడినాయుడు ఉన్నారు.

కూలిన జూట్ క్వార్టర్స్ ఇల్లు

తప్పిన ప్రమాదం



కూలిన ఇల్లు

తగరపువలస(మధురవాడ): చిట్టివలస జూట్ మిల్ క్వార్టర్స్ జె– లైన్‌లో మొదటి ఇల్లు ఆదివారం కూలిపోయింది. ఇందులో బి.రమణమూర్తి కుటుంబం నివాసం ఉంటోంది. ఈ ఇల్లు కూలే సమయంలో ఇల్లు తాళం వేసి ఉండడంతో ప్రమాదం తప్పింది. వీరు వేరే ప్రాంతంలో నిర్మించుకుంటున్న ఇంటి పని మీద అక్కడకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరు. దీంతో ప్రమాదం నుంచి బయటపడ్డారని స్థానికులు తెలిపారు. ఇల్లు కూలిపోవడంతో తమ కుటుంబం రోడ్డున పడిందని బాధితుడు వాపోయాడు.

మరికొన్ని జోన్ వార్తలు 14లో

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

భీమునిపట్నం:

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని చిన్నబజారు సమీపంలోని ఆయన విగ్రహం వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి కదిరి జగన్నాథం ఆధ్వర్యంలో నాయకులు రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. జగన్నాథం మాట్లాడుతూ రాజీవ్ దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మైలిపల్లి లక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్లు ఎల్లపు సత్యారావు, పాసి స్వర్ణలత, నాయకులు పాల్గొన్నారు.

బాపూజీ కళా మందిరం వద్ద..

మధురవాడ: రాజీవ్‌గాంధీ జయంతిని స్థానిక నాయకులు నిర్వహించారు. చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద దేశనేతల విగ్రహాల సమూహంలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి పోతిన వరం, 5వ వార్డు అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, మాజీ సర్పంచ్‌లు పోతిన వెంకట రమణబాబు, కుడితి రామారావు, మాజీ ఉప సర్పంచ్ పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈదురుగాలుల బీభత్సం

- వంట్లమామిడి మలుపు వద్ద విరిగిపడిన భారీ చింతచెట్టు
- నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- పోలీసులు, స్థానికుల జోక్యంతో చెట్టు తొలగింపు



రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ చింతచెట్టు

పాడేరు రూరల్: పాడేరు ఘాట్‌లో ఆదివారం తెల్లవారుజామున ఈదుర గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో వంట్లమామిడి సమీపంలోని మొదటి మలుపు వద్ద ప్రధాన రహదారికి అడ్డంగా ఓ భారీ చింతచెట్టు విరిగిపడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా చింతచెట్టు విరిగిపడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా గంటల తరబడి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం 8 గంటల వరకు రాకపోకలకు వీలుపడలేదు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎం.రామారావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో గంటపాటు కష్టపడి విరిగిపడిన చెట్టు, కొమ్మలను తొలగించారు. దీంతో రాకపోకలకు వీలుకలిగింది.



చింతచెట్టును తొలగిస్తున్న దృశ్యం

కూలేందుకు సిద్ధం



ప్రమాదకరంగా ఉన్న చెట్టు

చింతపల్లి(పాడేరు) :మండలంలోని పెద్దగెడ్డ ప్రధాన రహదారి వద్ద ఉన్న ఓ చెట్టు ప్రయాణికులు, వాహన చోదకులను ఆందోళనకు గురిచేస్తోంది. రెండేళ్ల క్రితం చింతపల్లి -నర్సీపట్నం రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగించేందుకు అటవీ శాఖ అనుమతులు మంజూరు కాకపోవడంతో రోడ్డుపక్కనున్న చెట్ల మొదళ్లవరకు మట్టిని తొలగించి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో చెట్టు మొదళ్లో సగం వరకు మట్టిని తొలగించడంతో ఈ చెట్టు ఎప్పుడు కూలిపోతుందోనని వాహనచోదకులు, ప్రయాణిలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదకరమైన మలుపు వద్ద ఈ చెట్టు ఉండడంతో రెండు వైపులా నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ నెమ్మదిగా వెళుతుంటాయి. రెండేళ్ల క్రితమే ఆర్‌వీ నగర్ సమీపంలో భారీ వర్షాలకు రోడ్డుపక్కనున్న చెట్టు కూలిపోయి కారుపై పడడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను తొలగించడం లేదని ప్రయాణికులు, వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న చెట్లను తొలగించాలని వారు కోరుతున్నారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు



కంపుమానుపాకలులో కొట్టుకుపోయిన కల్వర్టు

గూడెంకొత్తవీధి (పాడేరు): అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం కారణంగా కల్వర్టు వర్షాలకు కొట్టుకుపోవడంతో సుమారు 30 గ్రామాల గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని కంపుమానుపాకల గ్రామ సమీపంలోని కల్వర్టు నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతింది. ఏజెన్సీ ప్రాంతంలో అన్ని మండలాలకన్నా జీకేవీధిలో భారీ వర్షం కురవడంతో ఆదివారం ఈ కల్వర్టు కొట్టుకుపోయింది. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జీకేవీధి, కొయ్యూరు సరిహద్దు గ్రామాలు ఉండడంతో ఈ రహదారి ఎంతో ప్రాధాన్యం ఉంది. గతంలో హుద్‌హుద్ తుపాను ధాటికి కొట్టుకుపోయిన ఈ రహదారి మరమ్మతుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించారు. అయితే కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో వేసిన ఏడాదికే కల్వర్టు కొట్టుకుపోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు బాగు చేసి రహదారి నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.

వరకట్న వేధింపులపై వివాహిత ఫిర్యాదు

చోడవరం టౌన్: వరకట్నం వేధింపులకు పాల్పడుతున్నారని ఓ వివాహిత భర్తతో పాటు అత్తమామలు, ఆడపడుచుపై చోడవరం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. స్థానిక వెంకయ్యగారి పేటకు చెందిన సీతిన వెంకటలక్ష్మికి శంకరరావుతో 2009లో వివాహం జరిగింది. అప్పటిలో కట్నంగా రూ.మూడు లక్షలు, 20 సెంట్లు భూమి, రెండు తులాలు బంగారం తన తల్లిదండ్రులు ఇచ్చారని.. అయితే ఆ కట్నం చాలదని వేధిస్తున్నారని వెంకటలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. గర్భిణినైన తనను వరకట్నం కోసం కొట్టేవారని.. ఇటీవల ఆడపిల్లకు పుట్టగా అదనంగా రూ.రెండు లక్షలు తీసుకురావాలని వేధిస్తుండడంతో పెద్దలు సమక్షంలో కొంత సొమ్ము ఇచ్చి అత్తవారి ఇంటికి వచ్చానని.. అయినా అవి చాలవని.. రోజూ కొడుతున్నారని వాపోయింది. అత్త రాములమ్మ, మామ సూరిబాబు, భర్త శంకరరావు, ఆడపడుచు రాజేశ్వరిలపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జె.ఈ.రాజు తెలిపారు.

మ్యూజియానికి నవ్య నావికాశోభ

- విశాఖ మ్యూజియంలో కొత్త కళాఖండాలు
- రక్షణ రంగంలో ప్రవేశపెట్టిన యంత్రాల నమూనాలు
- కొలువుదీరిన నాటి ప్రధానుల జ్ఞాపికలు


మ్యూజియంలో నౌకల నమూనాలు



పడవ నమూనా


ఒమన్ వర్తక సంఘం అటల్ బిహారీ వాజ్‌పేయికి ఇచ్చిన బహుమతి



మరాఠా, మొగల్ నౌకాదళంలో నావికులు

శతాబ్దాల చరిత గల నగరి విశాఖ. సిటీ ఆఫ్ డెస్టినీగా.. పర్యాటకుల స్వర్గధామంగా విరాజిల్లే విశాఖ ఘనత, చరిత్ర, పురోగతి .. ఆ విశేషాలన్నీ ఆసక్తిదాయకమే. వాటన్నింటినీ నమూనాలతో సహా దృశ్యీకరించడంతో పాటు రక్షణరంగ విశేషాలను వివరించే దర్పణం వంటిది విశాఖ మ్యూజియం. ఆర్కే బీచ్ రోడ్డులోని డచ్ బంగ్లాలో ఉన్న ఈ మ్యూజియంలో నావికాదళ చరిత్ర, ఆయుధ సంపత్తి వంటి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. ఈ మ్యూజియంలో సరికొత్త కళాఖండాలు వచ్చి చేరాయి. గతంలో ఉన్న వాటికి రెట్టింపు సంఖ్యలో ఇవి సమకూరాయి. రక్షణరంగంలో పని చేసిన, చేస్తున్న యుద్ధ విమానాలు, నౌకలు, చేతక్, వార్ క్రాఫ్ట్, సబ్‌మెరైన్లు వంటివి ఎన్నో ఈ మ్యూజియంలో స్థానాన్ని సంపాదించాయి. చిన్నారులను ఇక్కడికి తీసుకువస్తే రక్షణ రంగంలో ఉపయోగించే ఆయుధాల గురించి తెలుసుకోవచ్చు. వీటితోపాటు మన దేశ ప్రధానులకు విదేశాలు అందించిన బహుమతుల గురించి వివరించవచ్చు. నూతనంగా చేరిన కళాఖండాలతో సందర్శకుల సంఖ్య పెరిగిందని మ్యూజియం క్యూరేటర్ పాత్రుడు తెలిపారు.

- బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు) ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్


అంటార్కిటికాలోని భారతీయ స్టేషన్ దక్షిణ గంగోత్రి నుంచి సేకరించిన శిల


నూతనంగా నావికా దళంలో చేరిన యుద్ధనౌక


విశాఖపట్నం క్లాసిక్ డిస్ట్రాయర్ యుద్ధ నౌక


నౌకల డ్రైవర్లు


సబ్‌మెరైన్ మోడల్స్


మాల్దివ్ ప్రభుత్వం ఇచ్చిన బహుమతి



మూడో జనరేషన్ యూటీవిటీ హెలికాప్టర్


నౌకలో వినియోగించిన టెలిస్కోప్



చేతక్

గురుదేవునికి సంకీర్తనార్చన

1008 రకాల పిండివంటకాలతో నైవేద్యం


ప్రభుపాదుల చిత్రపటం


స్వామివారిని తీసుకువస్తున్న భక్తులు


నైవేద్యంగా సమర్పించిన 1008 రకాల వంటకాలు

విశాఖ కల్చరల్: హరినామ సంకీర్తనలతో సాగరతీరం ఉప్పొంగింది. శ్రీల ప్రభుపాదుల 121వ జయంతిని పురస్కరించుకుని ఆర్కేబీచ్‌లోని అన్నమయ్య మండపం వద్ద ఇస్కాన్ బెంగళూరు శాఖ సారథ్యంలో అఖండ సంకీర్తన యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం వ్యాసపూజా మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూమెంట్ వ్యవస్థాపక ఆచార్యులు భక్తి వేదాంత హాజరై 1008 వంటలను నైవేద్యంగా గురుదేవులకు సమర్పించారు. కజ్జికాయలు, బూరెలు, లడ్డు, బంగాళాదుంపలు, బియ్యం, గోధుమలతో పాటు మైదా, శనగపిండిలతో చేసిన వంటలు, పప్పులు, ధాన్యాలు, కూరగాయల వంటకాలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించన భక్తదాసు, వ్యవస్థాపకుడు భక్తి వేదాంత తదితరులు శ్రీల ప్రభుపాదుల జీవిత విశేషాలను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సంకీర్తనలు అందరినీ అలరించాయి.

స్వదేశీ మత్స్యకారులకు సంక్షేమ పథకాలు

మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్


తాటితూరు పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్

తగరపువలస(భీమిలి): స్వదేశీ మత్స్యకారులకు ప్రభుత్వం మిషన్ ఫింగర్స్ పథకం ద్వారా పంపిణీ చేసిన నారును స్థానికంగా విక్రయించి లబ్ధి పొందాలని మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్ అన్నారు. తాటితూరు స్వదేశీ మత్స్యకారుల సంక్షేమ సంఘం సాగు చేపడుతున్న తాటితూరు పెద్ద చెరువులో చేప పిల్లలను ఆదివారం సాయంత్రం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శంకరరావు, ఏడీ లక్ష్మణరావు, భీమిలి ఎఫ్‌డీవో శ్రీనివాసరావు, స్వదేశీ మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు సింగిడి గణేష్ , ఉపాధ్యక్షుడు సింగిడి అప్పలరాజు, డైరెక్టర్లు సిద్ధాంతపు రవి, తాటిపూడి సూర్యారావు, సింగిడి చిన్నారావు, ఆబోతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ సి

- సత్తాచాటుతున్న వి
- ర్యాంప్‌పై హొయల
  వైజాగ్ బ్యూ

అదో ఊహల ప్రపంచం.. అందాల తీరం
సెట్ అయితే ఓకే.. లేదంటే లైఫ్ గ్రాఫ్ డ్యామేజ్‌లో పడుతుంది
కాళ్ల కింద ర్యాంప్ వెక్కిరిస్తుంది
చుట్టూ ఉన్న కెమేరాలు భయపెడతాయి
ఫ్యాషన్‌ప్రపంచంలో ప్యాషన్‌తో వెళితే
లైఫ్ ఏమైనా కావొచ్చు
తారల్లా మెరవొచ్చు..నిండా మునగొచ్చు
అయినా సరే డోంట్‌కేర్ అంటోంది యూత్
మోడలింగ్ మానియాలో ఉంది
క్యాట్‌వాక్ చేసే తెలుగమ్మాయిలు పెరిగిపోయారు
ఈ మధ్య ఏ ఈవెంట్ జరిగినా మోడలింగ్..
అగ్గిపుల్ల ప్రమోషన్..గుండు సూది ప్రమోషన్
కారు మోడల్...బైక్ లాంచింగ్..కార్యక్రమం ఏదైనా
ముందుగా మెరిసేది మోడల్
అందుకే ఈ తళతళలు..ఈ కళకళలు..
శ్రీశ్రీ చెప్పిన ఓ మాట అటూ ఇటూ మారిస్తే కాదేదీ
మోడలింగ్‌కు అనర్హం అనొచ్చు
కాస్త ఒడ్డూ పొడుగూ ఉన్న అమ్మాయిలు
ర్యాంప్‌పై నడిస్తే ఐ కనక్ట్ అయ్యే మాట నిజమే..
అది మేల్ కావొచ్చు..ఫిమేల్ కావొచ్చు
అందుకే యూత్ మోడలింగ్‌కు కనెక్ట్ అయింది.
విశాఖలో మెరుపుతీగలు క్యాట్‌వాక్‌తో కేక పుట్టిస్తున్నారు

నేడు ప్రపంచ ఫ్యాషన్ డే

సందర్భంగా సిటీలో మోడల్స్‌పై ప్రత్యేక కథనం





ఎన్.స్నేహ, విశాఖ


మోడలింగ్‌ను ప్రోత్సహించండి

మోడలింగ్ అంటే సమాజంలో ఒక చిన్న చూపు ఉంది. నిజానికి మోడలింగ్ అంటే మన గురించి ప్రపంచానికి చాటి చెప్పడం. మోడలింగ్ వలన సెల్ఫ్ కాన్ఫిడెన్స్, భావ ప్రకటన అలవాటవుతుంది. మోడలింగ్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పుడు మార్గంలో ఉంటారని సమాజంలో ఒక భావన ఉంది. ఆ భావన చాలా తప్పు. ఎవరి అనుమతి లేకుండా వారి జీవితం తప్పుడు మార్గంలోకి వెళ్లాదు. మనం మంచిగా ఉండాలంటే మనల్ని ఎవరు చెడు మార్గంలోకి తీసుకొని వెళ్లారు. ఒక్క మోడలింగ్ లోనే కాదు అన్ని రంగల్లో మంచి, చెడు మార్గాలు ఉంటాయి. వాటిని ఎంచుకొనే వ్యక్తిపై ఆధారపడి ఉంటుంది. మోడలింగ్ అంటే చిన్న విషయం కాదు. చాలా పోటీ ఉంటుంది. ఆ పోటీని తట్టుకొని మన వ్యక్తం దెబ్బతినకుండా ఉండలాంటే చాలా కష్టపడాలి. అదే నేను చేస్తున్నాను. వైజాగ్‌లో మోడలింగ్ రంగం ఇప్పుడు ఇప్పుడే అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతనికి ఇక్కడ మోడల్‌గా రాణించాలంటే కష్టమే. సరదగా మోడలింగ్ చేసిన నేను ప్రస్తుతం నా జీవితం ఆశయంగా పెట్టుకుంటానని ఎప్పుడు అనుకోలేదు. మొదట్లో నేను మోడలింగ్ వైపు వెళ్తున్నాని చెప్పినప్పుడు నా స్నేహితులు, బంధువులు అందరూ నెగిటివ్‌గా మాట్లాడారు. ఇప్పుడు వారే నాగురించి గొప్పగా చెప్పుకుంటుంటే ఆనందంగా ఉంది. మిస్ ఇండియా టైటిల్ కోసం ప్రయత్నిస్తున్నాను. మా ఫ్యామిలీ సభ్యులు కూడా అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం నేను ఓ సినిమాలో నటిస్తున్నాను. భవిష్యత్‌లో నటనలో శిక్షణ తీసుకొని సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తా. మోడలింగ్ అంటే అందం ఒక్కటే కాదు, చాలా ఉంటాయి. చాలా మందికి మోడలింగ్‌లోకి రావాలని ఉంటుంది. కాని వారు పొట్టిగా ఉన్నామని, కలర్ లేమని రారు. నిజానికి మోడలింగ్‌లో శరీరం గురించి కాకుండా మనల్లో ఉన్న కాన్ఫిడెన్స్‌తో ఎదుటి వారిని మెప్పించాలి. అప్పుడే మోడలింగ్ రంగంలో రాణించవచ్చు.

–హర్షా బేద్, మిస్ ఆంధ్రా విజేత



ఇటీవల ని



ద్వారకానగర్ (వి
బీచ్ రోడ్డు (విశా
విశాఖ-క



మోడల్ మేఘన

ఇటు మోడల్‌గా...అటు యాంకర్‌గా...

స్నేహ...డిగ్రీ స్టూడెంట్. అటు మోడల్‌గా..ఇటు యాంకర్‌గా..యోగా టీచర్‌గా దూసుకుపోతోంది. డిగ్రీ చదువుతూనే తనకిష్టమైన రంగాల్లో సత్తాచాటుతోంది. చిన్నప్పటి నుంచే కూచిపూడిలో శిక్షణ పొందింది. ఇప్పటి వరకు భారతదేశంలో 500 వరకు ప్రదర్శనలు ఇచ్చింది. యోగాలో శిక్షణ తీసుకుంది. మెడిటేషన్ యోగాలో ఉచితంగా శిక్షణ ఇస్తోంది. నగరంలో జరుగుతున్న మోడల్ షోస్‌లో పాల్గొంటూ ర్యాంప్‌పై హొయలు ఒలికిస్తుంది. విశాఖలో జరిగే ఆడియో ఫంక్షన్లకు యాంకర్‌గా మెప్పించింది. ఈ రంగంలో మంచి చెడూ రెండూ ఉంటాయి. మన వ్యక్తిత్వంపైనే ఆధారపడి ఉంటుంది.



ఈవెంట్ సంస్థ ప్రారంభిస్తా

మోడలింగ్ రంగంలో రాణించేలన్నదే లక్ష్యం. ఇప్పటికే మిస్ రాజమండ్రి, మిస్ వెస్ట్ గోదావరి, మిస్ ఆంధ్రప్రదేశ్ లాంటి ఈవెంట్స్‌కు కో–ఆర్డినేటర్‌గా పనిచేశాను. కొత్తగా ఓ ఈవెంట్ సంస్థను ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నాను. నా చదువు పూర్తి అయిన వెంటనే అమల్లోకి తెస్తా. సినిమా అవకాశాలు వస్తున్నాయి. అయితే ఇప్పుడు ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాను. సినిమాలు వలన నా చదువుకు ఎలాంటి ఇబ్బంది రాకూడదని వాటిని అంగీకరించడంలేదు.

మిస్ విశాఖ ఫైనల్ పోటీల్లో పాల్గొనేటప్పుడు నాన్న ఆస్పత్రిలో ఉన్నారు. ఆయిన ధైర్యంగా వెళ్లిరా తల్లీ అంటూ ఆశీర్వదించారు. అంత సపోర్ట్ నాన్న నుంచి ఉంది. విశాఖలో చాలా మంది మోడలింగ్‌లో సత్తా చాటేవారున్నారు. కాని వారు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. సమాజంలో మోడలింగ్‌పై ఉన్న చెడు అభిప్రాయం పోవాలి.

–భారతి బెర్రి,
విశాఖ బెస్ట్ స్మైల్ విజేత



– సయో వర్మ, మోడల్

మోడలింగ్ అంత ఈజీ కాదు

మోడలింగ్ అంటే ప్రతి ఒక్కరికీ చిన్న చూపు. రకరకాల డ్రెస్సులు వేసుకొని, ముఖానికి రంగులు పూసుకొని తిరుగుతుంటారని భావన. కాని అలాంటి డ్రస్సులు వేసుకుని, హై హిల్స్ చెప్పులతో నడిస్తే చాలా నొప్పులు వస్తాయి. అలాగే శరీరం స్లిమ్‌గా ఉండాలంటే ఉదయాన్ని లేచి వ్యాయామం చేయాలి. ఫుడ్‌ను నియంత్రించాలి. ఇన్ని కష్టాలపడి మోడలింగ్‌లో నిలబడటం సామాన్య విషయం కాదు. నటన, డ్యాన్సులు అంటే చాలా ఇష్టం. ఒక సారి ఓ ఈవింట్‌లో డ్యాన్స్ చేశా. తరువాత అక్కడ ఉన్న కొందమంది నువ్వు మోడలింగ్ రంగంలోకి వస్తే బాగుంటుందని చెప్పారు. దాంతో ఈ రంగంలోకి వచ్చాను. ఇప్పటి వరకు 7 లఘు చిత్రాలు, 4 వీడియో సాంగ్స్ చేశాను. భవిష్యత్‌లో హీరోయిన్‌గా స్థిరపడాలని ప్రయత్నిస్తున్నాను. ఇప్పుడిప్పుడే యువత మోడలింగ్ రంగం వైపు చూస్తోంది. మోడలింగ్ రంగం వైపు వచ్చే వారు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధపడాలి.



నవ్య, విశాలాక్షినగర్



ర్వహించిన ఫ్యాషన్‌షోలో ర్యాంప్‌పై హొయలుపోతున్న మోడల్స్

మోడలింగ్ అంటే పిచ్చి

ఎన్ఐఎస్‌టీ(నోబుల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ)లో ఎంబీఏ పూర్తి చేసి మోడలింగ్ రంగంలో దూసుకుపోతున్నాడు హరికృష్ణారెడ్డి. ఇప్పటి వరకూ 30 మోడల్ షోలో ప్రదర్శ ఇచ్చాడు. సిటీలో మేల్ మోడల్స్ అతి తక్కువ మంది ఉన్నారు. వారిలో హరి తన బెస్ట్ ఫెర్ఫామెన్స్‌తో ఆకట్టుకుంటున్నాడు. చిన్నప్పటి నుంచి మోడలింగ్ అంటే పిచ్చి..అందుకే ఈ రంగంలో రాణించేందుకు కష్టపడుతున్నా. నగరంలో ఫ్యాషన్ షో ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి వల్ల మాలాంటి వాళ్లు సత్తాచాటుకునేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. భవిష్యత్తులో విశాఖ మోడలింగ్ రంగంలో హైదరాబాద్‌ను మించిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు.



హరికృష్ణరెడ్డి, గాజువాక



శాఖ దక్షిణ)
ఖ తూర్పు)
ల్చరల్

టీ

శాఖ మోడల్స్

లుపోతున్న
టీస్



మోడల్ ప్రణతి

ఫ్యాషన్..ఓ అందమైన కళ. వైజాగ్‌లో ఈ రంగం కొత్త ఒరవడి సృష్టిస్తోంది. సిటీయువత దీనిపై ఆసక్తి చూపుతోంది. ఈ మధ్య కాలంలో స్మార్ట్‌సిటీ ఫ్యాషన్ రంగానికి కేంద్రంగా మారింది. వివిధ వేదికల్లో నగర మోడల్స్ సత్తా చాటుతున్నారు. ముంబాయి, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకే పరిమితమైన ఫ్యాషన్ ఎగ్జిబిషన్లు వైజాగ్‌కూ విస్తరించాయి. ఈ మధ్య కాలంలో అనేక స్థాయిలో ర్యాంప్‌వాక్‌లు మొదలుకొని ఉత్పత్తుల ప్రదర్శనలు ఇక్కడ పెరిగాయి. పెద్ద నగరాల నుంచి దిగుమతి చేసుకునే ఫ్యాషన్ ఒరవడి నుంచి సొంతంగానే డిజైన్లను రూపుదిద్దుకునే స్థాయికి స్మార్ట్‌సిటీ చేరింది. నగరానికి చెందిన మోడలింగ్ హర్ష మిస్ ఢిల్లీ అందాల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే అఖిల భారతీయ స్థాయిలో శ్వేష రోహిత్ అనే అందాల రాణి తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. వైజాగ్ ఫ్యాషన్ రంగం మరింతగా విస్తరిస్తోంది. రోజురోజుకూ కొత్త ట్రెండ్స్ వస్తున్నాయి. రిటెయిల్ ఫ్యాషన్ ఔట్‌లెట్స్ కూడా సెక్సెస్ అవుతున్నాయి. ఫ్యాషన్ ఎగ్జిబిషన్లు, ప్రదర్శనలు, ర్యాంప్ వ్యాక్‌లతో నగరంలో హోరెత్తిస్తున్నాయి. గతంలో బెంగళూరు, కోల్‌కత్, ఢిల్లీ, ముంబాయి నుంచి ఫ్యాషన్ అడాప్ట్ చేసుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పెద్ద నగరాలతో సమానంగా వైజాగ్ నిలుస్తోంది. ఇప్పటికే కొన్ని సంస్థలు ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులను ప్రవేశ పెట్టాయి. ఉన్నతస్థాయి ఫ్యాకల్టీతో సక్సెస్‌ను సాధిస్తున్నాయి.

నాలుగు సినిమాల్లో హీరోగా...

నగరానికి చెందిన సునీల్ చరణ్ (డాబాగార్డెన్స్) పెద్ద నటుడు కావాలని చిన్నతనం నుంచే కలలుగన్నాడు. కుమారుడు ఉత్సాహాన్ని తల్లిదండ్రులు విజయ్‌కుమార్, ఈశ్వరి గమనించి ఆ దశిగా ప్రోత్సహించారు. చిన్న చిన్న మోడల్ షోలో పాల్గొంటూ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకున్నాడు. అన్ని రంగాల్లో శిక్షణ పొందాడు. ఇప్పటికే అనేక ఆల్బమ్స్‌లో నటించాడు. పాటలు కూడా రాస్తాడు. ఏమయింది, బ్రహ్మరాత, పోరు వంటి తెలుగు సినిమాల్లో నటించాడు. ఓ తమిళ సినిమా కూడా నటించాడు. విశాఖ డాబాగార్డెన్స్‌లో 9వీఎఫ్‌ఎక్స్ ఎడిటింగ్, గ్రాఫిక్స్, ఫిల్మ్ ప్రొడక్షన్ స్టూడియో నిర్వహిస్తున్నాడు. అటు ఉపాధి పొందుతూనే సినిమాల్లో మంచి పాత్రలకోసం ట్రై చేస్తున్నాడు.



ర్యాంప్ స్టార్ అనుషా

సీతమ్మధారకు చెందిన అనూషా ర్యాంప్‌పై నడిచొస్తే కెవ్వు కేకే. మోడల్‌కు కావాల్సిన లక్షణాలన్నీ ఉన్నాయి. గీతంలో ఎంబీఏ పూర్తిచేసిన అనూషా మంచి మోడల్‌గా, నటిగా రాణించాలని ప్రయత్నిస్తోంది. అటు మోడల్‌గా, ఇటు నటిగా మెప్పిస్తోంది. ఆమె నటించిన ఇలా..ఎలా షార్ట్‌ఫిల్మ్ యూట్యూబ్ ప్రియులను ఫిదా చేసింది. ' ఇదేమి ట్విస్ట్', ' గాంధారీ' షార్ట్‌ఫిల్మ్‌లో నటించింది. అలాగే నాని హీరోగా నటించిన నిను కోరి చిత్రంలో నటించింది. నగరంలో వివిధ మోడల్ షోస్‌లో పాల్గొంది. లోకల్ మోడల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తే ఎక్కువ మంది అమ్మాయిలు ఈ రంగంలో రావడానికి సిద్ధంగా ఉన్నారని చెబుతోంది.





మిస్ ఆంధ్రాలో సత్తా

నవ్య..ఇప్పటికే మోడలింగ్ రంగంలో తనేంటో నిరూపించుకుంది. విశాఖ ఫ్యాషన్ కల్చర్‌లో ఆమె పేరు అందరికీ సుపరిచయమే. తండ్రి బోజిరాజు పోలీసు ఉద్యోగి. ఆయన సినిమాల్లో నటించాలని కోరిక ఉండేది. ఉద్యోగ రీత్యా అది సాధ్యం కాలేదు. తన కలను కూతురు రూపంలో నిజం చేసుకోవాలని భావించాడు. మోడలింగ్ రంగంలో కూతుర్ని ప్రోత్సహిస్తూ తన కలను నిజం చేసుకుంటున్నారు. విశాఖలో జరిగిన మిస్ విశాఖ -2016లో రన్నరప్‌గా నిలిచింది. బెస్ట్ ఐస్ విభాగంలో విజేతగా నిలిచింది. ఇటీవల విజయవాడలో జరిగిన మిస్ ఆంధ్రా పోటీలో ఫైనల్ వరకూ వెళ్లింది. భవిష్యత్తులో మంచి మోడల్‌గా, సినీ నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉందని చెప్పింది.

షార్ట్‌ఫిల్మ్స్‌లో రాణిస్తూ...

మౌనిక..మంచి మోడల్. ర్యాంప్ వాక్ చేస్తూ విశాఖవాసులను మైమరిపిస్తోంది. ఇప్పటికే చాలా మోడల్ షోస్‌లో పాల్గొంది. ఎస్ఆర్‌కే కళాశాలలో బీటెక్ పూర్తి చేసి పూర్తిస్థాయి మోడల్‌గా నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. షార్ట్‌ఫిల్మ్‌లో నటిస్తూ మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. కొత్తవారితో సెప్టెంబర్‌లో నిర్మించే ఓ చిత్రంలో అవకాశం వచ్చింది. అటు మోడలింగ్, ఇటు సినిమా రంగంలో రాణించాలన్నదే ధ్యేయమని చెబుతోంది.



మౌనిక, సీతమ్మధార

తలకెక్కిన క్రియేటివిటీ



టేల్స్ కట్ ఫ్యాషన్‌లో నాగరాజు



స్పైక్స్ కట్‌లో విజయ్‌కుమార్

విజయ్‌కుమార్ ట్రెండ్ ఫాలో అవుతూ కొత్త ఫ్యాషన్స్‌ను ఎడాప్ట్ చేసుకుంటున్నాడు. గోపాలపట్నంలో సెలబ్రెటీ అయిపోయాడు. చంద్రనగర్‌కు చెందిన ఆదినారాయణ కూడా ఫ్యాషన్‌కు కొత్త భాష్యం చెబుతున్నాడు. లైన్స్ కటింగ్, కోకొడైల్, డెవిల్ కటింగ్, వెడ్డింగ్ అప్లికేషన్‌తో దుమ్మురేపుతున్నాడు. ఇక నరసింహనగర్‌కు చెందిన మనోజ్‌కుమార్‌లో కాస్త క్రియేటివిటీ ఎక్కువేనొండోయ్. సోషల్ వైబ్‌సైట్లు ఫాలో అవుతూ న్యూ ఫ్యాషన్స్‌ను అనుసరిస్తున్నాడు. బుచ్చిరాజుపాలెంకు చెందిన లక్ష్మణ్ అయితే పదేళ్లుగా న్యూ ట్రెండ్ క్రియేట్ చేస్తున్నాడు. ఇంటర్నెట్‌లో టాప్ మోడల్స్‌ను ఫాలో అవుతూ కటింగ్‌లకే కటింగ్ ఇస్తున్నాడు. నాకు నచ్చినట్టే నేనుంటా అంటున్నాడు.

- గోపాలపట్నం (విశాఖ పశ్చిమ)



క్రొకోడైల్ స్టైల్‌లో చిన్న



స్ట్రైప్స్ కట్‌లో ఆదినారాయణ



ఊసరవెల్లి స్టైల్లో లక్ష్మణ్

విశాఖ సిటీ | సోమవారం | ఆగస్టు | 21 | 2017 సాక్షి

ఉల్లాసంగా..ఉత్సాహంగా..


కొత్తపల్లి జలపాతాల వద్ద పర్యాటకులు


సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల(పాడేరు): కొత్తపల్లి జలపాతాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. చల్లని వాతావరణంలో చక్కటి ప్రకృతి అందాలను తనివితీరా చూడడానికి రోజూ పర్యాటకులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి కుటుంబ సభ్యులతో కార్లు, జీపులు, టూరిస్టుబస్సులు, బైకులపై అధికసంఖ్యలో వచ్చారు. రోజంతా కేరింతలతో జలకాలాడారు. ఇక్కడి గిరిజనులు తయారుచేసే బేంబూ చికెన్‌కు ముందుగా ఆర్డర్ ఇచ్చి జలపాతాల వద్ద బండరాళ్లపై కూర్చొని అందాలను ఆస్వాదిస్తూ వెంటతెచ్చుకున్న భోజనాలతో కలిపి లొట్టలేసుకుంటూ తిన్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. జలపాతాల వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అభియూత్ సభ్యులు పర్యాటకులకు రక్షణగా నిలిచారు.

ఆకట్టుకున్న రామాంజనేయ పద్య నాటకం


రామాంజనేయ యుద్ధం పద్యనాటకంలో ఓ సన్నివేశం

పీఎంపాలెం (భీమిలి): వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం పౌరాణిక ప్రద్య నాటక ప్రదర్శన అలరించింది. అక్కయ్యపాలెం శ్రీ గౌరీపరమేశ్వరి నాటక కళాసమితి కళాకారులు నాటకంలోని వివిధ సన్నివేశాలను రాగయుక్తమైన పద్యాలతో రక్తి కట్టించారు. యుద్ధసీనులో శ్రీరామ పాత్రధారి కంచెర్ల శ్రీనివాసరావు ఆలపించిన పద్యాలు కుశలంబే కద ఆంజనేయ.., రామునే ఎదిరింప.., తదితర పద్యాలు నాటక ప్రియులను ఆకట్టుకున్నాయి. అందుకు దీటుగా ఆంజనేయ పాత్రధారి ఆడారి సుబ్రహ్మణ్యం పోటా పోటీగా పద్యాలు ఆలపించి నాటకాన్ని రక్తి కట్టించారు. నారదునిగా బగాది విజయసాయి, యయాతిగా కోటం సెట్టి అప్పారావు, విశ్వామిత్రునిగా కూన లక్ష్మణరావు తమ దైన శైలిలో మెప్పించారు. రాధాకృష్ణ హార్మోనియం సహకారం అందించారు.

ప్రభుత్వ దృష్టికి క్రేన్ ఓనర్స్ సమస్యలు



మాట్లాడుతున్న అసోసియేషన్ చైర్మన్ రాజేష్

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): హెవీ క్రేన్ ఓనర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు విశాఖ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూసర్ల రాజేష్, అధ్యక్షుడు లీలా రాఘవరావు, కార్యదర్శి వెంకు మహంతి చంద్రశేఖర్ తెలిపారు. అసోసియేషన్ 4వ సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ముందుగా ఇటీవల మరణించిన క్రేన్ ఓనర్ విక్రమ్ ప్రకాష్ ధమిజా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పన్ను విధానం పెంపు కారణంగా భారీ క్రేన్ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భారీ క్రేన్స్ పని చేయకూడదని కొన్ని రాష్ట్రాల్లో అక్కడి క్రేన్ ఓనర్స్ ఆంక్షలు విధించడాన్ని ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీని స్వాగతిస్తున్నామని, అయితే దానిపై పూర్తి స్పష్టత లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆడిటర్‌తో సభ్యులకు జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి పిల్లా కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, సుమారు 50 మంది క్రేన్ యజమానులు పాల్గొన్నారు.

మానసిక ఎదుగుదలకు యోగా దోహదం

- జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం


యోగా పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార (విశాఖ ఉత్తరం): మనిషి మానసిక ఎదుగుదలకు యోగా ఎంతగానో ఉపకరిస్తుందని ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. జిల్లా యోగా సంఘం, విజయ సాయి యోగా చారిటబుల్ ట్రస్ట్, నేచురల్ క్యూర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్సన్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం 11వ జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. జ్యోతిప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయగల శక్తి యోగాకు ఉందన్నారు. ప్రస్తుతం రోజుల్లో ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో ఒత్తిడికి లోనవుతున్నారని, వాటిని దూరం చేసి మనసు ప్రశాంతంగా ఉండడానికి యోగా ఒక వరమని తెలిపారు. జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు కె.ఎ.రాజు మాట్లాడుతూ పోటీలకు 8 నుంచి 80 ఏళ్ల వారి వరకు సుమారు 500 మంది హాజరయ్యారని తెలిపారు. మహిళల విభాగంలో ఏడు గ్రూపులు, పురుషుల విభాగంలో ఏడుగ్రూపులుగా విభజించి 10 ఆసనాలకు సంబంధించి పోటీలు నిర్వహించామని, ఒక్కో గ్రూప్‌లో ఆరుగురు విజేతలను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని సెప్టెంబర్ 9, 10,11, తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఏయూ యోగా విభాగం గురువులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు సర్వేశ్వరరావు, జి.హనుమంతరావు పాల్గొన్నారు.

పొమ్మనలేక పొగ

- అంగన్‌వాడీ లింకు వర్కర్లకు 15 నెలలుగా అందని వేతనం
- తొలగించేందుకే ఈ తాత్సారం అంటూ వర్కర్ల ఆందోళన


లోచలిపుట్టు అంగన్‌వాడీ కేంద్రం

పాడేరు: ఏజెన్సీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న లింకు వర్కర్లకు ఏడాది నుంచి ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయడం లేదు. 15 మాసాలు నుంచి ప్రభుత్వం వేతనాలు చెల్లించని పరిస్థితి చూస్తే లింకు వర్కర్లను పొమ్మనలేక పొగ బెట్టిన చం దంగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు (ప్రీస్కూల్) అక్షరాలు నేర్పడం, సెంటర్లలో గర్భిణుల నమోదు, రికార్డుల నిర్వహణ పనుల కోసం మూడేళ్ల క్రితం ఏజెన్సీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లింక్ వర్కర్లను స్త్రీశిశు సంక్షేమశాఖ నియమించింది. ఏజెన్సీ 11 మండలాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1785 లింకు వర్కర్ పోస్టులు మంజూరయ్యాయి. టెన్త్ ఉత్తీర్ణులైన మహిళలను లింక్ వర్కర్ పోస్టులకు ఎంపిక నిర్వహించి 1220 మందిని నియమించారు. 565 పోస్టులు భర్తీ కాలేదు. వీరికి నెల వేతనం రూ.750 చొప్పున చెల్లిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు లింకు వర్కర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్హతలు లేని అంగన్‌వాడీ వర్కర్లున్న కేంద్రాల్లో లింకు వర్కర్ల సేవలు ఉపయోగపడుతున్నాయి. ప్రధానంగా గర్భిణులు పాటించవలసిన నియమాల గురించి అవగాహన కల్పించడం, చిన్నారులకు అక్షరాలు నేర్పిస్తున్న లింకు వర్కర్లు ఏడాది క్రితం నుంచి ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో వీరు అంగన్‌వాడీ కేంద్రాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. వేతనాలు అందకపోవడంతో ఇప్పటికే కొంతమంది స్వచ్ఛందంగా మానేశారు. వేతనాలు మంజూరు చేయాలని అడిగితే బడ్జెట్ విడుదల కాగానే ఇస్తామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారని, 15 నెలలుగా బకాయి వేతనాలు కోసం నిరీక్షిస్తున్నామని లింకు వర్కర్లు చెబుతున్నారు. లింకు వర్కర్లను తొలగించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోయినా వేతనాలు మంజూరు కావడం లేదు. కాబట్టి వేరే పని చూసుకోమని లింకు వర్కర్లకు పరోక్షంగా ఐసీడీఎస్ అధికారులు సూచిస్తున్నారు. దీన్నిబట్టి చూస్తే లింకు వర్కర్లకు ఉద్వాసన పలికేందుకే ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

బకాయి వేతనాలు చెల్లించాలి



15 నెలల నుంచి మాకు వేతనాలు చెల్లించడం లేదు. గతంలోనూ నాలుగైదు నెలలకొకసారి వేతనాలు మంజూరయ్యేవి. అదే విధంగా వేతనాలు చెల్లిస్తారనే ఉద్దేశంతో నేటికీ విధుల్లోనే కొనసాగుతున్నాం. మాకు బకాయి వేతనాలు చెల్లించేందకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–**కొట్టగుల్లి మచ్చమ్మ**,లింకు వర్కర్, లోచెలిపుట్టు అంగన్‌వాడీ కేంద్రం

వేతనాల కోసం ప్రతిపాదించాం..



2016 మే నెల వరకు వేతనాలు చెల్లించాం. లింకు వర్కర్ల వేతనాలు మంజూరు కోసం ప్రతిపాదన చేశాం. ఐతే లింకు వర్కర్ల పెర్‌ఫార్మెన్స్ పై నివేదికలు ఇమ్మని మాకు ఆదేశాలు వచ్చాయి. అంతే తప్ప లింకు వర్కర్లను తొలగించాలనే ఆదేశాలేమీ ప్రభుత్వం నుంచి లేవు. ఎక్కడైనా అంగన్వాడీ వర్కర్లు ఖాళీ అయితే ఆ స్థానంలో లింకు వర్కర్లను నియమిస్తాం.

–**లలితకుమారి**, సీడీపీవో, పాడేరు

నూకాంబికకు భక్తజనుల పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భారీస్థాయిలో భక్తులు తరలివచ్చారు. శ్రావణమాసంలో ఆఖరి ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా మొక్కుబడులు ఉన్నవారు అమ్మవారి ఆలయ పరిసరాల్లో మొక్కులు తీర్చుకున్నారు పూజలు జరిపారు. ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సహాయ కమిషనర్ ఎస్.సుజాత అవసరమైన ఏర్పాట్లు చేశారు.

దత్తక్షేత్రంలో..

గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిహోమం, తైలాభిషేకం చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉపద్రవం

- నూతన పెన్షన్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగులకు శాపం
- ఉద్యోగుల కష్టం కార్పొరేట్ సంస్థల ధారాదత్తం
- సిబ్బందికి నష్టం కలిగిస్తున్న ప్రభుత్వ విధానాలు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, కార్మికుల సమాఖ్య నేత నాగేశ్వరరావు


కొత్త పెన్షన్ విధానంపై సదస్సులో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఎన్ఏడీ జంక్షన్ (విశాఖ పశ్చిమ): కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ప్రభుత్వ విధానాల కారణంగానే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, కార్మికుల సమాఖ్య ఏపీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ (సీఎఫ్ఆర్డీఏ) ఏర్పాటు చేసి సిబ్బంది ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ విధానం అమలు సమంజసం కాదని ఆక్షేపించారు. కొత్త పెన్షన్ విధానంపై ఆదివారం ఇక్కడి ఎన్ఎస్టీఎల్ మానసి ఆడిటోరియంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రక్షణ ఉద్యోగుల, కార్మికుల సమన్వయ సంఘం, కేంద్ర ఉద్యోగుల, కార్మికుల సమాఖ్య విశాఖపట్టణం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల కష్టమంతా కార్పొరేట్ యాజమాన్యాల జేబుల్లోకి వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ విధానం వల్ల ఎలాటి నష్టాలు ఉంటాయో వివరించారు. దేశంలో ఉద్యోగుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోందని, ఇప్పుడు ఉద్యోగుల సంఖ్య తక్కువగా, పెన్షనర్ల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. 1986 నాటికి 50 లక్షల మంది ఉద్యోగులుంటే 2006 నాటికి 28 లక్షలకు తగ్గిపోయారని వివరించారు. ఉద్యోగుల విషయంలో ప్రభుత్వాలు విషపూరిత విధానాలను అనుసరిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం ఓ అలవాటుగా మారిపోయిందని తెలిపారు. దీన్ని ఉద్యోగులంతా తిప్పికొట్టాలని అన్నారు.2004 జనవరి నుంచి రిక్రూట్ అయిన వారికి నూతన పెన్షన్ విధానం ఆశనిపాతంలా ఉందన్నారు. కొత్త విధానం వరం కాదని శాపమని విమర్శించారు. కార్మిక నాయకుడు రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ రక్షణ రంగంలో ప్రయివేటు సంస్థలకు ప్రమేయం కల్పించడంతో దేశ రక్షణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్మిక నాయకులు జీటీ గోపాలరావు, ఎన్ఎస్టీఎల్ సివిలియన్ ఎంప్లాయాస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మూర్తి, ఎఐడీఈఎఫ్‌జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈసరి శ్రీనివాసరావు, ఎన్ఏడీ కార్మిక నాయకుడు థామస్, పోస్టల్ జేఏసీ నాయకుడు ఎస్ దాస్, ఎన్ఈసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి పెరిగి నరాల వ్యాధులు

- న్యూరోవిజన్–17లో
- చెన్నై న్యూరాలజిస్టు వేల్ మురుగన్


న్యూరోవిజన్-2017 సావనీర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణ): మారుతున్న కాలానికి తగ్గట్టుగా రకరకాల వ్యాధులు సంక్రమిస్తున్నాయని.. నరాలు, మెదడుకు సంబంధించిన వ్యాధులు కూడా ఈకోవలోకి వస్తాయని చెన్నైకి చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సి.యు.వేల్‌మురుగేంద్రన్ చెప్పారు. మానసిక ఒత్తిడి, తీవ్రమైన ఆలోచనలు, ఆందోళన, పరిసరాల ప్రభావం, కాలుష్యం వంటి అనేక అంశాలు నరాల వ్యాధులకు కారణం అవుతున్నాయని చెప్పారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన 'న్యూరోవిజన్–2017 నిరంతర వైద్య విద్యా సదస్సు'లో ఆయన మాట్లాడారు. సత్వరం చికిత్స అందిస్తే ఈ వ్యాధులను సమర్థవంతంగా నయం చేయవచ్చని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.రవిరాజు మాట్లాడుతూ, నిరంతర అభ్యాసం, అధ్యయనంతోనే తోనే వైద్య రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న పెనుమార్పులను, వైద్య సంబంధ ఆవిష్కరణలను వృత్తిలో ఉన్న వైద్యులతో పాటు విద్యార్థులు కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. నరాల, మెదడు సంబంధ వ్యాధులతో బాధపడేవారికి ఉపశమనం కలిగేలా ఆధునిక చికిత్సా విధానాలను కనుగొన్నట్టు తెలిపారు. న్యూరలాజికల్ వ్యాధులతో సతమతమయ్యేవారికి తొమ్మిది గంటలలోనే మెరుగైన చికిత్స అందించి స్వస్థత కల్పించే వీలుందని చెప్పారు. అనంతరం న్యూరాలజీ–2017 సావనీర్‌ను విడుదల చేశారు. డాక్టర్ వి.సత్యనారాయణ, డాక్టర్ ఆర్.వి.నారాయణ, డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రసంగించారు. సదస్సులో ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి 275 మంది వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

హిజ్రాలపై ఎల్లాజీ దాడి

కంచరపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు


కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన హిజ్రాలు

ఎన్ఏడీ జంక్షన్ (విశాఖ పశ్చిమ): హిజ్రాల సంఘం నాయకుడు, టీడీపీ మాజీ వార్డు అధ్యక్షుడు సూరపు ఎల్లాజీపై హిజ్రాలు మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై దాడి చేశాడని వారు శనివారం రాత్రి కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. హిజ్రాలు తన చేయిజారిపోతున్నారన్న అక్కసుతో ఎల్లాజీ శనివారం అర్ధరాత్రి తమపై దాడి చేశాడని వారు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పోలీసులు, హిజ్రాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల పలు కేసుల్లో అరెస్టయి రిమాండ్‌ను అనుభవించిన ఎల్లాజీ బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇన్నాళ్లూ అతడు తమను ప్రధాన ఆదాయ వనరుగా వాడుకున్నాడని, కానీ ఇప్పుడు తాము అతడి అధీనంలో లేరన్న కోపంతో, తమను బెదిరించైనా తన దారిలోకి తెచ్చుకోవాలన్న ధ్యేయంతో దాడికి పాల్పడ్డాడని హిజ్రాలు ఫిర్యాదులో తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో తాము నివసిస్తున్న ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ గోపిక అనే హిజ్రాపై దాడికి పాల్పడ్డాడని వాపోయారు. తమకు ఇళ్లు అద్దెకు ఇచ్చిన వారికి కూడా అసభ్యకర పదజాలంతో తిట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వాలని తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లాజీ నుంచి తమకు రక్షణ కల్పించాలని పోలీసుల్ని కోరారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.


దాడికి గురయిన హిజ్రా గోపిక

మిగిలింది నిరాశే!

- కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ప్రశ్నార్థకం
- స్థల కేటాయింపులో సాంకేతిక అవరోధాలు
- ప్రాతిపదిక పనులకే లక్షల రూపాయల వృథా
- దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థలంలో అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణాలా..?


అచ్చియ్యపేటలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

అనకాపల్లి: అనకాపల్లిలో కేంద్రీయ విద్యాలయం తరగతులు ఈ ఏడాది కూడా ప్రారంభం కాదని స్పష్టమవుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పనిచేసే ఉద్యోగుల పిల్లలకు, కేంద్రీయ విద్యాలయాల్లోకి చేరేందుకు అర్హత ఉన్న విద్యార్థులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. కేంద్రీయ విద్యాలయానికి సమకూర్చాల్సిన స్థలం విషయంలో ఏర్పడిన సాంకేతిక అవరోధాలు తరగతులు ప్రారంభం కాకపోవడానికి కారణంగా తేలింది. అలాంటప్పుడు ఈ ఆర్భాటమెందుకు, నిధులు ఖర్చు చేయడమెందుకు, మారుతున్న నిబంధనల గురించి అధికారులకు తెలియకపోవడం ఏంటి?దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న స్థలంలో రహదారి నిర్మాణానికి అనుమతులు ఎవరిచ్చారనేది ఇప్పుడు తేలాల్సి ఉంది.

ఎదురు చూడాల్సిందే

ఇటీవల కాలంలో గ్రామీణ జిల్లాలో పరిశ్రమలు స్థాపించారు. మరికొన్ని కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న నేవల్‌బేస్ వంటి సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయి.గ్రామీణ జిల్లాలో వివిధ చోట్ల పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు అనకాపల్లి పరిసరాల్లో నివాసముంటున్నారు. ఈ కారణంగా ఆయా ఉద్యోగుల పిల్లలకు కేంద్రీయ విద్యాలయం అనుకూలంగా ఉంటుందనే భావించారు.గత విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు.అదీ సాధ్యం కాలేదు. అయితే ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్ని శాఖల అధికారులు ప్రకటించారు. నెల అటూ ఇటూ అయినా కేంద్రీయ విద్యాలయం తరగతులు ఉ ప్రారంభం అవుతాయని ఆశపడిన విద్యార్థులకు మళ్లీ నిరాశే మిగిలింది.

నిధుల వృథా

అనకాపల్లి ఉడ్‌పేట ఎలిమెంటరీ పాఠశాలలో కేంద్రీయ విద్యాలయం తరగతులను తాత్కాలిక ప్రాతిపదికన ప్రారంభించేందుకు గానూ రూ. 25 లక్షల రూపాయిలతో గదులను నిర్మించారు. అయితే శాశ్వత ప్రాతిపదికన స్థలాన్ని స్వాధీనం చేసుకొన్న తర్వాతే కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభిస్తామని సంబంధిత అధికార యంత్రాంగం పేర్కొనడంతో ఈ నిధులు ఇక వృథా అయినట్లేనని తెలుస్తోంది.

అనాలోచితంగా రోడ్డు నిర్మాణం

అచ్చియ్యపేట సర్వే నంబర్ 511లో పదెకరాల స్థలాన్ని కేంద్రీయ విద్యాలయానికి కేటాయించారు. దీన్ని చేరుకునేందుకు రహదారిని నిర్మించారు. ఇప్పుడు ఆ రహదారే కొంపముంచింది.

సదరు రహదారిలో 85 సెంట్ల స్థలం దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందినదిగా అధికారులు తేల్చారు. అంటే స్థలం ఎవరిదో తెలియకుండానే నిధులు వెచ్చించి రోడ్డు నిర్మించారనే ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమైంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి ఆ స్థలం ఆర్‌అండ్‌బీకి గానీ, స్థానిక రెవెన్యూ విభాగానికి బదిలీ అయితే తప్ప ఆ రోడ్డును వినియోగించడానికి అవకాశం లేదు. మరో వైపు క్షేత్ర స్థాయి వాస్తవాలు తెలియకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థలంలో రోడ్డును నిర్మించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం

ప్రతీష్టాత్మక కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు అవకాశం అనకాపల్లికి వస్తే ఇక్కడి అధికారుల బాధ్యతారాహిత్యం మూలాన సాంకేతిక అవరోధాలు ఏర్పడటం దారుణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని బట్టి మండలంలో భూములు ఎవరికి చెందినవో స్వయంగా అధికారులకే తెలియకపోతే సామాన్యులకు ఎలా తెలుస్తుందని, అసలు అక్కడి క్షేత్ర స్థాయి రెవెన్యూ సిబ్బంది, రహదారి వేసే వరకూ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే వాదన కూడా వినవస్తుంది. ఏదేమైతేనేం ఎంపీ స్వయంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఉన్న సాంకేతిక అవరోధాల గురించి చర్చించి, స్థల సేకరణకు ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించాలని చెప్పే వరకూ అసలు విషయం బయటకు రాలేదు.



తాత్కాలిక ప్రాతిపదిక నిర్మించిన కేంద్రీయ విద్యాలయం

ఇప్పుడు విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని లేకుంటే ప్రతీష్టాత్మకమైన సంస్థలు వచ్చే అవకాశాలు ఇలాగే పోతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



విశాఖ సిటీ | సోమవారం | ఆగస్టు | 21 | 2017

ఆర్‌జీకే కాలనీల్లో చిమ్మచీకట్లు



బ్లాకు నం.117 వద్ద మూడు నెలలుగా వెలగని లైట్లు


బ్లాకు నంబరు 131-135 మధ్య హుద్‌హుద్ నాటి నుంచి వెలగని లైటు

- సగానికి పైగా వెలగని లైట్లు
- 150 బ్లాకుల్లో ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

మధురవాడ: రాజీవ్ గృహకల్ప కాలనీలో వీధిలైట్లు సరిగ్గా వెలగక చీకటిలో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కనీసం గ్రీవెన్స్ సెల్‌లో అయినా మొర పెట్టుకుందామంటే అక్కడా విద్యుత్ అధికారుల జాడే ఉండటం లేదని ఆందోళన చెందుతున్నారు. కొత్త కాలనీ బ్లాకు నంబర్లు 131–135 మధ్య హుద్‌హుద్ తుపాను నాటినుంచి హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు.

ఇక్కడ ఆర్‌జీకే కొత్త, పాత కాలనీల్లో సుమారు 160 బ్లాకులు ఉన్నాయి. ఒక బ్లాకుకు 32 ఇళ్లు ఉండగా నాలుగు బ్లాకుల్లో 130నివాసాలకు ఒక్క లైటు ఉంటుంది. అదీ సరిగ్గా వెలగని పరిస్థితి. ఎక్కువ బ్లాకులు ఉన్న చోట పరిస్థితి మరీ అధ్వానం. వీటిలో నాలుగు బ్లాకులకు ఒకటి, ముఖ్య కూడళ్లలోనూ లైట్లు ఏర్పాటు చేశారు. అవీ వెలగడం లేదు. బ్లాకుల మధ్య సందుల్లాంటి దారుల్లో విషప్పురుగులతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇక దొంగల భయం మరో సమస్య. సగానికి పైగా బ్లాకుల మధ్య ఈ లైట్లు పాడైపోయి ఆరు నెలలు పైబడి వెలగక పోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి వెలుగులు ప్రసరించేలా చూడాలని కోరుతున్నారు.

6 నెలలుగా లైట్లు వెలగట్లేదు


మా బ్లాకుల వద్ద 6 నెలల పైనుంచే లైట్లు వెలగడం లేదు. కాలనీ చివర, చుట్టూ పొదలు, చెత్తాచెదారం ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు ఉండడంతో చీకటి పడితే బయటికి రావడానికి ఇబ్బంది పడుతున్నాం.

– ఎస్.కె.జిలానీ, పాస్టర్, మధురవాడ

అధికారులు పట్టించుకోవట్లేదు


మా రెండు కాలనీల్లో ఎక్కడ చూసినా సగానికి పైనే లైట్లు వెలగడం లేదు. అధికారులకు చెప్పి చెప్పి మాకు విసుగు వస్తోంది. ఏ సమస్యపై ఫిర్యాదు ఇచ్చినా అదిగో..ఇదిగో చేస్తామంటున్నారు. తప్ప పనులు మాత్రం జరగట్లేదు.

– సూర్యచంద్రమణి, కొత్త కాలనీ నివాసితుల సంఘం అధ్యక్షురాలు

మా దృష్టికి రాలేదు

కాలనీల్లో లైట్లు వెలగని విషయం మా దృష్టికి రాలేదు. తక్షణం ఏఈని పంపించి పరిశీలన చేయిస్తాం. అవసరమైన మేర మరమ్మతులు చేయిస్తాం. లైట్లు వెలిగించేందుకు చర్యలు చేపడతాం.

– వర్మ, డీఈ జీవీఎంసీ విద్యుత్ శాఖ

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాల్సిందే

- అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు
- బస్సు యాత్రకు ఘన స్వాగతం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తగరపువలస: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వ పతనం తప్పదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. తగరపువలస చేరుకున్న అగ్రిగోల్డ్ బాధితుల బస్సు యాత్రకు ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.జె.స్టాలిన్, నగర కార్యవర్గ సభ్యుడు ఎం.పైడిరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం చిట్టివలస వెల్ఫేర్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌లో పొదుపు చేసింది పేద, మధ్యతరగతి వారని, సంవత్సరాల తరబడి ఎంతో శ్రమపడి కూడబెట్టిన డబ్బులను ఇందులో పెట్టారన్నారు. ఇప్పుడు వారంతా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 142 మంది వరకు అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇది ఎంతో దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంకా వందలాది మంది తీవ్ర ఆందోళన, మనస్థాపంతో బాధపడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేకపోతే తీవ్ర అనర్థాలు జరుగుతాయని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాధితులందరికీ న్యాయం జరిగే వరకు దశలవారీగా ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, కార్యదర్శి తిరుమలరెడ్డి, సీపీఐ నాయకుడు అల్లు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమ్మ మారువారం పండగ రేపు

పెదవాల్తేరు: పాతవెంకోజీపాలెం కనకమ్మ మారువారం పండగ ఈనెల 22న నిర్వహించనున్నట్లు శ్రీరాధాకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు పల్లా చిన్నారావు తెలిపారు. రాధాకృష్ణ సేవా సంఘం, శెట్టి బలిజ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న పండగ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానుండడంతో ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ రో జు సాయంత్రం ఘనంగా ఊరేగింపు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కలపాకలో సిట్ ఫిర్యాదుపై విచారణ


సిట్ ఫిర్యాదుపై విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

పరవాడ: తన భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని కలపాక గ్రామానికి చెందిన కె.సూర్యనారాయణ అనే వ్యక్తి ఇటీవల సిట్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పరవాడ రెవెన్యూ సిబ్బంది ఆదివారం సంబంధిత భూమి విషయమై గ్రామంలో విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. కె.సూర్యనారాయణకు కలపాక రెవెన్యూ పరిధిలో 135, 138 సర్వే నంబర్లలో మూడెకరాల భూమి ఉంది. ఇందులో గ్రామానికి చెందిన ఇళ్ల అప్పారావు అనే వ్యక్తి 1962 నుంచి సరుగుడు తోటలు, ఇతర వ్యవసాయం చేస్తూ ఫలసాయం అనుభవిస్తున్నాడని సిట్ అధికారులకు సూర్యానారాయణ ఫిర్యాదు చేశాడు. ఈ భూమికి సంబంధించి తన వద్ద రికార్డులు ఉన్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. సిట్ అధికారుల ఆదేశాల మేరకు భర్నికం వీఆర్వో బి.తులసిరావు, సర్వేయర్ త్రిమూర్తులు ఆదివారం సదరు భూమిపై సర్వే నిర్వహించారు. సర్వే రికార్డుల ప్రకారం భూమిపై ఇళ్ల అప్పారావు అనే వ్యక్తి కొన్నేళ్లుగా సాగు చేస్తున్నట్టు గుర్తించారు. ఇద్దరూ ఈ భూమికి సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులకు సమర్పించాలని వీఆర్వో సూచించారు. విచారణ వివరాలను సిట్ అధికారులకు అందజేస్తామని ఆయన చెప్పారు.

అప్పన్నకు ఘనంగా గరుడసేవ


సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడ సేవ ఘనంగా జరిగింది. సింహాచలానికి చెందిన భక్తులు ఈ సేవను స్వామికి జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడ వాహనంపై అధిష్టించి ఆలయ ఆస్థాన మండపంలో ఉంచారు. షోడశోపచార పూజలు నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఉప ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ పూజను నిర్వహించారు.

'గ్రామ కంఠాల హక్కులను పునరుద్ధరించాలి'


నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నేతలు

సింహాచలం: అడవివరం, పాత అడవివరం గ్రామ కంఠాలపై స్థానికులకు ఉన్న హక్కులను పునరుద్ధరించాలని అఖిల పక్షం డిమాండ్ చేసింది. ఈ విషయంపై వచ్చేనెల 3న గ్రామసభ నిర్వహించనున్నట్టు ఆయా గ్రామాలకు చెందిన అఖిలపక్ష నేతలు ప్రకటించారు. అడవివరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం 72వ వార్డు వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన నాయకులు సమావేశమయ్యారు.

పంచ గ్రామాల్లో పది గ్రామకంఠాలు ఉండగా, 1996లో అడవివరం, పాత అడవివరం గ్రామాలకు మాత్రవే సింహాచలం పేరిట పట్టాలు ఇచ్చారన్నారు. మిగిలిన వాటికి మినహాయింపు ఇచ్చారని చెప్పారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. అందుకే హక్కులను పునరుద్ధరించాలని పోరాటం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సెప్టెంబరు 3న అడవివరంలోని ఇందిరా ప్రియదర్శిని కల్యాణ మండపంలో గ్రామసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాశర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ 72వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, టీడీపీ అధ్యక్షుడు పి.వి.నరసింహం, అఖిల పక్షం నేతలు బోర కృష్ణారెడ్డి, లంక సత్తిబాబు, లోగిశ మాధవ, పంచదార్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నరసింగబిల్లమ్మ ఉత్సవానికి భారీ ఏర్పాట్లు

వేపగుంట (గోపాలపట్నం) : వేపగుంట నాయుడుతోట రవినగర్‌లో కొలువుదీరిన నరసింగబిల్లమ్మ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం వైభవంగా చేపట్టడానికి ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా గోపాటపట్నం నుంచి పెందుర్తి, సింహాచలం వరకూ ఇక్కడి నరసింగబిల్లమ్మ వారిని భక్తులు కొలుస్తుంటారు. ఆ రోజు వేల భక్తులకు వీలుగా సదుపాయాలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపడతామని నిర్వాహకులు వివరించారు.

కష్టాల కడలిలో.. కాంట్రాక్ట్ లెక్చరర్లు

- ఆరు నెలలుగా అందని జీతాలు
- సర్వీస్ రెన్యువల్‌కు వెనుకాడుతున్న ప్రభుత్వం
- వెట్టి చాకిరీ చేసినా.. కనీస వేతనాలకు నోచుకోని వైనం

అగనంపూడి (గాజువాక):

పేరు గొప్ప.. ఊరు దిబ్బ.. అన్న చందాన తయారైంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల పరిస్థితి. వెట్టి చాకిరీ చేయించుకొని కనీస వేతనాలకు నోచుకోని దుస్థితి వారిది. ఆరు నెలలుగా జీతాలు అందక కష్టాల కడలిని అతికష్టం మీద కాంట్రాక్ట్ లెక్చరర్లు ఈదుతున్నారు. పనికి తగిన వేతనం చెల్లించాలని గత ఫిబ్రవరిలో ఆందోళన బాట పట్టినా కనకరించని పాలకులు.. చెల్లించే అరకొర జీతాలు కూడా ఏడాదికో.. రెండేళ్లకోసారి గాని చేతికందని జీతాలతో వారి కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఏటా వీరి సర్వీస్‌లను రెన్యువల్ చేయాలి. జూన్ నుంచి వీరి సర్వీస్‌లను రెన్యువల్ చేయడంతో పాటు బడ్జెట్ కేటాయింపులు చేయాలి. కాని ప్రభుత్వం వీరి సర్వీస్‌లను రెన్యువల్ చేయకపోగా, ఆరు మాసాల నుంచి జీతాలు కూడా చెల్లించడం లేదు.

36 కళాశాలల్లో 360 మంది లెక్చరర్లు..

జిల్లాలో 36 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 360 మంది అధ్యాపకులు దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారు. వీరికి పనికి తగిన వేతనం చెల్లించాలని గతంలో ఆందోళన బాట పట్టినా నేటికీ వేతనాలు పెంచలేదు సరికదా.. అరకొర జీతాల బకాయిలు కూడా చెల్లించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుండడంతో వీరంతా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్లకు తెలంగాణాలో నెలకు రూ.37,100 వేతనంగా చెల్లిస్తుంటే ఇక్కడ మాత్రమే కేవలం రూ.18 వేలే చెల్లిస్తున్నారు. పనికి సమాన వేతనం చెల్లించాలని గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆందోళన బాట పడితే దానిని రూ.27 వేలకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించింది. నేటికీ ఆరు మాసాలు కావస్తున్నా జీతాల పెంపు ఉత్తర్వులు విడుదల కాలేదు. ఆ పెంపు కలగానే మిగిలిపోయింది. దీంతో కాంట్రాక్ట్ లెక్చరర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వీరి సర్వీస్‌లు ఎప్పటికైనా క్రమబద్ధీకరణ జరుగుతాయనే నమ్మకంతో వీరంతా వెట్టి చాకిరీ చేస్తూనే ఉన్నారు.



ఆర్థిక ఇబ్బందుల్లో ఒప్పంద అధ్యాపకులు..

జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఏ నాడు సకాలంలో జీతాలు చెల్లించలేదు. దీంతో వీరికి ఎవరూ కూడా అప్పు ఇచ్చే పరిస్థితి లేదు. కిరాణా దుకాణం నుంచి కూడా సరుకులు తెచ్చుకునే పరిస్థితి కూడా లేకుండా పోతోందని వాపోతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ తప్పక గృహ అవసరాల నిమిత్తం అక్కడో ఇక్కడో అప్పులు చేస్తూ కాలం నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ఒప్పంద అధ్యాపకుల జీతాల బకాయిలు చెల్లించాలని, తెలంగాణ మాదిరిగా పనికి తగిన వేతనం చెల్లించాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం ప్రతినిధి కె.లతారాణి కోరారు.

సూపర్ సింగర్ విన్నర్ అయాన్‌ఖాన్



చెక్‌తో సూపర్ సింగర్ విజేత అయాన్‌ఖాన్

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): రేడియో సిటీ 91.1 ఎఫ్ఎం ఆధ్వర్యంలో లవ్ ఇట్ చాక్లెట్స్ సమర్పణలో ఆదివారం సాయంత్రం చిత్రాలయ మాల్లో నిర్వహించిన 'రేడియో సిటీ సూపర్ సింగర్ సీజన్-09' ఫైనల్‌లో అయాన్‌ఖాన్ విజేతగా నిలిచాడు. నెల రోజులుగా వైజాగ్‌లో నిర్వహించిన ఆడిషన్స్‌లో సుమారు 4 వేల ఎంట్రీలు రాగా వారిలో ఆరుగురిని టాప్–6గా ఎంపిక చేశారు. ఆ ఆరుగురి కంటెస్టెంట్‌లో అయాన్‌ఖాన్ సూపర్ సింగర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా విన్నర్ అయాన్‌ఖాన్‌కు రూ.50 వేల నగదు నిర్వాహకులు అందించారు. ఈ పోటీకి న్యాయ నిర్ణేతగా సంగీత దర్శకుడు ఆశీర్వాద్ ల్యూక్ వ్యవహరించారు. కార్యక్రమంలో రేడియో జాకీ, బాల, పీకే, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

రూ.60వేలు చోరీ

పెదవాల్తేరు (విశాఖ తూర్పు) : బీరువాలో ఉంచిన రూ.60వేలు చోరీకి గురయ్యాయని మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఏయూ పూర్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం భవన్ ఏయూ ప్రాంగణంలో ఉంది. అయితే గత వారంలో వరుసగా నాలుగు రోజులు సెలవుల వచ్చాయి. ఆ సమయంలో సంక్షేమ భవనం బీరువాలో రూ.60వేలు నగదు ఉంచారు. సెలవుల తర్వాత భవనానికి రాగా బీరువా తెరిచి ఉంది. అందులోని నగదు కనిపించకపోవడంతో సంఘం ప్రతినిధులు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ



పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): 'భారతదేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ' అని పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాస్ కొనియాడారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన రాజీవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం లేపాక్షి జంక్షన్ వద్ద గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రస్థాయిలో నిలబెట్టిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని పేర్కొన్నారు. సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వంటి సాంకేతిక ఉపకరణాలు వినియోగిస్తున్నామంటే రాజీవ్‌గాంధీయే కారణమన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు బెహర భాస్కరరావు మాట్లాడుతూ ప్రధానిగా ఆయన చేసిన సంస్కరణలు మరిచిపోలేనివని అన్నారు. పార్టీ కార్యకర్తలు రాజీవ్‌ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాజీవ్‌గాంధీ చివరి మజిలీ విశాఖ నగరం కావడం గొప్ప విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, కంపర సత్తిబాబు, గొంపా గోవింద్, కంటుముచ్చు తాతారావు, లింగం శ్రీనివాస్, బండారు శ్రీనివాసరావు, జగన్, పరదేశి, మధు పాల్గొన్నారు.

కోనాం నీటిమట్టం అంతంతమాత్రమే

చీడికాడ (మాడుగుల): మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం రోజురోజుకు తగ్గుతూ వస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలు జలాశయం ఆవలగల కొండలపై లేకపోవడంతో జలాశయంలోకి ఇన్‌ఫ్లో భారీగా పడిపోయింది. ప్రస్తుతం ఖరీఫ్ వరినాట్లకు జలాశయం ఎగువ, దిగువ కాలువల ద్వారా 60 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఈ నెల మొదటి వారంలో వరినారుమడులకు నీరు విడుదల చేసే సమయంలో 94 మీటర్లు ఉన్న నీటిమట్టం ఈ 20 రోజుల్లో రెండు మీటర్లు తగ్గి ప్రస్తుతం 92 మీటర్ల వద్ద ఉంది. ఇన్‌ఫ్లో 15 క్యూసెక్కుల మేర స్థిరంగా వచ్చిచేరుతుంది. అవుట్‌ఫ్లో కంటే ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో జలాశయం నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. మరో మీటరు నీటి మట్టం తగ్గితే ఎగువకాలువ మూతపడుతుంది. ఈ పరిస్థితుల్లో అల్పపీడనంపైనే రైతులు ఆశలు పెంచుకున్నారు.



కోనాం జలాశయం

ధరణీ రక్షతి రక్షితః

దేవరాపల్లి (మాడుగుల):

దేవరాపల్లి గ్రామానికి చెందిన ఈర్నే రాకేష్ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాడు. ప్రస్తుతం ఢిల్లీలో సివిల్స్‌కు ప్రిపరేషన్ అవుతున్న రాకేష్ భూతాపం వల్ల కలిగే అనర్థాలపై లోతుగా అధ్యయనం చేశాడు. కాలుష్యాన్ని నివారించకుంటే భవిష్యత్తులో పెను ప్రమాదకర, విధ్వంసకర ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవలసి వస్తుందని గుర్తించాడు. మరింత ప్రమాదకర స్థాయికి చేరకముందే దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించాడు.

సామాజిక కార్యక్రమంలా..

ఆలోచన వచ్చిందే తడవుగా వినాయక నవరాత్రి మహోత్సవాలను సోషల్ ఈవెంట్‌గా వినియోగించుకోవాలని తలచి వీటి ద్వారా భూతాపం సందేశాన్ని ప్రజలకు చేరవేసేందుకు శ్రీకారం చుట్టాడు. దీనిలో భాగంగా దేవరాపల్లిలోని రాజరాజేశ్వరీ మోటార్స్, హీరో షోరూమ్, మెడ్లిన్స్ ఫ్రాంచైజీల ఆధ్వర్యంలో 'ధరణి రక్షతి రక్షితః' పేరిట గణపతి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. భూతాపం నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా దేశంలోనే దాదాపుగా తొలిసారిగా దేవరాపల్లిలో వెయ్యి చేతుల మట్టి వినాయకుని నిర్మాణం చేపట్టినట్టు రాకేష్ తెలిపాడు. భూతాపం తగ్గించే ప్రయత్నంలో భాగంగా అతని సోదరుడు ఈర్నే నరేష్‌తో కలిసి పోస్టర్లను విడుదల చేశాడు. భూతాప నియంత్రణలో సగటు మనిషి బాధ్యతను వివరించాడు. అందరూ చేతులు కలిపితేనే సాధ్యమవుతుందన్న సందేశాన్ని ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా వెయ్యి చేతుల మట్టి గణపతి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపాడు. ఈ మహత్తర కార్యక్రమంలో తమతో స్వచ్ఛందంగా పాల్గొనదలిచే వారంతా ఈ నెల 29 సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు కేవలం ఒక గంట పాటు విద్యుత్ వాడకాన్ని నిలిపి వేసి సహకారం అందించాలని రాకేష్ విజ్ఞప్తి చేశాడు.



భూతాపం వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఈర్నే రాకేష్ తదితరులు



వినాయక మండపం ప్రధాన గేటు

సోషల్ మీడియా ద్వారా....

గ్లోబల్ వార్మింగ్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా కొన్ని కార్యక్రమాలను నిర్వహించామని, ఈ కార్యక్రమాలకు రెడ్ ఎఫ్ఎం 93.5 వైజాగ్ వారు రేడియో పార్టనర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తమతో పాటు పాల్గొనాలనుకునే వారు అమూల్యమైన సలహాలు, సూచనలు అందించి, మరికొంత మంది పాల్గొనేలా చేయాలని రాకేష్ విజ్ఞప్తి చేస్తున్నాడు. ఈ కార్యక్రమానికి సంబంధించి వివరాలకు 7095233883 నంబరులో సంప్రదించాలని కోరాడు.

వెయ్యి చేతులు మట్టివినాయకుడి తయారీలో

దేవరాపల్లి రాజరాజేశ్వరీ మోటార్స్, హీరో షోరూమ్, మెడ్లిన్స్ ఫ్రాంచైజ్ ఆధ్వర్యంలో దాదాపుగా దేశంలోనే తొలిసారిగా వెయ్యి చేతుల భారీ మట్టి వినాయకుడును తయారీ చేస్తున్నారు. కలకత్తాకు చెందిన కళాకారుడు కోకన్ దిండాతో కూడిన 10 మంది బృందం ఈ విగ్రహం తయారీకి 45 రోజులుగా శ్రమిస్తున్నారు. పర్యావరణానికి విఘాతం కలగకుండా విగ్రహ తయారీకి వరిగడ్డి, స్థానిక మట్టి, వాటర్ కలర్స్, గోగునారతో మాత్రమే తయారీ చేస్తున్నారు. గత ఏడాది కూడా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ధ్యేయంగా 21 శిరసుల భారీ మట్టి విగ్రహాన్ని తయారీ చేసి విశాఖ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు.



దేవరాపల్లిలో నిర్మాణ దశలో వెయ్యిచేతుల భారీ మట్టి వినాయకుడు



మట్టితో చేసిన వినాయకుని చేతులు

ఉత్సాహంగా ట్రెజర్ హంట్

ఉక్కునగరం (గాజువాక) : యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిధి అన్వేషణ (ట్రెజర్ హంట్) కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఉక్కునగరంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో నిధి అన్వేషణకు సంబంధించి క్లూస్ చేరుకునేందుకు పిల్లలు చేసిన ప్రయత్నం ఆద్యంతం ఆసక్తికరంగా నడిచింది. 'సార్ మన్యం వీరుడంటే అల్లూరి సీతారామరాజేనా?', 'లాఫింగ్ బుద్ధ టౌన్‌షిప్‌లో ఎక్కడ' అంటూ పిల్లలు అందరినీ అడుగుతూ ఉక్కునగరంలో క్లూస్‌ను సాధించడానికి కలియ తిరగడం కనిపించింది. ఉక్కునగరం డీపాల్, శివశివాని, అరబిందో, చైతన్య, డీఏవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిధి అన్వేషణలో పోటీ పడ్డారు.


పోటీలు ప్రారంభిస్తున్న ఉక్కు జీఎం బాలచంద్రరావు

అంతకు ముందు ఉక్కు పర్యావరణ విభాగం జీఎం బాలచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. శివశివానీ పాఠశాలకు చెందిన జి. సాయికుమార్, దినేష్‌లు ప్రథమ బహుమతి, వాసు, తరుణ్‌లు ద్వితీయ బహుమతి, డీఏవీ పాఠశాలకు చెందిన శ్రీనాథ్, కిషోర్‌లు తృతీయ బహుమతి సాధించుకున్నారు. ఉక్కునగరం శాఖ చైర్మన్ ఎం. కృష్ణమూర్తి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పి. శ్రీనివాస్, ఎన్.వి.ఎన్.రాజు, భాస్కరరాజు, ఈ. శ్రీనివాస్, సూర్యకుమార్‌లు పాల్గొన్నారు.

వ్యాసరచనతో మానసిక వికాసం

ఉక్కునగరం (గాజువాక) : విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొనడం వల్ల అనేక విషయాలపై అవగాహన పెరిగి మానసిక వికాసం కలుగుతుందని పరవస్తు పద్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి అన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా), స్టీల్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్టీల్‌క్లబ్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మాతృభాష తెలుగు అని, ఆ భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగు వారందరిపైనా ఉంటుందన్నారు. విస్కా కార్యదర్శి ఎ. కేశవరావు మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న బహుమతులు కూడా అందజేయనున్నామని ప్రకటించారు. ఉక్కునగరానికి వ చెందిన సుమారు 250 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



కార్యక్రమంలో స్టీల్‌క్లబ్ కార్యదర్శి విద్యుత్ కుమార్ వర్మ, విస్కా ప్రతినిధులు ఎ.వి.ఎస్.ఎస్.శర్మ, ఈరంకి శ్రీనివాస్, జి.ఆర్.కె. శర్మ, పి.ఎన్‌వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకు ఆకారం ఫొటోగ్రఫీ


అవార్డు పొందిన ఫొటోలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వేణుగోపాలరావు

ఉక్కునగరం (గాజువాక) : 'చరిత్రకు ఆకారం ఫొటోగ్రఫీ' అని, కార్టూన్ ఊహా చిత్రమైతే.. ఫొటోలు వాస్తవాలకు ప్రతి బింబాలు అని స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వేణుగోపాలరావు అన్నారు. 179వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గాజువాక ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కునగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఫొటోగ్రాఫర్లుగా పుట్టడం వారి అదృష్టమన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్‌వాసు మాట్లాడుతూ విశాఖలో అంతర్జాతీయ, జాతీయ స్థాయి అవార్డులు సాధించిన ఫొటోగ్రాఫర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో పద్మశ్రీ అవార్డు పొందిన టి.కాశీనాథ్ తెలుగు వాడు కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ మాజీ అధికారి డి.జె.ఆర్.కె.రాజు, సంఘ అధ్యక్షుడు మధు, గౌరవ అధ్యక్షుడు అజీమ్‌లు ప్రసంగించారు. నగేష్, రామరాజు, శివప్రసాద్, అమ్మిరాజు, శేఖర్ పాల్గొన్నారు.

కాకినాడలో వైఎస్సార్‌సీపీ పాగా ఖాయం

వంశీకృష్ణ శ్రీనివాస్ విస్తృత ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖసిటీ : కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ జోస్యం చెప్పారు. కాకినాడలోని 45వ వార్డులో వంశీకృష్ణకు ఆ పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతల్ని అప్పగించింది. ఈ మేరకు అక్కడి అభ్యర్థి తిరుమలశెట్టి మౌని తరపున ప్రచారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీకి గెలుపు ఎంత అవసరమో వార్డు ప్రజలకు వివరించారు. మూడేళ్ల పాలనలో టీడీపీ చేసిన అరాచకాలు, అవినీతి పనులు వివరించారు. రాష్ట్రంలో రాజన్న రాజ్యం రావాలంటే..జగన్‌ను ముఖ్యమంత్రిగా, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. దీనికి తొలుత కాకినాడలోనే నాంది పలకాలని అన్నారు. ప్రచారంలో ఈయనతో పాటు పార్టీ నగర నేతలు వెంపాడ శ్రీనివాసరెడ్డి, మల్లి అప్పారావు, గొలగాని శీను తదితరులున్నారు.

గిడుగులు పోయి.. గొడుగులు వచ్చె..

పాడేరు :

మన్యంలో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు నిర్వహించేటప్పుడు గిడుగులు వినియోగించడం గిరిజనుల సంప్రదాయం. అడ్డాకులతో అల్లిన గిడుగుల్ని గిరిజనులు సొంతంగా తయారు చేసుకుంటారు. వర్షాకాలంలో ఇవి ఎంతో ఉపయోగపడుతుంటాయి. వర్షంతో పాటు చలికి కూడా తట్టుకుని మంచి రక్షణ కవచంగా ఈ గిడుగులు ఉపయోగపడతాయి. అయితే కాలం మారుతున్నకొద్దీ ఈ గిడుగుల వినియోగం తగ్గిపోతోంది. గిరిజనుల్లోనూ మార్పు కనిపిస్తోంది. అడవి నుంచి అడ్డాకులు తెచ్చి గిడుగులు తయారు చేసుకునే తీరిక లేకపోవడం, నేటి తరంలో వారికి ఈ గిడుగుల అల్లికపై నేర్పు, ఆసక్తి లేకపోవడంతో వీటి వినియోగం తగ్గుతోంది. పాడేరులో ఆదివారం జోరువానలో గిడుగులకు బదులు గొడుగులు వేసుకుని మహిళలు ఇలా వ్యవసాయ పనులు నిర్వహించారు.


గొడుగులు వేసుకుని వ్యవసాయ పనులు చేస్తున్న గిరిజనులు

భీమిలి పరిరక్షణకు నిరంతర పోరాటం

భీమిలి మున్సిపాలిటీ పరిరక్షణ సమితి కన్వీనర్ రాజేటి బసవ కృష్ణమూర్తి



భీమునిపట్నం : భీమిలి మున్సిపాలిటీని మున్సిపాలిటీగానే ఉంచేందుకు ఎన్ని అడ్డంకులొచ్చినా పోరాటం కొనసాగిస్తామని భీమిలి మున్సిపాలిటీ పరిరక్షణ సమితి కన్వీనర్ రాజేటి బసవ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.ఎంతో చరిత్ర కలిగిన ఈ మున్సిపాలిటీని కారణం లేకుండా జీవీఎంసీలో విలీనం చేయడం ఏమాత్రం సరైంది కాదని ఇక్కడ అభివృద్ధి కనబడక పోగా అనేక సమస్యలు ఏర్పడతాయన్నారు. మున్సిపాలిటీగా ఉన్నప్పుడు 28వార్డులకు కౌన్సిలర్లుండడంతో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కనిపించేందని, జీవీఎంసీలో విలీనం అయితే భీమిలి, తగరపువలస కలిపి రెండు వార్డులు మాత్రమే అవుతాయని, దీని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జీవీఎంసీ.. భీమిలిని పట్టించుకునే పరిస్థితుల్లేవన్నారు. మంత్రి గంటా శ్రీనివాసరావు ఎన్నికల సమయంలో భీమిలిని మున్సిపాలిటీగానే ఉంచుతానని హామీ ఇచ్చారని, ఆయన మాటపై నమ్మకం ఉందని, ఆ మేరకు ఆయన కృషి చేయాలని కోరారు. ఇదే విషయమై ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ల మద్దతు కోరనున్నట్టు స్పష్టం చేశారు.

వరినాట్లతో రోడ్డుపై నిరసన


మంగవరం సాయిబాబా ఆలయం వద్ద దమ్ము పట్టి నాట్లు వేసిన దృశ్యం

నక్కపల్లి (పాయకరావుపేట) : పాయకరావుపేట మండలం మంగవరంలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించకపోవడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు ఓ వీధిలో దమ్ము చేపట్టి వరినాట్లు వేశారు. ఆదివారం రాత్రి జరిగిన సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మంగవరంలో వీధులు అధ్వానంగా ఉన్నాయి. రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ గ్రామాభివృద్ధిని పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణం గురించి పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలతో సాయిబాబా గుడివీధి రోడ్డులో మోకాలు లోతున నీరు నిలిచిపోయింది.

పంచాయతీ పాలకవర్గం, అధికారులు పట్టించుకోకపోవడంతో నిరసనగా యువకులంతా కలసి సాయిబాబా ఆలయం ముందు రోడ్డుపై ఆదివారం రాత్రి దమ్ము చేపట్టి వరినాట్లు వేశారు. వీధుల్లో నీరు నిల్వ ఉండి ఈగలు, దోమలు ముసురుకొని రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఎస్సీ కాలనీలో పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. సమస్య పరిష్కరించాలంటూ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టినా పట్టించుకోలేదన్నారు. అధికారులు చొరవ చూపిస్తారనే ఆశతోనే ఇలా చేసినట్టు చెబుతున్నారు.

కరాటే పోటీలకు 11 మంది ఎంపిక



కరాటేలో రాణిస్తున్న యువకులు

పాడేరు : కరాటేలో చక్కని ప్రతిభ కనబరుస్తున్న 11 మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు కరాటే జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరి పాండురాజు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం స్టూడెంట్స్ కోఫోకాన్ కరాటే క్లబ్ ద్వారా విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన విద్యార్థులకు జాతీయస్థాయి పోటీల కోసం ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఏజెన్సీలోని అన్ని పాఠశాలల్లో కరాటే క్లాసులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కరాటే శిక్షణతో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాడేరు కరాటే క్లబ్ ఇన్‌స్ట్రక్టర్ వి.అప్పన్న, వివిధ పాఠశాలల నుంచి 83 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?



డాక్టర్ డి. సమ్మయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

జనరల్ స్టడీస్
బయాలజీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలు ఏవి?
1) చేపలు 2) ఉభయచరాలు
3) సరీసృపాలు 4) క్షీరదాలు

2. కింది వాటిలో ఉష్ణరక్త జీవులు ఏవి?
1) ఎగిరే బల్లి, పక్షి 2) పక్షి, గోదురుకప్ప
3) గోదురుకప్ప, కుందేలు
4) కుందేలు, పావురం

3. భూమిపై నివసించిన తొలి జీవులుగా వేటిని పరిగణిస్తారు?
1) తొండలు 2) సర్పాలు
3) కప్పలు 4) డిప్నాయ్

4. కాలేయం.. ఆహారాన్ని ఏ రూపంలో నిల్వ చేస్తుంది?
1) గ్లూకోజ్ 2) గ్లైకోజన్
3) ఆల్బుమిన్ 4) ఎ.టి.పి.

5. మానవుడిలో ఆహారం శ్వాసనాళంలోకి ప్రవేశించకుండా నిరోధించేది ఏది?
1) స్వరపేటిక 2) గ్రసని
3) కంఠబిలం 4) ఉపజిహ్వ

6. జీర్ణక్రియ, శోషణం జరిపే ఆహారనాళ భాగం ఏది?
1) జీర్ణాశయం 2) పేగు
3) పురీషనాళం 4) ఆస్య కుహరం

7. చిన్న పిల్లల్లో జీరాప్తాల్మియా, పెద్దవారిలో నిక్టోలోపియా(రేచీకటి) ఏ విటమిన్ లోపం వల్ల కలుగుతాయి?
1) డి 2) ఎ 3) ఇ 4) కె

8. వివిధ కర్బన పదార్థాల్లో అత్యంత ఎక్కువ శక్తినిచ్చేవి ఏవి?
1) ప్రొటీన్లు 2) పిండి పదార్థాలు
3) విటమిన్లు 4) లిపిడ్లు

9. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్లీహంను రక్తం నిల్వ చేసే రిజర్వాయర్‌గా పేర్కొంటారు
బి) ఇది ఆర్.బి.సి., డబ్ల్యు.బి.సి.లను ఉత్పత్తి చేస్తుంది
సి) వృద్ధ, మృత ఆర్.బి.సి.లను నాశనం చేయడం వల్ల ప్లీహంను 'ఎర్రరక్త కణాల గ్రేవ్‌యార్డ్' అని పిలుస్తారు
1) ఎ, బి సరైనవి 2) ఎ, సి సరైనవి
3) సి మాత్రమే సరైంది
4) ఎ, బి, సిలు సరైనవే

10. గుండె పోషణకు, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమని ఏది?
1) పుపుస ధమని 2) కరోనరీ ధమని
3) వృక్క ధమని 4) మహా ధమని

11. కంట్లోకి కాంతి ప్రవేశించకుండా నియంత్రించేది?
1) ప్యూపిల్ 2) బ్లైండ్‌స్పాట్
3) ఐరిస్ 4) దృఢస్తరం

12. అడ్రినలిన్ హార్మోన్ దేన్ని పెంచుతుంది?
1) హృదయ స్పందన 2) రక్తపీడనం
3) 1, 2 4) ఏదీ కాదు

13. స్త్రీ బీజ కోశ హార్మోన్లు ఏ రకానికి చెందినవి?
1) ప్రొటీన్లు 2) స్టిరాయిడ్లు
3) పాలీశాఖరైడ్లు 4) లిపిడ్లు

14. కింది వాటిలో పరస్పర వ్యతిరేక ధర్మాన్ని కలిగి ఉన్న హార్మోన్లు ఏవి?
1) ఇంటర్ మిడిన్, ఇన్సులిన్
2) ఇన్సులిన్, గ్లూకగాన్
3) గ్లూకగాన్, ఎడ్రినలిన్
4) ఎడ్రినలిన్, ఇంటర్‌మిడిన్

15. మూత్రంలో యూరియాను విసర్జించే జంతువు ఏది?
1) స్పిర్నా 2) అంబ్లిస్టోమా
3) కంగారు 4) డ్రాకో

16. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
1) నలుపు రంగు 2) పడగ
3) రాళ్లల్లో నివసించడం వల్ల
4) పడగ, మూడో అదిఉష్ణ పొలుసు

17. బాతు ముక్కు(డక్ బిల్డ్) ప్లాటిపస్ అనేది..?
1) విలుప్త సరీసృపం 2) పక్షి
3) మంచినీటి చేప 4) క్షీరదం

18. స్వేద గ్రంథులు లేని క్షీరదం ఏది?
1) కోతి 2) ఆవు
3) తిమింగలం 4) పంది

19. ముంజేతిని కదిపే కండరాలు ఏవి?
1) నునుపు కండరాలు
2) రేఖిత కండరాలు
3) హృదయ కండరాలు 4) ఏదీకాదు

20. జతపరచండి.
a) కుంతకాలు i) 4
b) రదనికలు ii) 8
c) అగ్ర చర్వణకాలు iii) 8
d) చర్వణకాలు iv) 10
v) 12

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	i	ii	iii	iv
3)	i	iii	v	iv
4)	iv	v	iii	ii

21. జతపరచండి.
a) పుర్రె ఎముకలు i) 18
b) కపాల ఎముకలు ii) 22
c) పక్కటెముకలు iii) 24
d) రెండు కాళ్ల ఎముకలు iv) 30
v) 60

	a	b	c	d
1)	ii	i	iii	v
2)	ii	i	v	i
3)	i	ii	iii	iv
4)	iii	ii	iv	v

22. రెండు ఎముకలను, ఎముకను కండరాలతో కలిపి ఉంచే నిర్మాణాలు వరుసగా..?
1) లిగమెంట్, టెండాన్స్
2) టెండాన్స్, లిగమెంట్
3) కీలు, సహనోవియల్ ద్రవం
4) శోషరసం, నరాలు

23. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) కార్నివోర్స్ – మాంసాహారులు
బి) శాంగ్వివోర్స్ – రక్తాన్ని పీల్చేవి
సి) సూడో రూమినేట్ – కల్లుతున్న సేంద్రియ పదార్థాలను గ్రహించేవి
1) ఎ, బి
2) ఎ, సి 3) సి మాత్రమే
4) ఎ, బి, సి

24. డెంగీ వ్యాధికి గురైన వారి రక్తంలో ఏ రక్తకణాల సంఖ్య తగ్గుతుంది?
1) ఆర్.బి.సి. 2) డబ్ల్యు.బి.సి
3) ప్లేట్‌లెట్స్ 4) పైవన్నీ

25. జతపరచండి.
తెల్ల రక్తకణాలు — ఇతర పేర్లు
a) ఇసినోఫిల్స్ i) వ్యాధినిరోధక శక్తి
b) బేసోఫిల్స్ ii) యాంటీ అలర్జీ సెల్స్
c) న్యూట్రోఫిల్స్ iii) మైక్రో పోలీస్‌మెన్
d) లింఫోసైట్స్ iv) గాయాలను మాన్పడం
v) బ్లడ్ కేన్సర్‌కు కారణం

1) a-ii, b-iv, c-iii, d-i
2) a-i, b-ii, c-iii, d-v
3) a-iii, b-ii, c-i, d-iv
4) a-v, b-iv, c-iii, d-ii

26. విసర్జించిన మూత్రం వెంటనే ఎలాంటి వాసన రాదు. కానీ కొంత సమయం తర్వాత వాసన రావడానికి కారణం?
1) మూత్రంలోని యూరియా.. యూరికామ్లంగా మారడం
2) మూత్రంలోని యూరియా.. బాక్టీరియా వల్ల అమ్మోనియా మారడం
3) బాక్టీరియా వల్ల యూరియా.. యూరికామ్లంగా మారడం
4) యూరికామ్లం.. యూరియాగా మారడం

27. జతపరచండి.
శరీర భాగాలు — అధ్యయనం
A) హృదయం i) ప్రినాలజీ
B) మెదడు ii) నెఫ్రాలజీ
C) కాలేయం iii) హెపటాలజీ
D) ఊపిరితిత్తులు iv) పల్మనాలజీ
v) కార్డియాలజీ

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	v	i	iii	iv
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

28. బొద్దింక ఆర్థ్రోపోడా వర్గానికి చెందుతుందని తెలియజేసేవి?
1) స్పర్శశృంగాలు 2) రెక్కలు
3) వివృత రక్తప్రసరణ వ్యవస్థ
4) అతుకుల కాళ్లు

29. కింది వాటిలో రక్తాన్ని పీల్చే రెక్కలు లేని బాహ్య పరాన్న జీవి అయిన కీటకం ఏది?
1) పెడిక్యులస్ 2) దోమ
3) టిక్ 4) మైట్స్

30. కింది వాటిలో మానవుడికి మేలు చేసే కీటకాలు ఏవి?
1) తేనెటీగ, మిడత, లక్క కీటకం
2) పట్టు పురుగు, తేనెటీగ, తూనీగ, మిడత
3) లక్క కీటకం, పట్టుపురుగు, తేనెటీగ
4) రైస్ వీవిల్, పట్టుపురుగు, తేనెటీగ

31. ముత్యపు చిప్ప శాస్త్రీయ నామం ఏది?
1) సింక్టాడ 2) నియోపిలైన
3) నాటిలస్ 4) జాంకస్

32. కింది వాటిలో పరాన్న జీవులు లేని వర్గం?
1) పొరిఫెరా 2) మలస్కా
3) అనిలెడా 4) ఇకైనోడెర్మటా

33. ముఖబాహ్య జీర్ణక్రియ కలిగిన జీవి ఏది?
1) సముద్ర నక్షత్రం 2) బొద్దింక
3) జలగ 4) పైలా

34. కింది వాటిలో సరికాని జత ఏది?
ఎ) ఏనుగు గర్భావధి కాలం – 600 రోజులు
బి) మానవుడి గర్భావధి కాలం – 280 రోజులు
సి) అపోజం గర్భావధి కాలం – 21 రోజులు
1) ఎ, బి 2) ఎ, సి
3) సి మాత్రమే 4) ఎ, బి, సి

35. ఆహార గొలుసులోని వివిధ పోషక స్థాయిలకు సంబంధించి కింది వాటిలో సరైన వరుసక్రమం ఏది?
1) ఉత్పత్తి దారులు– ద్వితీయ వినియోగదారులు – విచ్ఛిన్నకారులు – ప్రాథమిక వినియోగదారులు
2) ఉత్పత్తి దారులు–ప్రాథమిక వినియోగదారులు – ద్వితీయ వినియోగదారులు – తృతీయ వినియోగదారులు
3) ప్రాథమిక వినియోగదారులు – ఉత్పత్తి దారులు – విచ్ఛిన్నకారులు
4) విచ్ఛిన్నకారులు – ద్వితీయ వినియోగదారులు – ప్రాథమిక వినియోగదారులు

36. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ఆల్బుమిన్, గ్లోబ్యులిన్లు ప్లాస్మాలో ఉండే ప్రొటీన్లు
బి) ఆప్సిన్యూరిన్ కంటిలో ఉండే ప్రొటీన్
సి) కెసిన్ పాలలో ఉండే ప్రొటీన్
1) ఎ, బి 2) ఎ, సి
3) ఎ, బి, సి 4) బి మాత్రమే

37. క్షీర గ్రంథులు ఏ గ్రంథులకు రూపాంతరాలు?
1) స్వేద గ్రంథులు
2) సెబేషియస్ గ్రంథులు
3) వాసన గ్రంథులు 4) ఏదీకాదు

38. మైటాసిస్ దేనిలో జరుగుతుంది?
1) పరాగ రేణువులు 2) శాఖీయ కణాలు
3) పిండం 4) అండం

39. కణజాల వర్ధనంలో అర్థఘన యానకాన్ని తయారు చేయడానికి కావలసిన పదార్థం?
1) అగార్ – అగార్ 2) జిగురు
3) రెసిన్ 4) పిండి పదార్థం

40. మొక్కల్లో కేంద్రక రహిత సజీవ కణం ఏది?
1) దారునాళం
2) చాలనీ నాళ మూలకాలు
3) దృఢ కణాలు 4) దవ్వరేఖ

41. వర్గీకరణకు మూల ప్రమాణం ఏది?
1) ప్రజాతి 2) జాతి
3) కుటుంబం 4) రాజ్యం

42. ఆహారంగా తీసుకునే 'క్యాబేజీ' ఒక:
1) ఫలం 2) పుష్ప విన్యాసం
3) మొగ్గ 4) పుష్పం

43. కింది వాటిలో సరికానిది?
1) జనుము, కంది, వేరుశెనగ, చిక్కుడు.. ఫాబేసి కుటుంబానికి చెందినవి
2) క్యాబేజీ, కాలీఫ్లవర్, ముల్లంగి, ఆవాలు.. బ్రాసికేసి కుటుంబానికి చెందినవి
3) వంగ, టమాట, బంగాళదుంప, మిరప.. కుకుర్బిటేసి కుటుంబానికి చెందినవి
4) ఉల్లి, వెల్లుల్లి, కలబంద.. లిల్లియేసి కుటుంబానికి చెందినవి

44. మామిడి పండులో తినగలిగే భాగం ఏది?
1) మధ్య ఫలకవచం
2) అంతర ఫలకవచం
3) బాహ్య ఫలకవచం 4) విత్తనం

45. జీవానికి భౌతిక ఆధారం ఏది?
1) సైటోప్లాజమ్ 2) జీవ పదార్థం
3) కేంద్రక రసం 4) కణరసం

46. పక్వ స్థితిలో ఉన్న టమాట ఫలాన్ని సూదితో గుచ్చితే నీరు లాంటి ద్రవం వస్తుంది. ఈ ద్రవం నిల్వ ఉండే భాగాన్ని ఏమంటారు?
1) కణ ద్రవ్యం 2) ప్లాస్టిడ్
3) రిక్తిక 4) కేంద్రకం

47. క్షయకరణ విభజనలోని ఏ దశ కొత్త జాతుల ఆవిర్భావానికి, పరిణామ మార్పులకు తోడ్పడుతుంది?
1) డిప్లోటీన్ 2) డయాకైనసిస్
3) జైగోటీన్ 4) పాకిటీన్

48. జతపరచండి.
జాబితా – I
i) వృక్ష రాజ్య ఉభయచరాలు
ii) బొటానికల్ స్నేక్స్
iii) ఫానిరోగామ్స్
iv) కవచ రహిత విత్తనాలు (నగ్న విత్తనాలు) ఉండే మొక్కలు
జాబితా – II
a) వివృత బీజాలు
b) బ్రయోఫైటా మొక్కలు
c) టెరిడోఫైటా మొక్కలు
d) పుష్పించని మొక్కలు
e) పుష్పించే మొక్కలు

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	ii	iii	v	i
3)	ii	iii	iv	v
4)	iii	iv	v	ii

49. గంగానదిలో నీటిని శుభ్రపరుస్తున్న బ్యాక్టీరియా ఏది?
1) డెలొవిబ్రియో బ్యాక్టీరియోవోరస్
2) బాసిల్లస్ డీనైట్రోఫికేన్స్
3) సూడోమోనాస్ పుటిడా
4) క్లాస్ట్రీడియం బోట్యులినమ్

50. కింది వాటిలో ఏక కణ ప్రొటీన్‌గా ఉపయోగపడని జీవి ఏది?
1) ఈస్ట్ 2) బ్యాక్టీరియా
3) వైరస్ 4) శైవలం

సమాధానాలు

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 2	7) 2	8) 4	9) 4	10) 2
11) 1	12) 3	13) 2	14) 2	15) 3
16) 4	17) 4	18) 3	19) 2	20) 1
21) 1	22) 1	23) 3	24) 3	25) 1
26) 2	27) 2	28) 4	29) 1	30) 3
31) 1	32) 4	33) 1	34) 3	35) 2
36) 3	37) 2	38) 2	39) 1	40) 2
41) 2	42) 3	43) 3	44) 1	45) 2
46) 3	47) 4	48) 2	49) 1	50) 3

How many persons are there..



K.M. Jaya Rao
Subject Expert, Hyderabad.

IBPS RRB Special Reasoning

Model Questions

Directions (Q.No. 1 - 5): Read the information carefully and answer the following questions:

Seven friends A, B, C, D, E, F and G play different games - Cricket, Volleyball, Football, Basketball, Badminton, Snooker and Tennis not necessarily in the same order. Each one of them has a liking for a different character- Thor, Ironman, Hulk, Spiderman, Captain America, Deadpool and Hawk Eye not necessarily in the same order. Three of them are boys. A likes Spiderman but does not play Cricket. The one who plays Volleyball likes Hawk Eye and is a boy. C plays Tennis and does not like Hulk. D plays Football and he does not like Thor. F likes Hawk Eye and E likes Deadpool. The one who likes Ironman plays Badminton. B does not like Badminton.The boy who plays Basketball likes Captain America.

1. Who plays Volleyball?
1) A 2) G 3) F
4) Cannot be determined
5) None of these

2. Which of the following is the group of boys?
1) F, C, D 2) F, B, D
3) B, D, A
4) Cannot be determined
5) None of these

3. Which game is played by E?
1) Volleyball 2) Badminton
3) Snooker 4) Cricket
5) None of these

4. Who plays Snooker?
1) A 2) B 3) E
4) Cannot be determined
5) None of these

5. Which of the following combinations of Character - Person - Game is correct?
1) Ironman - G - Basketball
2) Captain America - D - Football
3) Dead pool - E - Volleyball
4) Ironman - G - Badminton
5) None of these

6. Which character is liked by 'B'?
1) Captain America
2) Thor 3) Hulk
4) Ironman 5) None of these

Directions (Q.No. 7 - 12): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: 35 24 maintain 87 safe distance 60 12 other cats
Step-1: cats 35 24 maintain 87 safe distance 60 other 12
Step-2: 24 cats 35 maintain 87 safe 60 other 12 distance
Step-3: maintain 24 cats 87 safe 60 other 12 distance 35
Step-4: 60 maintain 24 cats 87 safe 12 distance 35 other
Step-5: safe 60 maintain 24 cats 12 distance 35 other 87

And Step 5 is the last step of the above arrangement, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate steps for the given input.

Input: 35 and 15 days concept time 50 75 be 60

7. Which element is third the right of the element which is seventh element from the right end in the last step of the given arrangement?
1) 75 2) time 3) be
4) 60 5) days

8. What is the position of 'concept' from the right end in the second - last step of the given arrangement?
1) Eighth 2) Sixth 3) Ninth
4) Seventh 5) Tenth

9. Which element/s is/ are exactly between 'concept' and 'time' in the fourth step of the given arrangement?
1) Both 'and' and '35'
2) days
3) There is no element
4) Both 'days' and 'concept'
5) 35

10. What is the position of 'concept' from the left of '60' in the third step of the given arrangement?
1) Fourth 2) Sixth
3) Ninth 4) Seventh
5) Fifth

11. In which step of the given arrangement are the elements 'time 50 75 60' found in the same order?
1) Fourth 2) Second
3) Third 4) Fifth
5) The given order of elements is not found in any step

12. Which of the following is the last step of the given arrangement?
1) time 60 concept 35 and 15 be 50 days 75
2) time days concept be and 15 35 50 60 75
3) 15 35 50 60 75 time days concept be and
4) time days concept be and 15 35 50 60 75
5) time 75 concept 50 15 and be 35 days 60

Directions (Q. No. 13 - 18): Study the following information carefully and answer the given questions.

There are six sports persons A, D, O, P, Q and R whose earnings are different based on their performance. Each one has a different pet name - Viru, Tillu, Bannu, Fani, Chinna and Pari but not necessarily in the same order. Each one has a car of different colour- blue, white, green, violet, yellow and black, again not necessarily in the same order. Bannu earns less than Chinna. Tillu owns black car. There is only one in between the person who has green colour car and Tillu in the order of earnings. Chinna has blue colour car. The person who has white colour car is the highest earner. There are two persons between D and P in the order of earnings. Neither D nor P owns white car. Q, who is Bannu, earns more than Viru and the one who owns black car. There are two persons between Bannu and A in the order of earnings. A is not the least earner. O earns less than only P and Pari. The person who owns violet car is earning least.

13. How many persons are there between A and R in the order of earning?
1) One 2) Two 3) Three
4) Four 5) None

14. Who earns more than only the least earner?
1) A 2) O 3) Q
4) Tillu 5) None of these

15. Who among the following earns maximum?
1) A 2) O 3) Q
4) The person whose pet name is Chinna
5) None of these

16. Which of the following is not correct?

1) A	Pari	White
2) P	Chinna	Blue
3) R	Viru	Violet
4) O	Fani	Yellow
5) D	Tillu	Black

17. Who is Fani?
1) A 2) O 3) R
4) D 5) None of these

18. Who is ranking third in the descending order of earning?
1) A 2) O 3) Q
4) P 5) None of these

Directions (Q.No. 19 - 22): Study the following arrangement of letters, digits and symbols carefully to answer the questions given below.

A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?

19. If all the numbers are deleted from the above arrangement, and the remaining set of elements is reversed, then which of the following will be fourth to the left of the 10th element from the left end?
1) £ 2) E 3) Z
4) = 5) None of these

20. If every third element is dropped from the first in the above series till the end, then how many symbols, letters and numbers respectively which remain in the series?
1) 6,6,4 2) 5,5,6
3) 6,4,6 4) 4,6,6
5) None of these

21. How many such symbols are there in the arrangement each of which is not immediately followed by a number?
1) Five 2) Four 3) One
4) Two 5) None of these

22. If 1©5 is related to P8Z in a certain way, then in the same way G9A is related to:
1) 8=P 2) £L?
3) 87L 4) 8=@
5) None of these

Key with Explanations

(1-6):

Person	Gender	Character	Game
A	–	Spiderman	Snooker
B	+	Captain America	Basketball
C	–	Thor	Tennis
D	+	Hulk	Football
E	–	Deadpool	Cricket
F	+	Hawk Eye	Volleyball
G	–	Ironman	Badminton

1) 3 **2)** 2 **3)** 4 **4)** 1
5) 4 **6)** 1

(7-12):

Words have been picked up alphabetically and numbers have been picked up in ascending order.

In the first step, Word and number have been arranged in the first position and last position respectively.

In the second step word and number have been arranged in the last and the first position respectively, and the process is repeated.

Input: 35 and 15 days concept time 50 75 be 60
Step-1: and 35 days concept time 50 75 be 60 15
Step-2: 35 and days concept time 50 75 60 15 be
Step-3: concept 35 and days time 75 60 15 be 50
Step-4: 60 concept 35 and time 75 15 be 50 days
Step-5: time 60 concept 35 and 15 be 50 days 75

and Step 5 is the last step.

7) 3; be **8) 3;** ninth
9) 1; both 'and' and '35'
10) 2; sixth
11) 2; second
12) 1; time 60 concept 35 and 15 be 50 days 75

(13 -18):

Order of Earnings	Persons	Pet name	Colour of car
Highest earner	A	Pari	White
	P	Chinna	Blue
	O	Fani	Green
	Q	Bannu	Yellow
	D	Tillu	Black
Least earner	R	Viru	Violet

13) 4; Four
14) 4; Tillu **15) 1;** A
16) 4; O Fani Yellow
17) 2; O **18) 2;** O

(19 - 22):

19) 3; Z (? @ P L £ Z)
20) 1; 6,6,4
Symbols: $, ©, β, =, £, @
Letters: A, H, N, Y, Z, P
Numbers: 9,5,3, 8,
21) 2; Four
Symbol immediately followed by letter: © G, β, T, =, Z
Symbol immediately followed by Symbol: @ ?
22) 2; £L?
A $ 1 9 © G H 5 6 N β T Y 3 7 = Z 2 £ 8 L P @ ?

The relation between 1©5 and P8Z is as follows:


(3rd from left) 1 © 5 :
+2 +3
(3rd from right) P 8 Z
–2 –3

'+' indicates counting in the forward direction
'–' indicates counting in the backward direction

(6th from left) G 9 A :
–2 –3
(6th from right) £ L ?
+2 +3

లెక్కించండి.. రంగులు వేయండి

ఇక్కడ ఉన్న బొమ్మలో ఏఏ పండ్లు ఎన్ని ఉన్నాయో లెక్కించి, కింద రంగులలో ఇచ్చిన బొమ్మల దగ్గర రాయండి. అన్నిటికీ కింద ఇచ్చిన మాదిరిగా రంగులు వేయండి.



మీకు తెలుసా?

ఒక్కో మేఘం బరువు దాదాపు వంద ఏనుగుల బరువుకు సమానం



అమెరికాలో మనుషులకన్నా తుపాకులే ఎక్కువగా ఉన్నాయి



సముద్రతీరాల్లో ఏటా కాలుష్యం కారణంగా పదిలక్షల పక్షులు, పదికోట్ల క్షీరదాలు మరణిస్తున్నాయి



చనిపోయాక నరకలోకం ఉంటుందని ప్రపంచంలో దాదాపు 71 శాతం నమ్ముతున్నారు



రోజూ రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగేవారికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు తక్కువగా వస్తాయట!



హనోకో చేప దాదాపు 250 సంవత్సరాలు బతుకుతుంది



చదవడం రాయడం రానివారు ప్రపంచంలో దాదాపు 78 కోట్ల మంది ఉన్నారు




మోనాలిసాకు కను బొమ్మలు ఉండవు



పూరించండి

పిల్లలూ... కింద గుమ్మడికాయలకు వరుసలో అంకెలు వేసి ఉన్నాయి. ఖాళీ గుమ్మడి కాయలకు ఏ అంకె ఉండాలో గుర్తించి పూరించండి.



నాన్నా చెప్పవా?

ఒక గుంపులోని జంతువులు ఎప్పటికీ ఆ గుంపులో ఉండవా?


భూమి మీద అనేక జంతువులు, పక్షులు ఎక్కడికక్కడ సమూహాలుగా జీవిస్తూ ఉండటం సర్వ సాధారణమైన విషయం. ఇలా గుంపులో ఒక భాగంగా జీవించడం వల్ల ఆయా జంతువులకు కొన్ని లాభాలతో పాటు నష్టాలూ ఉంటాయి. ముఖ్యంగా కరువు కాటకాలు, ఆహారం తగినంతగా దొరకకపోవడం వంటి ప్రతికూల పరిస్థితుల్లో గుంపులోని కొన్ని జంతువులు బాగా నష్టపోతాయి. ముఖ్యంగా మిగతా వాటి కన్నా బలహీనంగా ఉండే జంతువులు ఎక్కువ నష్టపోతాయి. ఏదేమైనా ఒక సమూహంలో పుట్టిన జంతువులు ఎప్పటికీ ఆ సమూహంలోనే ఉండటం అనేది జరగదు. కొన్ని జంతువులు తమకు తాముగా ఆ సముహం నుంచి విడిపోయి వేరుగా జీవించడమో, లేదా మిగతా జంతువులువాటిని వెళ్లగొట్టడమో జరుగుతుంది. ఉదాహరణకు ఒక సింహం గుంపులో పుట్టిన పిల్లలు పెరిగి పెద్దయ్యాక వాటిని మిగతా సింహాలు ఆ గుంపు నుంచి తరిమేస్తాయి. అలా తరిమేయబడ్డ సింహాలు కొంత కాలంపాటు ఒంటరిగానే జీవిస్తాయి. ఆ తరువాత ఏదైనా ఒక సింహాల గుంపులో భాగంగా మారేందుకు ప్రయత్నిస్తాయి. అయితే అదేమంత సులభమైన పని కాదు సుమా. అందుకై ఆ గుంపులోని మిక్కిలి బలమైన సింహంతో (సాధారణంగా నాయకుడితో)అవి పోట్లాడవలసి ఉంటుంది. అలా పోట్లాడిన ఆ సింహాన్ని ఓడించడం గాని, చంపడంగాని జరిగితే అప్పుడు దానికి ఆ గుంపులో స్థానం దక్కుతుంది. ఒకసారి స్థానమంటూ దక్కాక ఇక అది ఆ గుంపులో ఒక భాగమైపోతుంది.




దారి కనుక్కోండి



కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి



కింద ఇచ్చిన కోతి బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి.



విశాఖ సిటీ | సోమవారం | ఆగస్టు | 21 | 2017
సాక్షి

స్వచ్ఛతలో నంబర్ వన్

- మధురానగర్ హైస్కూల్‌కు స్వచ్ఛ విద్యాలయ జాతీయ పురస్కారం
- జిల్లాలో 280 ప్రభుత్వ హైస్కూళ్లు, 1900 ప్రాథమిక పాఠశాలలతో పోటీ పడి విజేతగా నిలిచిన వైనం



పరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు

సీతంపేట(విశాఖ ఉత్తర) :

ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల క్రమశిక్షణ మధురానగర్ జీవీఎంసీ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. మెరుగైన పరీక్షా ఫలితాలు, జాతీయ స్థాయి ఆటల్లో ముందంజలో ఉండే పాఠశాల స్వచ్ఛతలోనూ అవార్డు సాధించింది. జీవీఎంసీ 13వ వార్డు పరిధి మధురానగర్‌లో ఉన్న జీవీఎంసీ హైస్కూల్ జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ–2016 పురస్కారానికి ఎంపికైంది. జిల్లాలో 280 ప్రభుత్వ హైస్కూల్స్,1900 ప్రాథమిక పాఠశాలలు స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి పోటీపడగా హైస్కూల్ విభాగంలో జిల్లాలో మధురానగర్ స్కూల్ ఒక్కటే జాతీయ పురస్కారానికి ఎంపికకావడం విశేషం. ఈ మేరకు కేంద్ర మానవవనరుల శాఖ నుంచి సమాచారం వచ్చినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.కృష్ణ తెలిపారు. ప్రాథమిక పాఠశాల విభాగంలో జిల్లాలోని కేశవరం, దిబ్బపాలెం పాఠశాలకు కూడా జాతీయ పురస్కారం దక్కించుకున్నాయి.



పాఠశాలలో స్వచ్ఛభారత్ టీమ్ సభ్యులు

నాలుగు అంచెల్లో ఎంపిక

పాఠశాలలో తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రత, టాయిలెట్ల పరిశుభ్రత, తినడానికి ముందు, తిన్న తర్వాత హ్యాండ్ వాష్, సురక్షిత తాగునీరు, టాయిలెట్లలో నిరంతర నీటి సరఫరా, వెంటిలేషన్, డస్ట్ బిన్స్, రెయిన్ వాటర్‌హార్వెస్టింగ్ ఇవన్నీ పాఠశాలల్లో ఏ విధంగా అమలు అవుతున్నాయో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గత ఏడాది ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో ప్రతి అంశాన్ని వీడియో ద్వారా రికార్డ్ చేసి భద్రపరిచారు. పాఠశాలలలో పరిశుభ్రత, స్వచ్ఛతను బట్టి పాయింట్లు ఇచ్చారు. ఈ విధంగా ముందుగా నగర స్థాయి, జిల్లా స్థాయి పోటీలలో మంచి పాయింట్లు సాధించిన పాఠశాలలను రాష్ట్ర స్థాయి స్వచ్ఛ విద్యాలయ పోటీలకు నామినేట్ చేశారు. ఇలా రాష్ర స్థాయిలో 44 పాఠశాలలు ఎంపిక కాగా మధురానగర్ స్కూల్ స్థానం సంపాదించింది. రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన స్కూల్‌ను జాతీయ స్థాయి పురస్కారానికి నామినేట్ చేశారు. నామినేట్ అయిన 44 స్కూల్స్‌లో 21 పాఠశాలలకు మాత్రమే జాతీయ స్థాయి పురస్కారం దక్కింది.

వచ్చే నెల 1న ఢిల్లీలో అవార్డు ప్రధానం

వచ్చే నెల ఒకటో తేదీన న్యూఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో స్వచ్ఛ విద్యాలయ పురస్కారం అందజేస్తారని హెచ్‌ఎం తెలిపారు. అలాగే జాతీయ స్థాయిలో పురస్కారానికి ఎంపికైన ఒక్కో పాఠశాలకు రూ.50వేల నగదు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎంతో పాటు, ఒక విద్యార్థిని కూడా ఢిల్లీ ఆహ్వానించారని తెలిపారు.

సమష్టి కృషితో సాధ్యం



జీవీఎంసీ కమిషనర్ హరినారాయణ్ సహకారంతో పాఠశాలలో అన్ని సదుపాయాలు సమకూరాయి. ఆడపిల్లలకు, మగ పిల్లలకు వేర్వేరుగా టాయిలెట్లు నిర్మాణం జరిగింది, అలాగే టాయిలెట్లలో నిరంతర నీటి సరఫరా, సురక్షిత తాగునీటి సౌకర్యం సమకూరాయి. గ్రామ స్వరాజ్య సంస్థ పరిశుభ్రత, హ్యాండ్‌వాష్‌పై పిల్లలకు ఆరు నెలల పాటు వారానికి రెండు సార్లు శిక్షణా తరగతుల ద్వారా విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అలాగే ప్రతి తరగతి గదిలో 5 విద్యార్థులను ఎంపిక చేసి స్వచ్ఛభారత్ టీమ్‌గా ఏర్పాటు చేశాం. వీరి ద్వారా పాఠశాల పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నాం. జాతీయ స్థాయిలో స్వచ్ఛవిద్యాలయ పురస్కారానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమిష్టి కృషితో అవార్డు సాధించాం.

– వై.కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, మధురానగర్ హైస్కూల్

రోజూ స్వచ్ఛతపై దృష్టి



ప్రతి క్లాసులో ఐదుగురు విద్యార్థులు స్వచ్ఛభారత్ టీమ్‌గా ఏర్పడి చెత్త లేకుండా శుభ్రంగా ఉండేలా చూస్తున్నాం. ప్రతి రోజు 10 నిమషాలు పాఠశాల పరిశుభ్రతకు కేటాయిస్తాం. తరగతి గదిలో, పాఠశాల ఆవరణలో చెత్త కన్పిస్తే డస్ట్‌బిన్‌లో వేస్తాం. ప్రతి శనివారం స్వచ్ఛభారత్ పాటిస్తున్నాం.

–వి.ప్రవీణ్ ప్రకాష్, 10వ తరగతి విద్యార్థి

చాలా ఆనందంగా ఉంది



తినడానికిముందు, తిన్న తర్వాత హ్యాండ్‌వాష్ చేసుకుంటాం, దీనిపై నిర్మాణ్ సంస్థ అగాహన కల్పించింది. అలాగే టాయిలెట్ ఉపయోగించడానికి ముందు, తర్వాత నీటిని ఫ్లష్ చేయాలని శిక్షణ ఇచ్చారు. టాయిలెట్, పాఠశాల పరిసరాలు నీట్‌గా ఉంచాలని, వేస్ట్ పేపర్లు, ఇతర వ్యర్థాలు డస్ట్‌బిన్‌లో వేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛభారత్ టీమ్ విద్యార్థులు నితంతరం పర్యవేక్షిస్తూ పరిశుభ్రతను కాపాడుతున్నాం. జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉంది.

–బి.సంధ్య, 9వ తరగతి, మధురానగర్ పాఠశాల

ఘనంగా భువనేశ్వరిదేవి మహోత్సవం

సబ్బవరం(పెందుర్తి):

మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధిలోని యాతపాలెంలో వెలిసిన శ్రీ భువనేశ్వరీదేవి 84 ఆదివాసీ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో పాటుగా జిల్లా పరిషత్ చైర్మెన్ లాలం భవానీ భాస్కర్ ముఖ్య అమ్మవారికి పూజలు చేశారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది తరలివచ్చి పూజలు నిర్వహించారు. 84వ అదివాసి మహోత్సవంలో రామఫలం పత్రితో అమ్మవారిని పూజించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు అప్పలనాయుడు,ఆర్‌ఈసిఎస్ చైర్మెన్ కోటాన అప్పారావు, మాజీ ఎంపీపీ గండి దేముడు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ భువనేశ్వరీదేవికి మంగళ స్నానం చేయిస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



'సాక్షి' ఆధ్వర్యంలో భీమవరంలో

క్షత్రియ వధూవరుల వివాహ పరిచయ వేదిక

భీమవరం : క్షత్రియ వధూవరుల వివాహ పరిచయ వేదిక సెప్టెంబర్ 3వ తేదీన భీమవరంలోని శ్రీ అల్లూరి సీతారామరాజు సేవా సమితి, ఎ.ఎస్.ఆర్.నగర్, భీమవరంలో నిర్వహించనున్నారు. క్షత్రియ సామాజిక వర్గంలో వివాహ సంబంధాలు చూసుకోవడం సులభతరం చేయడానికి ఈ పరిచయ వేదిక మీకు ఎంతో ఉపయోగకరం. తమ పిల్లల వివాహ సంబంధాల కోసం ఈ వేదికలో పాల్గొనే తల్లిదండ్రులు ఆగస్టు 29 లోపు సాక్షి కార్యాలయంలో వధూవరుల వివరాలు, ఫోటోపాటు రూ.1300/–లు చెల్లించి నమోదు చేసుకోవలెను. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి వధూవరుల ఫోటో, వివరాలతో ఉన్న సీడీ అందజేయబడుతుంది. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు 9010203717

కేజీహెచ్‌లో ఇంతదారుణమా..?



ఎగ్జిబిషన్‌లో సాక్షిలో ప్రచురితమైన చిత్రాన్ని చూస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

- 'సాక్షి'లో ప్రచురితమైన ఫొటో చూసి చలించిన కలెక్టర్



సాక్షిలో ప్రచురితమైన ఛాయాచిత్రం

విశాఖ సిటీ : ఉత్తరాంధ్ర ప్రజలకు వైద్యాలయంగా భావించే కేజీహెచ్‌లో వైద్యం ఇంత దారుణంగా అందుతుందా..? అని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మే 30వ తేదీన ఈవైద్యమెంత కఠినం అనే శీర్షికతో సాక్షిలో కేజీహెచ్‌లో వైద్యం అందుతున్న దుస్థితికి అద్దం పట్టే ఫొటోను ప్రచురించింది. ప్రేమాభిమానాలతో వైద్యం అందాల్సిన చోట.. రోగులు చీదరింపులకు గురవుతున్నారు. విజయనగరానికి చెందిన నానాజీ అనే వ్యక్తి ప్రమాదంలో నడుముకి గాయమై, రెండు కాళ్లూ పోగొట్టుకొని కేజీహెచ్‌లో చేరాడు. దీనికి తోడు అనాథగా ఉన్న ఓ వృద్ధుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. వీరిని నిర్దాక్షిణ్యంగా కటిక నేలపైనే పడేశారు. కన్నీళ్లు పెట్టించే ఈ దృశ్యం సాక్షి ఫొటోగ్రాఫర్ తీశారు. విశాఖ మ్యూజియంలో రెండు రోజులుగా జరుగుతున్న ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా వచ్చారు. ఎగ్జిబిషన్‌లో ఉన్న ఈ ఫొటోను చూసి చలించిపోయారు. కేజీహెచ్‌లో ఇంత దారుణంగా వైద్యం అందుతుందా అని ఫొటో చూస్తూ... కలెక్టర్ ఉద్విగ్నానికి లోనయ్యారు.

మోడల్ సిటీ

- సత్తాచాటుతున్న విశాఖ మోడల్స్
- ర్యాంప్‌పై హొయలుపోతున్న వైజాగ్ బ్యూటీస్

అదో ఊహల ప్రపంచం.. అందాల తీరం
సెట్ అయితే ఓకే.. లేదంటే లైఫ్ గ్రాఫ్ డ్యామేజ్‌లో పడుతుంది
కాళ్ల కింద ర్యాంప్ వెక్కిరిస్తుంది
చుట్టూ ఉన్న కెమేరాలు భయపెడతాయి
ఫ్యాషన్‌ప్రపంచంలో ప్యాషన్‌తో వెళితే
లైఫ్ ఏమైనా కావొచ్చు
తారల్లా మెరవొచ్చు..నిండా మునగొచ్చు
అయినా సరే డోంట్‌కేర్ అంటోంది యూత్
మోడలింగ్ మానియాలో ఉంది
క్యాట్‌వాక్ చేసే తెలుగమ్మాయిలు పెరిగిపోయారు
ఈ మధ్య ఏ ఈవెంట్ జరిగినా మోడలింగ్..
అగ్గిపుల్ల ప్రమోషన్..గుండు సూది ప్రమోషన్
కారు మోడల్...బైక్ లాంచింగ్..కార్యక్రమం ఏదైనా
ముందుగా మెరిసేది మోడల్
అందుకే ఈ తళతళలు..ఈ కళకళలు..
శ్రీశ్రీ చెప్పిన ఓ మాట అటూ ఇటూ మారిస్తే కాదేదీ
మోడలింగ్‌కు అనర్హం అనొచ్చు
కాస్త ఒడ్డూ పొడుగూ ఉన్న అమ్మాయిలు
ర్యాంప్‌పై నడిస్తే ఐ కనక్ట్ అయ్యే మాట నిజమే..
అది మేల్ కావొచ్చు..ఫిమేల్ కావొచ్చు
అందుకే యూత్ మోడలింగ్‌కు కనెక్ట్ అయింది.
విశాఖలో మెరుపుతీగలు క్యాట్‌వాక్‌తో కేక పుట్టిస్తున్నారు

నేడు ప్రపంచ ఫ్యాషన్ డే

సందర్భంగా సిటీలో మోడల్స్‌పై ప్రత్యేక కథనం



మోడలింగ్‌ను ప్రోత్సహించండి

మోడలింగ్ అంటే సమాజంలో ఒక చిన్న చూపు ఉంది. నిజానికి మోడలింగ్ అంటే మన గురించి ప్రపంచానికి చాటి చెప్పడం. మోడలింగ్ వలన సెల్ఫ్ కాన్ఫిడెన్స్, భావ ప్రకటన అలవాటవుతుంది. మోడలింగ్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పుడు మార్గంలో ఉంటారని సమాజంలో ఒక భావన ఉంది. ఆ భావన చాలా తప్పు. ఎవరి అనుమతి లేకుండా వారి జీవితం తప్పుడు మార్గంలోకి వెళ్లాదు. మనం మంచిగా ఉండాలంటే మనల్ని ఎవరు చెడు మార్గంలోకి తీసుకొని వెళ్లారు. ఒక్క మోడలింగ్ లోనే కాదు అన్ని రంగల్లో మంచి, చెడు మార్గాలు ఉంటాయి. వాటిని ఎంచుకొనే వ్యక్తిపై ఆధారపడి ఉంటుంది. మోడలింగ్ అంటే చిన్న విషయం కాదు. చాలా పోటీ ఉంటుంది. ఆ పోటీని తట్టుకొని మన వ్యక్తం దెబ్బతినకుండా ఉండలాంటే చాలా కష్టపడాలి. అదే నేను చేస్తున్నాను. వైజాగ్‌లో మోడలింగ్ రంగం ఇప్పుడు ఇప్పుడే అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతనికి ఇక్కడ మోడల్‌గా రాణించాలంటే కష్టమే. సరదగా మోడలింగ్ చేసిన నేను ప్రస్తుతం నా జీవితం ఆశయంగా పెట్టుకుంటానని ఎప్పుడు అనుకోలేదు. మొదట్లో నేను మోడలింగ్ వైపు వెళ్తున్నాని చెప్పినప్పుడు నా స్నేహితులు, బంధువులు అందరూ నెగిటివ్‌గా మాట్లాడారు. ఇప్పుడు వారే నాగురించి గొప్పగా చెప్పుకుంటుంటే ఆనందంగా ఉంది. మిస్ ఇండియా టైటిల్ కోసం ప్రయత్నిస్తున్నాను. మా ఫ్యామిలీ సభ్యులు కూడా అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం నేను ఓ సినిమాలో నటిస్తున్నాను. భవిష్యత్‌లో నటనలో శిక్షణ తీసుకొని సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తా. మోడలింగ్ అంటే అందం ఒక్కటే కాదు, చాలా ఉంటాయి. చాలా మందికి మోడలింగ్‌లోకి రావాలని ఉంటుంది. కాని వారు పొట్టిగా ఉన్నామని, కలర్ లేమని రారు. నిజానికి మోడలింగ్‌లో శరీరం గురించి కాకుండా మనల్లో ఉన్న కాన్ఫిడెన్స్‌తో ఎదుటి వారిని మెప్పించాలి. అప్పుడే మోడలింగ్ రంగంలో రాణించవచ్చు.

–హర్షా బేద్, మిస్ ఆంధ్రా విజేత



ఎస్.స్నేహ, విశాఖ

ఇటు మోడల్‌గా...అటు యాంకర్‌గా...

స్నేహ...డిగ్రీ స్టూడెంట్. అటు మోడల్‌గా..ఇటు యాంకర్‌గా..యోగా టీచర్‌గా దూసుకుపోతోంది. డిగ్రీ చదువుతూనే తనకిష్టమైన రంగాల్లో సత్తాచాటుతోంది. చిన్నప్పటి నుంచే కూచిపూడిలో శిక్షణ పొందింది. ఇప్పటి వరకు భారతదేశంలో 500 వరకు ప్రదర్శనలు ఇచ్చింది. యోగాలో శిక్షణ తీసుకుంది. మెడిటేషన్ యోగాలో ఉచితంగా శిక్షణ ఇస్తోంది. నగరంలో జరుగుతున్న మోడల్ షోస్‌లో పాల్గొంటూ ర్యాంప్‌పై హొయలు ఒలికిస్తుంది. విశాఖలో జరిగే ఆడియో ఫంక్షన్లకు యాంకర్‌గా మెప్పించింది. ఈ రంగంలో మంచి చెడూ రెండూ ఉంటాయి. మన వ్యక్తిత్వంపైనే ఆధారపడి ఉంటుంది.



మోడల్ మేఘన



ఈవెంట్ సంస్థ ప్రారంభిస్తా

మోడలింగ్ రంగంలో రాణించేలన్నదే లక్ష్యం. ఇప్పటికే మిస్ రాజమండ్రి, మిస్ వెస్ట్ గోదావరి, మిస్ ఆంధ్రప్రదేశ్ లాంటి ఈవెంట్స్‌కు కో–ఆర్డినేటర్‌గా పనిచేశాను. కొత్తగా ఓ ఈవెంట్ సంస్థను ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నాను. నా చదువు పూర్తి అయిన వెంటనే అమల్లోకి తెస్తా. సినిమా అవకాశాలు వస్తున్నాయి. అయితే ఇప్పుడు ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాను. సినిమాలు వలన నా చదువుకు ఎలాంటి ఇబ్బంది రాకూడదని వాటిని అంగీకరించడంలేదు.

మిస్ విశాఖ ఫైనల్ పోటీల్లో పాల్గొనేటప్పుడు నాన్న ఆస్పత్రిలో ఉన్నారు. ఆయిన ధైర్యంగా వెళ్లిరా తల్లీ అంటూ ఆశీర్వదించారు. అంత సపోర్ట్ నాన్న నుంచి ఉంది. విశాఖలో చాలా మంది మోడలింగ్‌లో సత్తా చాటేవారున్నారు. కాని వారు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. సమాజంలో మోడలింగ్‌పై ఉన్న చెడు అభిప్రాయం పోవాలి.

–భారతి బెర్రి,
విశాఖ బెస్ట్ స్మైల్ విజేత



నేహా ఛటర్జీ, మోడల్

మోడలింగ్ అంత ఈజీ కాదు

మోడలింగ్ అంటే ప్రతి ఒక్కరికీ చిన్న చూపు. రకరకాల డ్రెస్సులు వేసుకొని, ముఖానికి రంగులు పూసుకొని తిరుగుతుంటారని భావన. కాని అలాంటి డ్రస్సులు వేసుకుని, హై హిల్స్ చెప్పులతో నడిస్తే చాలా నొప్పులు వస్తాయి. అలాగే శరీరం స్లిమ్‌గా ఉండాలంటే ఉదయాన్ని లేచి వ్యాయామం చేయాలి. ఫుడ్‌ను నియంత్రించాలి. ఇన్ని కష్టాలపడి మోడలింగ్‌లో నిలబడటం సామాన్య విషయం కాదు. నటన, డ్యాన్సులు అంటే చాలా ఇష్టం. ఒక సారి ఓ ఈవింట్‌లో డ్యాన్స్ చేశా. తరువాత అక్కడ ఉన్న కొందమంది నువ్వు మోడలింగ్ రంగంలోకి వస్తే బాగుంటుందని చెప్పారు. దాంతో ఈ రంగంలోకి వచ్చాను. ఇప్పటి వరకు 7 లఘు చిత్రాలు, 4 వీడియో సాంగ్స్ చేశాను. భవిష్యత్‌లో హీరోయిన్‌గా స్థిరపడాలని ప్రయత్నిస్తున్నాను. ఇప్పుడిప్పుడే యువత మోడలింగ్ రంగం వైపు చూస్తోంది. మోడలింగ్ రంగం వైపు వచ్చే వారు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధపడాలి.



నవ్య, విశాలాక్షినగర్



ఇటీవల నిర్వహించిన ఫ్యాషన్‌షోలో ర్యాంప్‌పై హొయలుపోతున్న మోడల్స్

మోడలింగ్ అంటే పిచ్చి

ఎన్ఐఎస్‌టీ(నోబుల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ)లో ఎంబీఏ పూర్తి చేసి మోడలింగ్ రంగంలో దూసుకుపోతున్నాడు హరికృష్ణారెడ్డి. ఇప్పటి వరకూ 30 మోడల్ షోలో ప్రదర్శ ఇచ్చాడు. సిటీలో మేల్ మోడల్స్ అతి తక్కువ మంది ఉన్నారు. వారిలో హరి తన బెస్ట్ ఫెర్ఫామెన్స్‌తో ఆకట్టుకుంటున్నాడు. చిన్నప్పటి నుంచి మోడలింగ్ అంటే పిచ్చి..అందుకే ఈ రంగంలో రాణించేందుకు కష్టపడుతున్నా. నగరంలో ఫ్యాషన్ షో ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి వల్ల మాలాంటి వాళ్లు సత్తాచాటుకునేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. భవిష్యత్తులో విశాఖ మోడలింగ్ రంగంలో హైదరాబాద్‌ను మించిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు.



హరికృష్ణారెడ్డి, గాజువాక



ద్వారకానగర్ (విశాఖ దక్షిణ)
బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు)
విశాఖ-కల్చరల్



మోడల్ ప్రణీత

ఫ్యాషన్..ఓ అందమైన కళ. వైజాగ్‌లో ఈ రంగం కొత్త ఒరవడి సృష్టిస్తోంది. సిటీయువత దీనిపై ఆసక్తి చూపుతోంది. ఈ మధ్య కాలంలో స్మార్ట్‌సిటీ ఫ్యాషన్ రంగానికి కేంద్రంగా మారింది. వివిధ వేదికల్లో నగర మోడల్స్ సత్తా చాటుతున్నారు. ముంబాయి, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకే పరిమితమైన ఫ్యాషన్ ఎగ్జిబిషన్లు వైజాగ్‌కూ విస్తరించాయి. ఈ మధ్య కాలంలో అనేక స్థాయిలో ర్యాంప్‌వాక్‌లు మొదలుకొని ఉత్పత్తుల ప్రదర్శనలు ఇక్కడ పెరిగాయి. పెద్ద నగరాల నుంచి దిగుమతి చేసుకునే ఫ్యాషన్ ఒరవడి నుంచి సొంతంగానే డిజైన్లను రూపుదిద్దుకునే స్థాయికి స్మార్ట్‌సిటీ చేరింది. నగరానికి చెందిన మోడలింగ్ హర్ష మిస్ ఢిల్లీ అందాల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే అఖిల భారతీయ స్థాయిలో శ్వేష రోహిత్ అనే అందాల రాణి తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. వైజాగ్ ఫ్యాషన్ రంగం మరింతగా విస్తరిస్తోంది. రోజురోజుకూ కొత్త ట్రెండ్స్ వస్తున్నాయి. రిటెయిల్ ఫ్యాషన్ ఔట్‌లెట్స్ కూడా సెక్సెస్ అవుతున్నాయి. ఫ్యాషన్ ఎగ్జిబిషన్లు, ప్రదర్శనలు, ర్యాంప్ వ్యాక్‌లతో నగరంలో హోరెత్తిస్తున్నాయి. గతంలో బెంగళూరు, కోల్‌కత్, ఢిల్లీ, ముంబాయి నుంచి ఫ్యాషన్ అడాప్ట్ చేసుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పెద్ద నగరాలతో సమానంగా వైజాగ్ నిలుస్తోంది. ఇప్పటికే కొన్ని సంస్థలు ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులను ప్రవేశ పెట్టాయి. ఉన్నతస్థాయి ఫ్యాకల్టీతో సక్సెస్‌ను సాధిస్తున్నాయి.

నాలుగు సినిమాల్లో హీరోగా...

నగరానికి చెందిన సునీల్ చరణ్ (డాబాగార్డెన్స్) పెద్ద నటుడు కావాలని చిన్నతనం నుంచే కలలుగన్నాడు. కుమారుడు ఉత్సాహాన్ని తల్లిదండ్రులు విజయ్‌కుమార్, ఈశ్వరి గమనించి ఆ దశిగా ప్రోత్సహించారు. చిన్న చిన్న మోడల్ షోలో పాల్గొంటూ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకున్నాడు. అన్ని రంగాల్లో శిక్షణ పొందాడు. ఇప్పటికే అనేక ఆల్బమ్స్‌లో నటించాడు. పాటలు కూడా రాస్తాడు. ఏమయింది, బ్రహ్మరాత, పోరు వంటి తెలుగు సినిమాల్లో నటించాడు. ఓ తమిళ సినిమా కూడా నటించాడు. విశాఖ డాబాగార్డెన్స్‌లో 9వీఎఫ్ఎక్స్ ఎడిటింగ్, గ్రాఫిక్స్, ఫిల్మ్ ప్రొడక్షన్ స్టూడియో నిర్వహిస్తున్నాడు. అటు ఉపాధి పొందుతూనే సినిమాల్లో మంచి పాత్రలకోసం ట్రై చేస్తున్నాడు.



ర్యాంప్ స్టార్ అనుషా

సీతమ్మధారకు చెందిన అనూషా ర్యాంప్‌పై నడిచొస్తే కెవ్వు కేకే. మోడల్‌కు కావాల్సిన లక్షణాలన్నీ ఉన్నాయి. గీతంలో ఎంబీఏ పూర్తిచేసిన అనూషా మంచి మోడల్‌గా, నటిగా రాణించాలని ప్రయత్నిస్తోంది. అటు మోడల్‌గా, ఇటు నటిగా మెప్పిస్తోంది. ఆమె నటించిన ఇలా..ఎలా షార్ట్‌ఫిల్మ్ యూట్యూబ్ ప్రియులను ఫిదా చేసింది. ‘ ఇదేమి ట్విస్ట్’, ‘ గాంధారీ’ షార్ట్‌ఫిల్మ్‌లో నటించింది. అలాగే నాని హీరోగా నటించిన నిను కోరి చిత్రంలో నటించింది. నగరంలో వివిధ మోడల్ షోస్‌లో పాల్గొంది. లోకల్ మోడల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తే ఎక్కువ మంది అమ్మాయిలు ఈ రంగంలో రావడానికి సిద్ధంగా ఉన్నారని చెబుతోంది.



మిస్ ఆంధ్రాలో సత్తా

నవ్య..ఇప్పటికే మోడలింగ్ రంగంలో తనేంటో నిరూపించుకుంది. విశాఖ ఫ్యాషన్ కల్చర్‌లో ఆమె పేరు అందరికీ సుపరిచయమే. తండ్రి బోజిరాజు పోలీసు ఉద్యోగి. ఆయన సినిమాల్లో నటించాలని కోరిక ఉండేది. ఉద్యోగ రీత్యా అది సాధ్యం కాలేదు. తన కలను కూతురు రూపంలో నిజం చేసుకోవాలని భావించాడు. మోడలింగ్ రంగంలో కూతుర్ని ప్రోత్సహిస్తూ తన కలను నిజం చేసుకుంటున్నారు. విశాఖలో జరిగిన మిస్ విశాఖ -2016లో రన్నరప్‌గా నిలిచింది. బెస్ట్ ఐస్ విభాగంలో విజేతగా నిలిచింది. ఇటీవల విజయవాడలో జరిగిన మిస్ ఆంధ్రా పోటీలో ఫైనల్ వరకూ వెళ్లింది. భవిష్యత్తులో మంచి మోడల్‌గా, సినీ నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉందని చెప్పింది.

షార్ట్‌ఫిల్మ్స్‌లో రాణిస్తూ...

మౌనిక..మంచి మోడల్. ర్యాంప్ వాక్ చేస్తూ విశాఖవాసులను మైమరిపిస్తోంది. ఇప్పటికే చాలా మోడల్ షోస్‌లో పాల్గొంది. ఎస్ఆర్‌కే కళాశాలలో బీటెక్ పూర్తి చేసి పూర్తిస్థాయి మోడల్‌గా నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. షార్ట్‌ఫిల్మ్స్‌లో నటిస్తూ మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. కొత్తవారితో సెప్టెంబర్‌లో నిర్మించే ఓ చిత్రంలో అవకాశం వచ్చింది. అటు మోడలింగ్, ఇటు సినిమా రంగంలో రాణించాలన్నదే ధ్యేయమని చెబుతోంది.



మౌనిక, సీతమ్మధార

తలకెక్కిన క్రియేటివిటీ



టేల్స్‌కట్ ఫ్యాషన్‌లో నాగరాజు



స్పైక్స్ కట్‌లో విజయ్‌కుమార్

విజయ్‌కుమార్ ట్రెండ్ ఫాలో అవుతూ కొత్త ఫ్యాషన్స్‌ను ఎడాప్ట్ చేసుకుంటున్నాడు. గోపాలపట్నంలో సెలబ్రెటీ అయిపోయాడు. చంద్రనగర్‌కు చెందిన ఆదినారాయణ కూడా ఫ్యాషన్‌కు కొత్త భాష్యం చెబుతున్నాడు. లైన్స్ కటింగ్, కోకొడైల్, డెవిల్ కటింగ్, వెడ్డింగ్ అప్లికేషన్‌తో దుమ్మురేపుతున్నాడు. ఇక నరసింహనగర్‌కు చెందిన మనోజ్‌కుమార్‌లో కాస్త క్రియేటివిటీ ఎక్కువేనొండోయ్. సోషల్ వైబ్‌సైట్లు ఫాలో అవుతూ న్యూ ఫ్యాషన్స్‌ను అనుసరిస్తున్నాడు. బుచ్చిరాజుపాలెంకు చెందిన లక్ష్మణ్ అయితే పదేళ్లుగా న్యూ ట్రెండ్ క్రియేట్ చేస్తున్నాడు. ఇంటర్నెట్‌లో టాప్ మోడల్స్‌ను ఫాలో అవుతూ కటింగ్‌లకే కటింగ్ ఇస్తున్నాడు. నాకు నచ్చినట్టే నేనుంటా అంటున్నాడు.

- గోపాలపట్నం (విశాఖ పశ్చిమ)



క్రొకోడైల్ స్టైల్‌లో చిన్న



స్పైప్స్ కట్‌లో ఆదినారాయణ



ఉంగరాల స్టైల్లో లక్ష్మణ్